
సంపుటి : 74 సంచిక : 31 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ వైశాఖ అమావాస్య
30 మే - 05 జూన్ 2022
వెల : ₹15/-



# భూరక్షణ కోసం

*Save the soil*

ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్ ఈ మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టారు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

74 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# జగన్నాథ... జగన్నాథ..

భారతదేశంలో కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాల వైఖరి, గుడిని మింగేవాడు ఒకడైతే, గుడిలో లింగాన్ని మింగేవాడు ఒకడు అన్న తీరులోనే ఉంది. ప్రపంచ ప్రఖ్యాత పూరీ జగన్నాథ స్వామి ఆలయం చుట్టూ భక్తుల సౌకర్యార్థం పేరుతో నిర్మిస్తున్న శౌచాలయాలు, గదులు వ్యవహారం దీనినే నిరూపిస్తున్నది. మొన్న ఫిబ్రవరి నుంచి ఈ పనులు ప్రారంభమయ్యాయి. చిత్రం ఏమిటంటే ఈ పనుల కోసం గుడి చుట్టూ పునాదుల పేరుతో మరీ లోతుగా తవ్వుతున్నారు. దీనితో అసలు దేవాలయానికే ముప్పు వాటిల్లడం తథ్యమని భారత పురావస్తు శాఖ సహా అంతా నమ్ముతున్నారు.

శ్రీమందిర్ పరిక్రమ పేరుతో ఆరంభించిన ఈ పనుల వల్ల 12వ శతాబ్దానికి చెందిన ఈ ప్రపంచ సాంస్కృతిక వారసత్వ కట్టడానికి ముప్పు తప్పదని మే 12వ తేదీన భారత పురావస్తు శాఖ ఒరిస్సా హైకోర్టుకు విన్నవించింది. ఒడిశా బ్రిడ్జ్ కనస్ట్రక్షన్ కార్పొరేషన్ ఈ పనులు చేయిస్తున్నది. మొత్తం రూ. 800 కోట్ల ఈ పథకానికి నిరుడు నవంబర్‌లో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శంకుస్థాపన చేశారు. గుడి చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఏ నిర్మాణమూ చేపట్ట కూడదు. అలా చేస్తే అసలుకే మోసం. కానీ ఈ కొత్త నివాసాలు 75 మీటర్ల పరిధిలోనే నిర్మిస్తున్నారు. 100 మీటర్ల పరిధిలో నిర్మాణం చేపట్టవలసి వస్తే నేషనల్ మాన్యుమెంట్ అథారిటీ అనుమతి తీసుకోవాలి. అది జరగలేదనే ఇప్పుడు వివాదం చెలరేగింది. నిజానికి ఇప్పటి వరకు జరిగిన పనులలో ఒక పురాతన విగ్రహం కూడా లభ్యమైంది. ఇలాంటివి ఇంకా ఉంటే ఆ తవ్వకాలతో వాటికి నష్టం జరుగుతుందని కూడా భారత పురావస్తు శాఖ హైకోర్టుకు తెలియచేసింది. భువనేశ్వర్ లోక్‌సభ సభ్యురాలు అపరాజితా సారంగి (బిజేపీ) కూడా ఏప్రిల్‌లో దీని గురించి కేంద్ర సాంస్కృతిక శాఖకు ఫిర్యాదు చేసి, పనులు ఆపించవలసిందని కోరారు.





తామెవరో, ఎటువంటి ఘనచరిత్రకు వారసులో
మన భావితరాలకు తెలియాలి గదా!
ఆ దృష్టితో రూపొందించినదే ఈ బాల పుస్తకమాల
భారత భారతి
డా॥ బి.ఆర్. అంబేద్కర్
సంత్ గాడ్గేబాబా
యాదవరావు జోషి
దత్తోపంత్ ఠేంగ్డీ
మహాత్మా జ్యోతిరావ్ పూలే
శ్రీనివాస రామానుజం
డాక్టర్ హెడ్గేవార్
భగత్ సింగ్
నివేదిత
స్వామి వివేకానంద
అతి తక్కువ ఖరీదులో లభిస్తున్న అత్యంత ఉపయోగకరమైన
భారత భారతి పుస్తకమాలను మీ ఇంటిలో,
పాఠశాలలో చదివించండి.
మీ పిల్లలు సవ్యమైనదిశలో ఎదగడానికి దోహదపడండి.
భారత భారతి బాల పుస్తకమాలగా ఇప్పటికి వెలువడిన
169 పుస్తకాలు విడివిడిగా ఒక్కొక్కటి 15 రూపాయలు.
మొత్తం సెట్ 2200 రూ॥లకే లభిస్తుంది.
విద్యారణ్య స్వామి
డా॥ జగదీశ చంద్రబోస్
రాణి దుర్గావతి
శ్రీకృష్ణదేవరాయలు
ఛత్రపతి శివాజీ
భగవాన్ బిర్సా ముండా
అల్లూరి సీతారామరాజు
హోమీ బాబా
సాహిత్యనికేతన్
3-4-852, కేశవనిలయం,
బర్కత్‌పురా, హైదరాబాద్ - 27.
దూరవాణి : 040-27563236
సాహిత్యనికేతన్
ఏలూరురోడ్, గవర్నరుపేట,
విజయవాడ - 2.
దూరవాణి : 9440643348

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, 1-1-60/5, Musheerabad, RTC 'X' Road, Hyderabad-500 020. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013**

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | 9959310103 |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |


డిజైనర్లు : సిహెచ్. కుమార్, ఎం. అనిత

తన వెనుక ఉండే నలుపు ఎంత చిక్కనో గురవింద గింజ ససేమిరా గుర్తించదట. అలాంటి గురవింద సైతం సిగ్గుతో చచ్చిపోయేటట్టు చేశారు మకుటం లేని కాంగ్రెస్ మహారాజు రాహుల్ గాంధీ. బ్రిడ్జ్ ఇండియా అనే ఓ చిల్లర సంస్థ మే 20న లండన్ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఈ గాంధీ వారసుడిని పిలిచింది. చర్చనీయాంశం ఏమనగా, ఐడియాస్ ఫర్ ఇండియా. ఇంకా సీతారాం ఏచూరి, తేజస్వీ యాదవ్, మహువా మొయిత్రా, మనోజ్ ఝా వంటి యావన్మంది బీజేపీ-ఆర్ఎస్ఎస్ విరోధ కూటమి లేదా భారత వ్యతిరేకులందరినీ 'బ్రిడ్జ్' అక్కడ కూడగట్టింది. రాహుల్ వెంట 'షాహిన్‌బాగ్' సమర్ధకుడు సల్మాన్ ఖుర్షీద్ కూడా ఉన్నారు. ఆర్ఎస్ఎస్/బీజేపీల పట్ల, మోదీ పట్ల భారతీయులకున్న నమ్మకాన్ని క్షణాలలో తుడిచెయ్యాలని కమ్యూనిస్టుల పోషణలోని ఆ బ్రిడ్జ్ ఆశ. కానీ, వాటిలో ఒక్క రాహుల్ ఉపన్యాసం మాత్రమే భారతీయులు గ్రోలే అవకాశం మీడియా కల్పించింది. ఆ మేరకు మీడియా అభినందనీయమే. మిగతా భారతీయ వక్తల ఉపన్యాసాలు ఇంకెంత నికృష్టంగా ఉన్నాయో!

సిద్ధం చేసి పెట్టుకున్న బీజేపీ/ఆర్ఎస్ఎస్ వ్యతిరేక ప్రశ్నలను వ్యాఖ్యాత ఆశిష్ రే సంధించడం, వాటికి తన వక్రభాష్యం, సొంత పైత్యం, అసత్య వచన నైపుణ్యం కలగలిపి రాహుల్ జవాబులు ఇవ్వడం. ఇదే తంతు. భారత్ కోసం ఆలోచనలంటే ఇవా? భారత్ అంటే ప్రజలు అన్న భావం కాంగ్రెస్ నరనరాల్లో తిష్ఠ వేసుకుని కూర్చుందట. కానీ ఆర్ఎస్ఎస్, బీజేపీ భారత్ అంటే అదొక భౌగోళిక భాగమని అనుకుంటాయట. ఇంకో అబద్ధపు మడుగును రాహుల్ లండన్‌లో సృష్టించారు. అది - మీడియా వందశాతం బీజేపీ పిడికిట్లోనే చిక్కుకుని ఉందట. భారత్‌ను తిరిగి అసలైన భారత్‌గా ఆవిర్భవింప చేయడానికి కాంగ్రెస్ అలుపూ సొలుపూ లేకుండా పోరాడుతున్నదట. ఇప్పుడు దేశం మొత్తం కనిపిస్తున్న సైద్ధాంతిక జాతీయ సమరం అదేనట. ముక్కున వేలేసుకోము అంటే ఇంకొక అబద్ధం, వారిదే-పాకిస్తాన్‌లో ఎలా ఉన్నదో, ఇండియాలో కూడా అలాంటి పాలనే

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ వైశాఖ అమావాస్య**

*లోపలి పేజీలలో...*



ముఖపత్ర కథనం
**భూరక్షణ కోసం**
6లో



జాతీయం
**పసలేని ఉపన్యాసాలు, పనికిరాని తీర్మానాలు**
12లో



ధారావాహిక నవల
**లంబసింగి రోడ్డు**
- డా॥ గోపరాజు నారాయణరావు
20లో

# జాగృతి

## సంపాదకీయం

సాగుతున్నదట. ఇంకా రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, భారత సరిహద్దులలో చైనా తిష్ఠ, భారత్ అంటే రాష్ట్రాల సమాఖ్య వంటి చాలా విషయాలు మాట్లాడి ప్రపంచ ప్రజల జ్ఞానానికి పదును పెట్టి, వారి కళ్లు తెరిపించడానికి రాహుల్ తనవంతు శ్రమించారు. భారతీయులకు సమస్య వచ్చినప్పుడు, కాంగ్రెస్ క్లిష్ట పరిస్థితులో ఉన్నప్పుడు, ఎన్నికలలో సొంత పార్టీ ధరావతులు కూడా దక్కకుండా చిత్తుచిత్తుగా ఓడిపోతున్నప్పుడు తాను దేశంలో ఉండకుండా, విదేశాలకి, అది కూడా గుర్తు తెలియని ప్రాంతాలకు పలాయనం చిత్తగిస్తానన్న సంగతి నుంచి వీక్షకుల దృష్టిని

# ఈ బుద్ధి మారదా?

మళ్లించడానికి అమోఘమైన ఒక విశ్లేషణ కూడా ఆయన చేశారు. మీరు చెబుతున్నదానిని బట్టి బీజేపీని ప్రజలు ఎప్పుడో ఓడించాలి కదా, ఇంకా ఎక్కువ సీట్లతో ఎందుకు గెలిపించారు అన్న ప్రశ్న రాకుండా, నిరుద్యోగ సమస్య దాదాపు అలాగే ఉన్నా బీజేపీ అధికారంలో ఉన్నదంటే కారణం– మీడియాని కబ్జా చేయడం, సమాజాన్ని విభజించడమే సుమా అంటూ జ్ఞానబోధ చేశారు.

రాహుల్ నోటి నుంచి నిఖార్సయిన అబద్ధాలే కాదు, కొన్ని నిష్ఠురసత్యాలూ జాలువారాయని ఒప్పుకోవాలి. పైగా అవన్నీ తమ కుటుంబ శతాధిక వత్సరాల, ఘనత వహించిన కాంగ్రెస్ పార్టీకి సంబంధించినవే. మా పార్టీ అంతరంగిక కుమ్ములాటలతో చస్తూ బతుకుతోంది. తిరుగుబాట్ల రోగంతో బాధ పడుతోంది. ఫిరాయింపుల పితలాటకాలతో దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్టే కాలం వెళ్లదీస్తున్నది. ఏ ఎన్నిక వచ్చినా ఓటమి తమ పార్టీనే వెన్నంటి ఉంటున్న సంగతినీ యువరాజు మరచిపోకుండానే ప్రస్తావించారు. అయితేనేం, బీజేపీ మీద తమ పార్టీ పోరాటం సాగుతూనే ఉంటుందని ఘంటాపథంగా చెప్పారు.

ఇది కదూ, ఇంటి పేరు కాంగ్రెస్ వారు, ఇంట్లో గబ్బిలాల కంపు అంటే. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న గుజరాత్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు హార్దిక్ పటేల్ పార్టీ ముఖాన రాజీనామా లేఖ విసిరి ఏమన్నాడు? యావన్మంది గుజరాత్ కాంగ్రెస్ పెద్దలకి రాష్ట్ర సమస్యల కంటే, ఢిల్లీ నుంచి దిగిన నేతలకి సమయానికి చికెన్ శాండ్‌విచ్‌లు అందాయో లేదో అన్న విషయమే ముఖ్యమని చెప్పలేదా? ఏమో అనుకున్నాం గానీ, ఈ పటేల్ మర్యాదస్తుడే. లేకపోతే ఢిల్లీ నుంచి వచ్చిన వారికి ఇంకా ఏమేం అమరుతూ ఉంటాయో, ఆ దేవరహస్యాలన్నీ విప్పేవాడే. నిన్నగాక మొన్న జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ మట్టికొట్టుకు పోయింది. ఆ రాష్ట్ర సీనియర్ నేత సునీల్ జాఖడ్ తాజాగా బీజేపీ కండువా కప్పుకున్నారు. కర్ణాటకలో ప్రమోద్ మధ్వరాజ్ అదే బాటలో ఉన్నాడు. ఇన్నీ చెప్పుకుని ప్రశాంత్ కిశోర్ ప్రహసనం మరిస్తే ఎలా? ఆయన, మీకు దణ్ణం, మీ పార్టీలో చేరికకు ఒక దణ్ణం, మీ పార్టీ సమస్యల పరిష్కారానికి రెండు దణ్ణాలు అని చెప్పలేదూ! పైగా వచ్చే గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలలో కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోవడం ఖాయమని జోస్యం కూడా చెప్పేశాడు.

మరణశయ్య మీద ఉన్న సొంత పార్టీ సంగతి పట్టదు కానీ, విదేశీ వేదికలెక్కి భారతదేశాన్ని, భారతీయ జనతాపార్టీని ఆడిపోసుకోవడానికి రాహుల్ వంటి కుక్కమూతి పిందెలకి కావలసినంత సమయం ఉంటుంది. భారత్ ఏమాత్రం మంచిచోటు కాదు. అక్కడంతా బీజేపీ/ఆర్ఎస్ఎస్ వారు కిరోసిన్ చల్లేశారు అంటూ అంతర్జాతీయ వేదికల మీద నోరు పారేసుకోవడాన్ని ఇంకేమనాలి? ఈ విపరీత బుద్ధి మారదా? బీజేపీ కిరోసిన్ చల్లిందో లేదో కానీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు, తేజస్వి వంటి ప్రాంతీయ పార్టీల నాయకులు దేశంలో ఏదో విధంగా మంటపెట్టాలని నిప్పు కణికలతో నిరంతరం ప్రయత్నిస్తున్న మాట ముమ్మాటికీ సత్యం. ★

30 మే 2022, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




అంతర్జాతీయం
**భారత్-నేపాల్ బంధం మరింత పటిష్టం**
26లో



మహిళ
**శతాధిక నాయిక తిమ్మక్క**
36లో

కథ
**ఇంతలేసి జీవితాలు**
– వదలి రాధాకృష్ణ



32లో

కథ
**పంటపొలాలు**
– చొప్పదండి సుధాకర్



40లో

| | | |
|---|---|---|
| తెలంగాణ అమరుల త్యాగాలు గుర్తులేవా? (తెలంగాణ) | – | 14 |
| పెట్రో ధర తగ్గింపు రాష్ట్రానికి పట్టదా? (ఆంధ్రప్రదేశ్) | – | 16 |
| ఆధ్యాత్మికం | – | 18 |
| దండు నారాయణరాజు (ఆజాదీ కా అమృత్ మహోత్సవ్) | – | 24 |
| పనే పరదైవం (వికాసం) | – | 28 |
| ఐతిహాస సాహిత్య వ్యాసుడు – త్రోవగుంట (సాహిత్యం) | – | 30 |
| వార్తా విశేషాలు | – | 35 |
| తాంబూలం–10 (ఆరోగ్యం:ఆనందం) | – | 38 |
| సరికొత్త చాంపియన్ నిఖత్ (క్రీడ) | – | 43 |
| జాతీయోద్యమాన్ని ప్రదీప్తం చేసిన తెలుగుకవులు | – | 44 |
| బాలజాగృతి | – | 46 |
| వారఫలాలు | – | 48 |
| పదరసం | – | 49 |
| కష్టాల కడగళ్ల నడుమ 'శేఖర్' (సినిమా) | – | 50 |




'మాతా భూమిః పుత్రోహం పృథివ్యాః'

తల్లి భూమి, నేను ఆమె పుత్రుడను అంటుంది ఆర్ష వాఙ్మయం. అంటే భూమి పట్ల భారతీయులకు ఉన్న దృష్టి అది. ఆ తాత్వికత ఎంత సనాతనమో, అంత ఆధునికం. ఎంత అవసరమో, అంత వాస్తవికం.

నేల తల్లి, కేవలం ఒక వనరు కాదు, తరతరాల ఆస్తి అని భావిస్తున్నది పాశ్చాత్య చింతన. పుడమిని రక్షించుకోవాలి. ఇదొక అమృతోపమానమైన భావన. నేడు భూగోళమే ప్రమాదంలో పడింది. నేల కూడా తల్లే. కాపాడుకోవాలి. రేపటి తరం కోసం అలాంటి స్పృహ, చైతన్యం తేవాలి. ఇలాంటి నిర్మాణాత్మకమైన ప్రయత్నం గతంలోనూ జరిగింది. ఇప్పుడు కూడా అలాంటి ఆకాంక్ష కోట్ల హృదయాలలో ఉంది. ప్రపంచ ప్రజాళి ఆశయం అని చెప్పినా చెప్పవచ్చు. అందుకు ఇటీవల కాలంలో భూమికి జరుగుతున్న చేటు కారణం. ఆ సంగతి దేశదేశాల అధినేతలకు తెలియచేసే ఉద్దేశంతో ఆరంభించినదే 'సేవ్ ది సాయిల్' అంతర్జాతీయ ఉద్యమం. కాన్షస్ ప్లానెట్ మూవ్‌మెంట్ టు సేవ్ సాయిల్‌గా ఈ ఉద్యమం విశ్వవ్యాప్తమవుతున్నది. ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్ ఈ మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. నేల తల్లిని రక్షించుకోవడానికి, నేలనూ, ప్రకృతినీ పునరుత్తేజం చేయడానికి అన్ని దేశాల ప్రజలు పటిష్టమైన చట్టాలు రావాలని కోరుతున్న సంగతిని దేశాధినేతల దృష్టికి తీసుకురావడమే ఈ ఉద్యమం అసలు ఉద్దేశం.

# భూర

పుడమిని రక్షించుకుందామన్న నినాదం వెనుక మహోన్నతమైన తాత్త్వికత ఉన్నది. భారతీయమైన ఆధ్యాత్మిక చింతన కలిగినవారు కాబట్టి సద్గురు జగ్గీ వాసుదేవ్ ఇంత ఉగ్రంగా స్పందించగలిగారన్నా అతిశయోక్తి కాదు. ప్రకృతిని తల్లిగా భావించి, పూజిస్తూ అది ఇచ్చే ఫలాలను ప్రసాదంగా స్వీకరించమంటుంది మన ధర్మం. నీరు, భూమి, గాలి, అగ్ని, ఆకాశం– వీటిని పంచభూతాలుగా చెబుతుంది భారతీయత. ఇవి సహకరించకపోతే మానవుడు ఎంత ప్రయత్నం చేసినా అది విఫలమే. అలాగే అవి ఆగ్రహిస్తే ఎంత ఆధునికునికైనా ఎదురయ్యేది వినాశనమే. కాబట్టి పంచభూతాలకే కాదు, మనిషికి మూలాధారమూ పుడమేనని అంటారు సద్గురు. పుడమి సకల ప్రాణికోటికి ఆధారమే. కానీ దాని రక్షణలో పెద్ద బాధ్యత మాత్రం మానవాళిదే.



ఎందుకంటే దానిని నాశనం చేస్తున్నది మనిషి మాత్రమే. పశుపక్ష్యాదులు కాదు.

**ఆధ్యాత్మిక కోణం**

నీ శరీరాన్ని ప్రాణంతో నిలిపి ఉంచేందుకు నీవు తీసుకునే ప్రతి ముద్ద, నీటిచుక్క భూమి అందించేదే. భూమి అవసరం అక్కడివరకే అనుకుంటే అదొక ద్రోహం. మన శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అనుభూతులకు వేదిక కూడా ఈ భూమే. భూమి అంటే భౌతికావసరాలు తీర్చే ఒక గ్రహం అన్న భావన నుంచి బయటపడి, తల్లి అనే కోణం నుంచి ఆధ్యాత్మిక, సాంస్కృతిక దృష్టితో పరికిస్తేనే మట్టి విలువ మనసును తాకుతుంది. మట్టి వాసన గుండెను ఊయలలు ఊపుతుంది. ప్రయోగశాలల్లో గాలి, నీరు, అగ్ని కొంచెమైనా సృష్టించవచ్చునేమో కానీ, పిడికెడు మట్టిని కూడా తేలేరు. భారతీయ సంస్కృతి అందుకే పుడమిని అంతగా ప్రేమించాలని చెప్పింది. కానీ ఇవాళ మట్టి అన్న పదాన్ని బురద అన్న అర్థంలో కొందరు ప్రయోగించడం వింటున్నాం. మట్టిని చేతిలోకి తీసుకున్న పసివాళ్లను చూసి తల్లులు 'ఛీ..ఛీ..మట్టి' అంటున్నారు. వాళ్లు తాకినది బురదని కాదు, వాళ్లకు జన్మనిచ్చిన ఒక మూలకాన్ని. నీకు జన్మనిచ్చిన మట్టిని బురదగా చూడడం అంటే నీ వేళ్లు దాని నుంచి దూరమైనట్టే.

ఆధ్యాతిక కోణం నుంచి ఒక నిమిషం బయటకొచ్చి యోచించినా.. భూసంరక్షణ అంటే ఆహార భద్రత ఆలోచనకు కూడా రక్షణే అని అంటున్నారు జగ్గీ వాసుదేవ్. దీనిని నిరాకరించ గలమా? అభివృద్ధి పేరుతో భూసారాన్ని ధ్వంసం చేయడమంటే రేపటిరోజున జన్మించే వారి ఆహారం కూడా మనమే తింటూ వారికి లేకుండా చేస్తున్నామని చెబుతున్నారు సద్గురు. భూమి పట్ల ఇదే నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ ఉంటే భావి తరాలకు తిండిగింజలకు కరవు వస్తుందని చెబుతున్నారు. శాస్త్రవేత్తలు చెబుతున్నదీ ఇదే కదా! అందుకే సద్గురు ఆరంభించిన నేలతల్లి రక్షణ ఉద్యమానికి విశేష ఆదరణ లభిస్తున్నది. సాధారణంగా ఆధ్యాత్మికవేత్తలు మత పరమైన అంశాల గురించి ప్రబోధనలు చేస్తుంటారు. అంతిమంగా మానవాళి శ్రేయస్సు గురించి చెబుతుంటారు. కానీ జగ్గీ వాసుదేవ్ ఇందుకు భిన్నం. మతపరమైన విషయాల గురించి బోధనలు చేస్తూనే పర్యావరణం గురించి ఆయన తపన పడుతుంటారు. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడితే పరోక్షంగా మాధవసేవ చేయడమేనన్నది జగ్గీ వాసుదేవ్ భావన. ప్రకృతిని విస్మరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నది ఆయన చేస్తున్న హెచ్చరిక. ఈ దిశగా తనవంతుగా ప్రజలను చైతన్యపరిచేందుకు, వారిలో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. దానిని విజయవంతంగా ముందుకు తీసుకెళుతున్నారు. ఈ కార్యక్రమంలో తనతో పాటు ఎవరూ భాగస్వామ్యం కావద్దని, ఎవరికి వారు




**జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం**

# క్షణ కోసం

## Save the soil

గోపరాజు విశ్వేశ్వరప్రసాద్

దైనందిన పనులు చేసుకుంటూనే తనకు భరోసా కల్పించాలని, తన ఆశయానికి మద్దతు తెలపాలని కోరుతున్నారు. ఆయన సదుద్దేశాన్ని గుర్తించిన వివిధ దేశాల పాలకులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రంగాల మేధావులు వాసుదేవ్‌కు మద్దతుగా నిలిచేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు.

**నిస్సారమవుతున్న నేల**

సమస్త మానవాళికి ఆహారాన్ని అందించే ఏకైక వనరు నేల. ఇంతటి కీలకమైన సహజ వనరు నిస్సారమవుతోంది. ప్రజలు దాని ప్రాధాన్యాన్ని విస్మరిస్తున్నారు. పట్టణ, నగర ప్రాంతాల ప్రజలు అదేదో తమకు సంబంధమైన కార్యక్రమం కాదని భావిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 52 శాతం భూమి నిస్సారమైందని అంచనా. ఇది మానవాళికి కచ్చితంగా ప్రమాదకర సంకేతం. ఈ అంశం మీద వెలువడుతున్న అంతర్జాతీయ నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. వాతావరణ మార్పులు, భూనిర్వహణ పద్ధతుల్లో లోపాల వల్ల మున్ముందు ఆహార కొరత ఏర్పడనుంది. తాగునీటి కొరత ఏర్పడనుంది. ప్రపంచవ్యాప్తంగా వలసలు మొదలు కానున్నాయి. 2030 నాటికి 700 మిలియన్ల మంది ప్రజలు కరవును ఎదుర్కోవలసి వస్తుంది. విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం, అడవుల నిర్మూలన, వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ, పారిశ్రామిక కాలుష్యం, నిలకడ లేని వ్యవసాయ పద్ధతుల కారణంగా సగం నేల క్షీణించింది. సేంద్రియ ఎరువుల వాడకం, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా ఈ సమస్యను కొంతవరకు అధిగమించవచ్చు. దీనివల్ల వ్యవసాయంపై పెడుతున్న ఖర్చును తగ్గించవచ్చు. సేంద్రియ ఉత్పత్తుల వాడకం ప్రజల ఆరోగ్యానికి మేలు. కోటి మైళ్ల ప్రస్థానమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభం అవుతుంది. ఆ సత్యాన్ని గ్రహించిన జగ్గీ వాసుదేవ్ నేల, దాని ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, నేలతల్లి రక్షణలో ఈ తరం బాధ్యతను గుర్తు చేయడానికి యాత్రను తలపెట్టారు.

**యాత్రకు శ్రీకారం**

మార్చి 21, 2022న సద్గురు సేవ్ ది సాయిల్ యాత్ర లండన్‌లో ప్రారంభమైంది. వెంటనే ప్రపంచమంతటా ఒక ఆసక్తి నెలకొన్నది. అనతి కాలంలోనే ప్రపంచంలోని అన్ని రకాల సమాజాల నుంచి మద్దతు వచ్చింది. 3.5 బిలియన్ ప్రజల మద్దతు కోసం సద్గురు 24 దేశాలలో, 30,000 కిలోమీటర్లు ద్విచక్ర వాహనం మీద ప్రయాణిస్తారు. ఈ ప్రయాణం లండన్‌లో మొదలవుతుంది. కావేరి దగ్గర పూర్తవుతుంది. అక్కడే కావేరి కాలింగ్ ప్రాజెక్ట్ పని జరుగుతున్నది. కావేరీ జలాల శుద్ధి కూడా ఇందులో భాగం. ఇంతవరకు ఏడు కరిబియన్ దేశాలు, అజర్‌బైజాన్, రుమేనియా సేవ్ ది సాయిల్‌కు మద్దతు ఇస్తూ, అందుకు అవసరమైన చర్యలు చేపడతామని అవగాహన ఒప్పందం మీద సంతకాలు చేశాయి. ఇటలీ, బల్గేరియా, స్లోవాకియా, చెక్ రిపబ్లిక్, ది వాటికన్ దేశాల మంత్రులు, పార్లమెంటు సభ్యులు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ ఉద్యమంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 74వ సభ్య దేశంగా నమోదైంది. మే 18వ తేదీన జగ్గీ వాసుదేవ్ అబుదాబి వెళ్లారు. ఆ దేశ పర్యావరణ మంత్రి మరియం మెహిరితో కలసి ఒక మొక్కను నాటారు. లండన్, బర్మింగ్ హెమ్, హేగ్, ఆమ్‌స్టర్‌డ్యామ్, బెర్లిన్, ప్రాగ్, వియన్నా, రోమ్, జెనీవా, పారిస్, ఇస్తాంబుల్, బాకు, అమ్మాన్, బ్రస్సెల్స్, బుడాపెస్ట్, బెల్‌గ్రేడ్, సోఫియా, టెల్ అవీవ్, రియాద్, ఫ్రాంక్ ఫర్ట్ తదితర నగరాలను సందర్శించారు. అక్కడి పాలకులను కలిసి నేల సంరక్షణపై చర్చించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేక మంది ప్రముఖులు, క్రీడాకారులు, కళాకారులు, శాస్త్రవేత్తలు ఈ అంశం గురించి ప్రచారం చేయడానికి ముందుకు వచ్చారు.

**రాజకీయ కోణం**

ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ ఉద్యమంలో భాగస్వాములైతే పర్యావరణ అంశాలు కూడా ఎన్నికల అంశాలుగా అవతరిస్తాయి. అప్పుడే ప్రభుత్వాలు భూరక్షణ, పర్యావరణ రక్షణ వంటి వాటికి నిధులు కేటాయించి, పథకాలు రూపొందిస్తాయి. 1994లో ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన కన్వెన్షన్ టు కాంబాట్ డిజర్టిఫికేషన్ (నేలంతా ఎడారిగా మారకుండా పోరాడే సంస్థ) సద్గురు ఉద్యమంలో భాగస్వామిగా ఉంది. దుబాయ్‌లో మే 19న మాట్లాడిన జగ్గీ వాసుదేవ్ 60 శాతం ప్రజలు ఈ అంశాల మీద గొంతెత్తితే అది ప్రభుత్వం మీద గట్టి ఒత్తిడి అవుతుందని, అప్పుడు చట్టాలు చేయక తప్పదని అన్నారు. ఆయన కార్యక్రమం ఇప్పటికే కోట్లాది మంది ప్రపంచ పౌరుల హృదయాలను తాకింది. ఐక్య రాజ్యసమితి ఆధ్వర్యంలోని భూరక్షణ పోరాట సమితితో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఆయనకు సాయం చేయడానికి కోటి పది లక్షల మంది స్వచ్ఛంద సేవకులు, 300 కేంద్రాలు ఉన్నాయి.

**కావేరీ కాలింగ్**

మే నెలాఖరు నాటికి యాత్ర భారత్‌లోకి

ప్రవేశిస్తుంది. ముందుగా గుజరాత్‌లోని జామ్‌నగర్ నగరానికి చేరుకుంటుంది. అప్పటినుంచి 20 రోజుల పాటు దేశవ్యాప్తంగా దాదాపు 25 రాష్ట్రాల్లో పర్యటిస్తారు. తమిళనాడులోని కన్యాకుమారికి జూన్ 21న చేరుకోవడం ద్వారా ఈ సుదీర్ఘ యాత్ర ముగియనుంది. ఈ సందర్భంగా కావేరీ కాలింగ్ ప్రాజెక్టు పేరుతో సుమారు 1.25 లక్షల మంది రైతులు 62 మిలియన్ల మొక్కలను నాటనున్నారు. కావేరీ నది పునరుద్ధరణకు, కావేరీ బేసిన్‌ను సారవంతంగా తీర్చిదిద్దేందుకు 'సేవ్ ది సాయిల్' కార్యక్రమం ద్వారా శ్రీకారం చుట్టనున్నారు. తన యాత్రలో భాగంగా 3.5 బిలియన్ల మంది ప్రజలకు చేరువ కావాలన్నది జగ్గీ లక్ష్యం. నిత్యం ప్రజల కోసం పరితపించే వాసుదేవ్ తన వయసును కూడా పక్కనపెట్టి ఉద్యమం చేపట్టడం విశేషం. తనకు ప్రత్యేకంగా విశ్రాంతి అవసరం లేదని, ప్రజల కోసం పని చేయడంలోనే తనకు విశ్రాంతి దొరుకుతుందని వాసుదేవ్ వివిధ సందర్భాల్లో చెప్పడం ఈ సందర్భంగా గమనార్హం. తన యాత్రలో పాల్గొనాలంటూ ఎవరినీ ఒత్తిడి చేయడం లేదు. కేవలం తనొక్కరే ముందుకు సాగుతున్నారు. మార్గమధ్యంలో




వివిధ దేశాల పాలకులు, ప్రజలు, ఆయా రంగాల మేధావులతో సమావేశమవుతున్నారు. తన లక్ష్యాన్ని, ఆశయాన్ని సవివరంగా వివరిస్తున్నారు. వారి మద్దతును కూడగడుతున్నారు. నేల నిస్సారాన్ని అరికట్టేందుకు, దానికి పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు పెద్ద పెద్ద త్యాగాలు ఏమీ చేయనక్కర్లేదని, ఎవరివంతు వారు ప్రయత్నాలు వారు చేస్తే చాలని ఆయన సూచిస్తున్నారు. నేల నిస్సారమవడానికి ప్రత్యేకంగా ఎవరినీ నిందించనక్కర్లేదని, ఇది ఒకరినొకరు విమర్శించుకునేందుకు, లోపాలను ఎత్తిచూపేందుకు సమయం కాదని, అందరూ కలసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని జగ్గీ వాసుదేవ్ చెబుతున్నారు.

**మీడియా బాసట**

వాసుదేవ్ యాత్రను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 18 దేశాలకు చెందిన 250కిపైగా మీడియా సంస్థలు పని చేస్తుండటం విశేషం. మార్చి 21న ప్రారంభమైన ఈ యాత్ర ఇప్పటివరకు రెండు నెలలకు పైగా పూర్తయింది. యూరప్ ఖండంతో పాటు అనేక మధ్య ఆసియా దేశాలను వాసుదేవ్ సందర్శించడం విశేషం. అదే సమయంలో రెండు బిలియన్లకు పైగా ప్రజల మనసులను యాత్ర తాకిందని అంచనా. ఈ సందర్భంగా 72 దేశాలు జగ్గీ వాసుదేవ్ సూచనలపై చర్యలు తీసుకునేందుకు, ఆ మేరకు చట్టాలు చేసేందుకు ముందుకు రావడం కీలక పరిణామం. ఈ కార్యక్రమం విజయవంతమవుతుందనడానికి ఇంతకు మించిన మరో నిదర్శనం అక్కరలేదు. యాత్రలో భాగంగా జోర్డాన్ రాజధాని అమ్మాన్ నగరం చేరుకున్నప్పుడు వాసుదేవ్‌కు ఘన స్వాగతం లభించింది. 'ఈద్' పండగ హడావిడిలో ఉన్నప్పటికీ ప్రజలు సద్గురును సాదరంగా స్వాగతించారు. జోర్డాన్‌లోని భారత రాయబారి హెచ్.ఇ.అన్వర్ హలీమ్ ఆయనకు ఎదురేగి స్వాగతం పలికారు.

## పర్యావరణ పరిరక్షణ పౌరులందరి బాధ్యత

పర్యావరణం.. ప్రస్తుతం ఇది ఒక ప్రాంత సమస్యో, ఒక దేశ సమస్యో కాదు. యావత్ ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. అభివృద్ధి చెందిన, చెందుతున్న, వెనకబడిన అనే తేడా లేకుండా అన్ని దేశాలూ ఈ సమస్యను ఎలా అరికట్టాలో తెలియక సతమతమవుతున్నాయి. ఏటా అంతర్జాతీయ సమావేశాలు జరుగుతున్నా, ఘనంగా తీర్మానాలు చేస్తున్నా, అధినేతలు బాసలు చేస్తున్నా పరిష్కార దిశగా మాత్రం నిర్దిష్టంగా అడుగు ముందుకు పడటం లేదు. పర్యావరణ పరిరక్షణలో వైఫల్యం వల్ల ఎదురవుతున్న అనర్థాలు కళ్లెదుట ప్రత్యక్షంగా కనపడుతున్నా అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేయడానికి, ఆవేదన చెందడానికి మాత్రమే పరిమితమవుతోంది. అంతేతప్ప కచ్చితమైన, నిర్దిష్టమైన కసరత్తు జరగడం లేదు. ఈ నేపథ్యంలో జూన్ 5న మరోసారి పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రపంచ దేశాలు సిద్ధమవుతున్నాయి.

పర్యావరణ పరిరక్షణ సదస్సుకు ఈసారి ఆతిథ్యం ఇచ్చేందుకు ఐరోపా దేశం స్వీడన్ ముందుకు వచ్చింది. పర్యావరణ పరిరక్షణ ప్రధాన అంశం అయినప్పటికీ దీనికి సంబంధించి ఏటా ఏదో ఒక అంశంపై ప్రత్యేకంగా అధ్యయనం చేయడం, దానికి సంబంధించి లోతుగా చర్చించడం సంప్రదాయంగా వస్తోంది. ఇందులో భాగంగా ఈసారి 'ఓన్లీ వన్ ఎర్త్' అన్న నినాదాన్ని ఎంచుకున్నారు. పర్యావరణం అన్నది ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిన విషయం ఏమీ కాదు. దశాబ్దాల క్రితం నుంచే దీని ప్రాధాన్యం, ప్రభావం, కలిగే అనర్థాలపై అంతర్జాతీయ సమాజం అధ్యయనం చేస్తోంది. ఏటా ఏదో ఒక దేశం సదస్సుకు ఆతిథ్యం ఇస్తూ ముందుకు వెళుతున్నాయి. యూఎన్ఈపీ (యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్) కింద 1972 నుంచి పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. తొలి సదస్సుకు స్టాక్ హోమ్ వేదికైంది. జూన్ 5న జరగనున్న సదస్సు 50వది కావడం విశేషం. 2008, 2011ల్లో ఈ సదస్సులకు భారత్ ఆతిథ్యమిచ్చింది. 2019లో చైనా ఆతిథ్యమిచ్చింది.

అభివృద్ధి చెందిన, ప్రగతికాముక దేశాలమని చంకలు గుద్దుకునే దేశాలు తొలి రోజుల్లో పర్యావరణ ప్రాధాన్యాన్ని గుర్తించలేదు. వాటి చూపంతా వస్తూత్పత్తి, తద్వారా వచ్చే లాభాలపైనే ఉండేది. అదే సమయంలో శ్రుతి మించిన పారిశ్రామికీకరణ వల్ల కలిగే అనర్థాలపై అవి ఏనాడూ ఆలోచించలేదు. పారిశ్రామికీకరణను ఎవరూ వద్దనరు. కానీ దానివల్ల కలిగే దుష్పరిణామాల గురించి ఆలోచించకపోవడం వల్ల సరికొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ పాపాన్ని ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న, వెనకబడిన దేశాలపై మోపి చేతులు దులిపేసుకుంటున్నాయి అభివృద్ధి చెందిన దేశాలు. ఈ ద్వంద్వ వైఖరిని అనేక అంతర్జాతీయ సదస్సుల్లో భారత్ ఎండగట్టింది. తనవంతుగా చర్యలు చేపట్టింది. వాస్తవానికి వస్తే పర్యావరణ ప్రాధాన్యాన్ని భారత్ ఏనాడో గుర్తించింది. ఆ దిశగా చర్యలు కూడా చేపడుతోంది. రాజ్యాంగంలోని 51-ఏ(జి) అధికరణం పర్యావరణం గురించి ప్రస్తావిస్తోంది. పర్యావరణ పరిరక్షణకు తనవంతుగా కృషి చేయడం ప్రతి పౌరుడి బాధ్యతని ఈ అధికరణం తెలుపుతోంది. కేవలం రాజ్యాంగంలో రాసుకోవడమే కాకుండా ఆ మేరకు చట్టాలు చేయడం, చర్యలు చేపట్టడం, వాటి అమలు తీరును ఎప్పటికప్పుడు సమీక్షించడం చేస్తోంది. మోదీ ప్రభుత్వం ఈ దిశగా మరింత వేగంగా ముందుకు సాగుతోంది.

పర్యావరణ పరిరక్షణలో వైఫల్యం వల్ల కలిగే అనర్థాలు అన్నీ ఇన్ని కావు. నానాటికీ తీవ్రమవుతున్న వాయు, జల కాలుష్యం, మితిమీరిన శిలాజ ఇంధన వాడకం, ప్లాస్టిక్ వినియోగం, చెట్ల నరికివేత, మొక్కలు నాటడంలో నిర్లక్ష్యం, తగ్గుతున్న అటవీ విస్తీర్ణం వల్ల పర్యావరణం దెబ్బతింటోంది. ఎండలు అధికమవుతున్నాయి. నీటి వనరులు నిండు

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), మస్కట్, బహ్రెయిన్‌ల్లో యాత్ర సందర్భంగా అయా దేశాల ప్రజలు, పాలకుల నుంచి మంచి ఆదరణ లభించింది. ముస్లిం దేశమైన జోర్డాన్ పూర్తిగా పొడి ప్రాంతం. సేవ్ ది సాయిల్ ఉద్యమం ఆవశ్యకత అక్కడ మరింతగా ఉంది. పుడమిని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అయిదు మిలియన్ల మంది విద్యార్థులు లేఖలు రాశారు.

**భారతీయ నాయకుల మద్దతు**

భారతదేశంలో పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాలు సద్గురు యాత్రకు మద్దతు ప్రకటించడం విశేషం. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రులు భూపేశ్ యాదవ్, హర్దీప్ సింగ్ పూరీ, నరేందర్ సింగ్ తోమర్, ధర్మేంద్ర ప్రధాన్, మీనాక్షి లేఖీ, గజేంద్ర సింగ్ షెకావత్, కైలాష్ చౌదరి, గిరిరాజ్ సింగ్, కర్ణాటక, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు బసవరాజ్ బొమ్మై, పెమా ఖండూ, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఛత్తీస్‌గఢ్ ఆరోగ్య మంత్రి టీ.ఎస్. సింగ్, కాంగ్రెస్ నాయకుడు మిలింద్




దేవ్‌రా, ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్, కేంద్ర మాజీ మంత్రి, భారతీయ జనతా పార్టీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్, సమాజ్ వాదీ పార్టీ అధికార ప్రతినిధి అనురాగ్ బదౌరియా, తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్, తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న తిరునగరి, యోగా గురువు బాబా రామ్ దేవ్ తదితరులు జగ్గీ యాత్రకు మద్దతు పలికారు.

**ర్యాలీ ఫర్ రివర్స్**

జగ్గీ వాసుదేవ్ ఆధ్యాత్మికవేత్త మాత్రమే కాదు. దూరదృష్టి గల నాయకుడు. దేశంలో అత్యంత ప్రభావవంతమైన 50 మంది నేతల్లో వాసుదేవ్ ఒకరు కావడం విశేషం. ఈ యాభయ్ మందిలో ఒకరుగా ఉండేందుకు ప్రతి రాజకీయ నాయకుడు పరితపిస్తారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే వారే ఈ స్థానానికి చేరుకుంటారు. విశ్వ మానవాళి శ్రేయస్సు కోసం పని చేయడం జగ్గీ వాసుదేవ్‌కు కొత్తేమీ కాదు. గతంలో అనేక కార్యక్రమాలు చేపట్టి వాటిని విజయవంతం చేసిన చరిత్ర ఆయనది. ఒక మత ప్రబోధకుడు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రపంచ శ్రేయస్సుకు కూడా పాటుపడాలన్నది ఆయన ఆశయం. కేవలం పిలుపునివ్వడం, సూచనలు చేయడం, మంచి మాటలు చెప్పడమే కాకుండా ఆ దిశగా ముందు తాను చొరవ చూపాలన్నది ఆయన ఆలోచన. 2017లో నదుల సంరక్షణకు, వాటికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు 'ర్యాలీ ఫర్ రివర్స్' అనే ఉద్యమాన్ని మన దేశంలో చేపట్టారు. నదిని భారతీయులు తల్లిగా, దేవతగా పరిగణిస్తారని వేదాలు ఘోషిస్తున్నాయి. ఏ దేశంలో అయినా తల్లి బాధపడితే బిడ్డలు చూడలేరు. ఆమె క్షేమంగా ఉంటేనే తామూ క్షేమంగా ఉండగలమన్నది ప్రజల విశ్వాసం.

కుంటున్నాయి. అవి నానాటికీ క్షీణిస్తున్నాయి. తగిన మేరకు వర్షపాతం కురవడం లేదు. సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. దీనివల్ల నీరు ఆమ్లత్వాన్ని సంత రించుకుంటోంది. జలచరాలకు ముప్పు ఏర్పడు తోంది. జీవవైవిధ్యానికి హాని కలుగుతోంది. ప్లాస్టిక్ వినియోగాన్ని పరిమితం చేయడం, తక్కువ మైక్రాన్లు గల ప్లాస్టిక్ వాడకం, వ్యర్థ పదార్థాల రీ సైక్లింగ్, మొక్కల పెంపకం, శిలాజ ఇంధనం బదులు విద్యుత్ వాహనాల వాడకం వల్ల పర్యావరణాన్ని కాపాడుకో గలం. కానీ ఆ దిశగా నిర్దుష్ట కార్యాచరణ కొరవడటం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. తాజాగా వెలువడిన ప్రపంచ వాతావరణ సంస్థ నివేదిక ఈ విషయమై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గత ఏడు సంవత్సరాల (2015- 2021) కాలంలో అంతర్జాతీయంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యా యని సంస్థ స్టేట్ ఆఫ్ క్లైమెట్ నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. గత ఏడాది అంతర్జాతీయ సగటు ఉష్ణోగ్రతలు పారిశ్రామిక యుగానికి ముందు (1850-1900) ఉష్ణోగ్రతలతో పోలిస్తే అధికంగా నమోదైనట్లు హెచ్చరించింది. పర్యావరణ విధ్వం సాన్ని అడ్డుకోవడంలో మానవ వైఫల్యమే ఇందుకు కారణమని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా శిలాజ ఇంధన వాడకంవల్ల కలిగే కాలుష్యానికి ముగింపు పలకాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించింది. ఈ పరిస్థితిని నివారించేందుకు అంతర్జాతీయ సమాజం తక్షణమే శిలాజ ఇంధనాల బదులు పునరుత్పాదక ఇంధనాల వాడకం వైపు వెళ్లాల్సిన అవసరం ఉందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సూచించారు. 2021లో ప్రపంచ వ్యాప్తంగా నమోదైన అతి తీవ్ర ఉష్ణోగ్రతలు, తుపాన్లు, వరదల వల్ల వాటిల్లిన నష్టం రమారమి 7.71 లక్షల కోట్లని అంతర్జాతీయ వాతావరణ సంస్థ తన నివేదికలో పేర్కొంది. దీనివల్ల



ఆహార భద్రతకు ముప్పు పొంచి ఉందని స్పష్టం చేసింది. పర్యావరణ పరిరక్షణలో వైఫల్యం వల్ల వాతావరణంలో కర్బన ఉద్గారాల స్థాయి పెరుగు తోంది. దీనివల్ల భూమి మరింత వేడెక్కుతోంది. రాత్రి పూట కూడా వేడిగాలులు వీస్తున్నాయి. దీనివల్ల భూతాపాలు పెరిగి హిమనీ నదాలు కరిగిపోయి సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. ఫలితంగా తీరప్రాంతాలు, సమీప లోతట్టు ప్రాంతాలు ముంపు నకు గురవుతున్నాయి. ఇది అనేక ఉపద్రవాలకు దారితీస్తుంది. 2013-21 మధ్య కాలంలో సగటున ఏటా 4.5 మిల్లీ మీటర్ల మేర సముద్ర మట్టాలు పెరిగాయి. గతంలో పోలిస్తే ఇది అత్యధికం. ఇదే పరిస్థితి కొనసాగితే తీరప్రాంతానికి మరింత తుపాను ప్రమాదం పొంచి ఉంటుంది. ఇక సముద్ర జలాల ఆమ్లీకరణ విషయానికి వస్తే గాలిలో కర్బన ఉద్గారాల స్థాయి ఎంత పెరిగితే సముద్ర జలాలు కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకోవడం అంతగా పెరుగుతుంది. అనంతరం జరిగే రసాయన చర్యల కారణంగా సముద్ర జలాల్లో ఆమ్లత్వం పెరుగుతుంది. ఇది సముద్ర జీవరాసులపై ప్రభావం చూపుతుంది. సముద్ర జలాల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల తీరప్రాంత ప్రజలతో పాటు సముద్ర జీవాలపైనా, జీవ వైవిధ్యంపైనా, ఆహార భద్రతపైనా పెను ప్రభావం పడుతుంది. వచ్చే పదేళ్లలో ప్రపంచ సగటు వార్షిక ఉష్ణోగ్రతలు పారిశ్రామిక యుగంతో పోలిస్తే 1.5 డిగ్రీల మేరకు పెరిగే ప్రమాదం 50 శాతం ఉంది. దీని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని ప్రపంచ వాతావరణ సంస్థ తన నివేదికలో స్పష్టంగా హెచ్చరించింది. ఈ నివేదికను విస్మరించి నట్లయితే ప్రమాదాన్ని కోరి తెచ్చుకున్నట్లవుతుంది. ఈ దిశగా నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం స్వీడన్‌లో జరగనున్న సదస్సుపై ఉంది. ★




ఈ విషయాన్ని ఉదాహరణలతో వివరిస్తూ జగ్గీ వాసుదేవ్ అప్పట్లో చేపట్టిన 'ర్యాలీ ఫర్ రివర్స్' ఉద్యమం విజయవంతమైంది. ఇది దేశంలో చేపట్టిన అతి పెద్ద పర్యావరణ కార్యక్రమం. నదులు కోతకు గురవకుండా, నదీగర్భం ఎండిపోకుండా, నదీ గట్లు, ప్రాంతం ఆక్రమణలకు గురికాకుండా, కలుషితం కాకుండా, నదుల్లో వేసవిలోనూ నీరు ప్రవహించేందుకు తీసుకోవలసిన చర్యలపై ఆయన పాలకులు, ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రాణాధారమైన తాగునీటిని అందించే నదుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన వివరించారు. నదుల గట్లను పటిష్ఠపరచడం ద్వారా వరద నీటిని లోతట్టు ప్రాంతాలకు, సమీప పల్లెల్లోకి చేరకుండా అడ్డుకోవచ్చు. అదే సమయంలో పట్టణాలు, పల్లెల్లోని మురుగునీరు నదుల్లోకి చేరకుండా నివారించడం ద్వారా నీరు స్వచ్ఛంగా ఉండేందుకు అవకాశం కలుగుతుంది. 2019లో ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని చేపట్టారు.

కాప్ (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్) – 15వ సదస్సులో చేసిన ప్రసంగంలో నేల ప్రాధాన్యం గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. ఇందులో పాల్గొన్న 93 దేశాలకు చెందిన ప్రతినిధులు దానిని శ్రద్ధగా ఆలకించారు. నేలను సారవంతం చేసేందుకు తమ వంతుగా చేయవలసిన కార్యక్రమాలు, చర్యలపై ఆయా దేశాల ప్రతినిధులు చర్చించుకున్నారు. సమస్యకు అర్థవంతమైన పరిష్కారం కనుగొనవలసిన ఆవశ్యకత గురించి వారు మాట్లాడుకున్నారు. దీనిని మంచి ముందడుగుగానే చెప్పవచ్చు.

జగ్గీ వాసుదేవ్ చేపట్టిన కార్యక్రమంలోని మంచిని గుర్తించిన అంతర్జాతీయ సంస్థలు అందులో భాగస్వాములయ్యాయి. ఐక్యరాజ్య సమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థలు ఆయనకు బాసటగా నిలిచాయి. 1948 నాటి యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ టు కంబాట్ డిసర్టిఫికేషన్ (యు.ఎన్.సి.సి.డి)తో ఒప్పందం కుదరడంలో జగ్గీ వాసుదేవ్ సారథ్యంలోని 'ఈషా ఫౌండేషన్' కీలక పాత్ర వహించింది. నేల బాగుంటేనే మనిషి బాగుంటాడు. ప్రపంచవ్యాప్తంగా 95 శాతం ఆహారం నేల నుంచే వస్తుందన్న వాస్తవాన్ని గ్రహించాలి. సారవంతమైన నేల లేకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయలేం. మట్టి ఏ ఒక్కరి వ్యక్తిగత ఆస్తి కాదు. లేదా భూములున్న వారి ఆస్తి మాత్రమే కాదు. ఇది యావత్ ప్రజల ఉమ్మడి ఆస్తి. దీనిని మన పూర్వీకుల నుంచి వారసత్వంగా పొందాం. ఇప్పుడు దానిని మన ముందుతరాలకు ఆరోగ్యకరంగా అందించాలి. అది మనందరి బాధ్యత. ఇప్పటికే సగానికిపైగా నిస్సారమైన నేలను మన వారసులకు అందించడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. సారమైన, ఆరోగ్యకరమైన నేలను ముందుతరాలవారికి అప్పగించడం అంత తేలికైన విషయం కాదు. నిస్సారమైన నేలను సారవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ పూనుకోవాలి.




**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**

ఇదేదో గతకాలపు మతోన్మాదుల దుండగీడుతనాన్ని బయట పెట్టేదే కాకుండా, ప్రస్తుత కుహనా సెక్యులరిస్టుల వితండవాదాలనీ సాక్ష్యాలతో సహా కడిగి పారేసే సమయంలాగే ఉంది. ఇస్లాం దండయాత్రలలో వేలాది దేవాలయాలు నేల మట్టం కావడం లేదా మసీదులుగా మారిపోవడం ఒక నిజం. అయోధ్య, మధుర, కాశీలో జ్ఞాన్‌వాపి మసీదు రగడ వీటికి సజీవ సాక్ష్యాలు. దాచేసిన వాస్తవాలన్నీ బయటపడుతున్నాయి. హిందూ దేవాలయాల మీద కట్టేసిన మసీదులు కూలుతున్నాయి. ఇందుకు తాజా ఉదాహరణ కర్ణాటకలోని మంగళూరులో మసీదులోపల బయటపడిన హిందూ ఆలయం ఆనవాళ్లు.

ఆ మసీదును హిందూ సంస్థగా చెప్పుకునే సంస్థ, లేదా సంఘ పరివార్ సంస్థ కూల్చలేదు. లేదా స్వాధీనం చేసుకోలేదు. ఆ మసీదు నిర్వాహకులే పునర్ నిర్మించడానికి పనులు ప్రారంభించినప్పుడు ఆలయాలలో మాత్రమే కనిపించే వాస్తు శైలితో ఆనవాళ్లు బయటపడ్డాయి. మంగళూరులోని గురుపూర్ తాలూకా మలాలీ మార్కెట్ జుమా మసీదులో అవి బయటపడ్డాయి. ఏప్రిల్ 21న ఇవి వెలుగు చూశాయి. మసీదు పునర్ నిర్మాణం కోసం ఇప్పటికే మసీదును కూల్చారు.

అక్కడ మసీదు నిర్మించడానికి ముందే ఒక హిందూ దేవాలయం ఉందని ఇప్పుడు పలువురు చెబుతున్నారు. చారిత్రక పత్రాలు పరిశీలించే వరకు మసీదు పునర్ నిర్మాణం పనులను నిలిపివేయవలసిందిగా స్థానిక విశ్వహిందూ పరిషత్ నాయకులు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు.



# ఇలా ఎన్నో?



**కాంగ్రెస్ చింతన్ శిబిర్.. ఉన్న చింతలు తొలగిపోకపోగా కొత్త చింతలను మిగిల్చింది. పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడంలో ఆ పార్టీ పూర్తిగా విఫలమైంది. ఊకదంపుడు ఉపన్యాసాలు, అయోమయం ప్రకటనలు, తీర్మానాలు తప్ప ఉదయ్‌పూర్ చింతన్ శిబిర్‌లో హస్తంపార్టీ సాధించింది ఏమీ లేదు. ఉన్న మిత్రపక్షాలను దూరం చేసుకోవడం, సోనియా, రాహుల్ ఉక్కు పిడికిళ్లను పార్టీపై మరింత బిగించడానికి ఇది ఉపయోగపడింది. ఈ చింతన్ శిబిర్ తర్వాత 2024 ఎన్నికల్లో బీజేపీ భారీ విజయంపై కమలనాథుల్లో ధీమా మరింత పెరిగింది.**

రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ముగిసిన మూడురోజుల కాంగ్రెస్ పార్టీ చింతన్ శిబిర్ మీద ఆ పార్టీ సానుభూతిపరులు ఏవైనా ఆశలు పెట్టుకొని ఉంటే అది అత్యాశేనని గ్రహించి ఉండాలి. నూటా ముప్పై ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని పునరుజ్జీవింపజేసేందుకు తీసుకున్న నిర్ణయాలు ఆ పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులకు పెద్దగా సంతృప్తిని కలిగించలేదనే చెప్పాలి. దేశవ్యాప్తంగా బీజేపీ జైత్రయాత్ర కొనసాగుతూ, కాంగ్రెస్ పార్టీ క్రమంగా కనుమరుగవుతున్న తరుణంలో ఆ పార్టీలో జి–23గా పిలిచే సీనియర్ల ఆందోళనలకు, వారు లేవనెత్తిన ప్రశ్నలకు పెద్దగా సమాధానమేమీ దొరకలేదు. చింతన్ శిబిర్‌లో తీసుకున్న నిర్ణయాలు, ఆమోదించిన తీర్మానాలు చూస్తే చింత ఇంకా పెరిగే అవకాశాలే కనిపిస్తున్నాయి. పార్టీలో సంస్థాగత మార్పులు చేపట్టి వచ్చే ఎన్నికల నాటికి కిందిస్థాయి నుంచి పటిష్టపరిచే నిర్ణయాలు తీసుకుంటారని ఆశించినా, ఆ పార్టీ నాయత్వం తామింకా మూసధోరణి నుంచి బయట పడలేదని పరోక్షంగా చెప్పింది.

**యూపీఏను వదిలేసినట్లేనా?**

చింతన్ శిబిర్ ముగింపు ప్రసంగాలలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇచ్చిన సంకేతాలపై పార్టీ వర్గాలే భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నాయి. బీజేపీని గద్దె దింపడం ప్రాంతీయ పార్టీల వల్ల కాదని.. కేవలం కాంగ్రెస్ పార్టీ వల్లే అవుతుందని చాటడం ద్వారా ప్రాంతీయ పార్టీలను దూరం చేసుకున్నట్లే కనిపిస్తోంది. యునైటెడ్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ ప్రస్తావన అసలు కనిపించలేదు. మిత్రపక్షాల అవసరం తమకు లేదని కాంగ్రెస్ ఒక్కటే బీజేపీకి చెక్ పెట్టగలదని సోనియా, రాహుల్ తమ సందేశాల్లో అభిప్రాయపడ్డారు. బీజేపీని ఎదుర్కోవాలంటే కాంగ్రెస్ పార్టీ తమతో కలిసి వచ్చే ప్రాంతీయ పార్టీలను వీలైనంతగా కలుపుకుని పోవాలని, ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో రెండో పార్టీగా ఉండేలా ఒదిగి పోవాలని ప్రశాంత్ కిశోర్ కొద్ది రోజుల క్రితం సోనియా గాంధీకిచ్చిన ప్రజెంటేషన్‌లో పేర్కొన్నారు. తమిళనాడులో డీఎంకే, తెలంగాణలో టీఆర్ఎస్, మహారాష్ట్రలో శివసేన, బెంగాల్‌లో టీఎంసీతో పొత్తుకోసం కాస్త తగ్గాలని సూచించారు. ఆయా రాష్ట్రాలలో రెండో పార్టీగా ఉండేందుకు సిద్ధం కావాలని, అది జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి పెద్దన్న పాత్ర పోషించే అవకాశాన్నిస్తుందని పీకే పేర్కొన్నారు. కానీ ఈ అంశాలను ఉన్న భారతీయ జనతా పార్టీని ఓడించగలనన్న ధీమా కనబరచడం ఆశ్చర్యం కలిగించక తప్పదు. ఇటీవలి ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్, ప్రియాంక తెగ ప్రచారం చేసినా కేవలం రెండంటే రెండు అసెంబ్లీ సీట్లను గెలుచుకుంది. పంజాబ్‌లో ఘోర పరాజయంతో ఉన్న అధికారాన్ని పోగొట్టుకుంది. అయినా చింతన్ శిబిర్ తర్వాత 52 నుంచి ఏకంగా 272 సీట్లకు పెరగగలమన్న ధీమా వ్యక్తం చేయడం అతిశయోక్తిగా చెప్పాలి.

**నాయకత్వం మాటేమిటి?**

ఇంతకీ కాంగ్రెస్ పార్టీకి ఎవరు నాయకత్వం వహిస్తారనే ప్రస్తావన కూడా చింతన్ శిబిర్‌లో




# పసలేని ఉపన్యాసాలు,

కాంగ్రెస్ పెద్దలు పెద్దగా పట్టించుకోలేదని చింతన్ శిబిర్ ముగింపు ప్రసంగాలు చాటాయి. రాహుల్ కొద్దిరోజుల క్రితం తెలంగాణలో పర్యటించిన సందర్భంలోను టీఆర్ఎస్‌తో పొత్తుండదని చాటారు. కేసీఆర్‌తో కయ్యానికి కాలు దువ్వారు. 2019 ఎన్నికల్లో ఎన్డీయేతో ఉన్న శివసేన ఆ తర్వాత కాంగ్రెస్ పంచన చేరింది. అలాంటి పార్టీలకు కూడా కాంగ్రెస్ పెద్దలు చేసిన కామెంట్లు బహుశా రుచించకపోవచ్చు.

**ఒంటరి పోరు సాధ్యమేనా?**

2014లో కాంగ్రెస్ కేవలం 44 లోక్‌సభ సీట్లు తెచ్చుకుంది. 2019లో కేవలం 19.49 శాతం ఓట్లతో 52 లోక్‌సభ సీట్లను సాధించింది. గత ఎన్నికల్లో 8 సీట్లు మాత్రమే పెంచుకోగలిగింది. తర్వాత పార్టీ ప్రాభవం మరింత క్షీణిస్తూ వచ్చింది. అయినప్పటికీ తానే సొంతంగా 300 సీట్లకు పైగా వినిపించలేదు. రాహుల్ గాంధీ నాయకత్వ బాధ్యతల నుంచి శాశ్వతంగా తప్పుకున్నట్లేనా? అదే నిజమైతే ప్రియాంకకు అధ్యక్ష బాధ్యతలు ఇస్తారా? అనే ప్రశ్నలకు కూడా సమాధానం లేదు. ప్రియాంకను అధ్యక్షురాలిని చేయాలంటూ కొందరు తన ప్రసంగాల్లో చెప్పబోతే, ఎజెండాలో లేని అంశాలను ప్రస్తావించవద్దంటూ మల్లికార్జున ఖర్గే వంటి నేతలు వారించారు. దీని ద్వారా నాయకత్వ మార్పు అనేది ఉత్త మాటేనని అర్థమైపోయింది. పార్టీ అధ్యక్ష ఎంపిక లేదా ఎన్నికలపై ప్రశాంత్ కిశోర్ చేసిన సూచనలను సోనియా పట్టించుకోలేదు. సోనియా–రాహుల్ పార్టీపై పెత్తనాన్ని వదులుకోవడానికి ఏమాత్రం సిద్ధంగా లేరు. పీకే నివేదికను కాంగ్రెస్ హైకమాండ్ పరిగణనలోకి తీసుకోలేదు అనడానికి రాహుల్ విదేశీ విహార యాత్ర, ప్రియాంక అమెరికా పర్యటనలను రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆయన



# పనికిరాని తీర్మానాలు

ప్రతిపాదించిన అంశాలు నచ్చకనే రాహుల్ విదేశాలకు వెళ్లిపోయారంటున్నారు. తద్వారా పీకే నివేదికపై చర్చను ముగించారని చెబుతున్నారు.

పార్టీ నాయకత్వాన్ని మార్చాలన్న సూచనను పుత్ర ప్రేమ కోసం పక్కన పెట్టిన సోనియా గత విధానాలనే కొనసాగించనున్నట్లు సంకేతాలిచ్చారు. ఆర్భాటంగా నిర్వహించుకున్న చింతన్ శిబిర్ తర్వాత కూడా పార్టీ దిశ మారలేదనడానికి ఈ రెండంశాలు నిదర్శనాలుగా కనిపిస్తున్నాయి. పార్టీ నాయకత్వాన్ని సమూలంగా మార్చి వేసి.. కొత్త రక్తాన్ని ఎక్కించడం, యువతకు పెద్ద పీట వేయడం వంటి పీకే సూచనల్లో కొన్నింటిని తీసుకుని, మరికొన్నింటిని పక్కన పెట్టేశారు. ముఖ్యంగా పార్టీ అధినేత ఎవరన్న అంశంపై కనీస ప్రస్తావన లేకుండానే శిబిర్ ముగిసింది.

**సీనియర్ల మధ్య విభజన**

2019 లోక్‌సభ ఎన్నికలకు కొన్ని నెలల ముందు కాంగ్రెస్‌లో జీ–23 పేరుతో పార్టీ నాయకత్వంపై సీనియర్లు తిరుగుబాటు లేవనెత్తారు. పార్టీని ప్రక్షాళన చేయాలని, ఇందుకు తీసుకోవల్సిన చర్యలను ప్రతిపాదిస్తూ అధినేత్రి సోనియకు ఓ లేఖాస్త్రాన్ని సంధించారు. అప్పట్లో ఆ లేఖ మీడియాలో సంచలనంగా మారింది. ఉలిక్కి పడ్డ కాంగ్రెస్ హైకమాండ్ ఆ తర్వాత వారిని బుజ్జగించేందుకు ప్రయత్నించింది. కొందరు నేతలకు పార్టీ వేదికలపై ప్రాతినిధ్యం కల్పించారు కూడా. కానీ, ఆ చర్యలు ఉత్తుత్తివేనని చింతన్ శిబిర్ తేటతెల్లం చేసింది. జీ–23 లేఖను కపిల్ సిబల్ తయారు చేశారని గుర్తించిన సోనియా గాంధీ, చింతన్ శిబిర్‌కు ఆయన రాకుండా జాగ్రత్తపడింది. తమ కుటుంబ ఆధిపత్యాన్ని ప్రశ్నించే వారికి పార్టీలో ప్రాధాన్యం దక్కదని పరోక్షంగా ఆమె చాటి చెప్పారు. పార్టీ మేలు కోసం చేసే సద్విమర్శలను కూడా సోనియా సహించరన్న సందేశం స్పష్టంగా కనిపించింది. జీ–23 నేతల్లో గులాంనబీ ఆజాద్‌కు మాత్రమే చింతన్ శిబిర్‌లో కాస్త ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన కశ్మీర్‌లో ఏకైక పెద్ద నాయకుడు కాబట్టే ఈ మాత్రమైనా గౌరవం దక్కింది.

**పాదయాత్రకు సిద్ధమైన రాహుల్**

ప్రజల్లో కోల్పోతున్న ఉనికిని కాపాడుకునే దిశగా రాహుల్‌గాంధీ పాదయాత్రకు సిద్ధమయ్యారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలను కలుపుతూ యాత్ర సాగేలా కాంగ్రెస్ వర్గాలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. శిబిరం తీర్మానాల్లో రాహుల్ పాదయాత్ర నిర్వహించాలని ఓ కమిటీ చేసిన ప్రతిపాదనను అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. రాహుల్ చేపట్టనున్న పాదయాత్ర పేరును 'కన్యాకుమారి టు కశ్మీర్ భారత్ జోడో యాత్ర' అని ఖరారు చేశారు. ప్రజలకు చేరువ కావడమే లక్ష్యంగా అక్టోబర్ 2 నుంచి పాదయాత్రను ప్రారంభిస్తామంటున్నారు. ప్రజలతో సంబంధాలు తమ రక్తంలోనే ఉన్నాయంటున్నారు రాహుల్.. దేశంలో మతపరమైన విభజన జరగకుండా సమైక్య భావన పెంచాలనేది ఈ యాత్ర ఉద్దేశం అన్నారు. ఈ పాదయాత్ర ప్రకటన వెలువడగానే బీజేపీ సూటిగా స్పందించింది. 1947లో బీజేపీ లేదు. అప్పుడు దేశాన్ని రెండు ముక్కలు చేసిన పార్టీ కాంగ్రెసే అంటూ ఆ పార్టీ కార్యకర్తలు అంటున్నారు.

**రాహుల్‌పై ప్రాంతీయ పార్టీల ఆగ్రహం**

ప్రాంతీయ పార్టీలపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ మిత్ర పక్షాలకు కూడా మింగుడు పడలేదు. కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీల మాదిరిగా కాకుండా ఆరెస్సెస్ దాడిని నిరోధించేందుకు సైద్ధాంతికంగా తీవ్ర కృషి చేస్తోందని రాహుల్ అన్నారు. ప్రాంతీయ పార్టీలకు సిద్ధాంతం కరవైందన్నారు. వాటికి వేర్వేరు దృక్పథాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రాంతీయ పార్టీల నేతలకు ఆగ్రహం తెప్పించాయి. చాలా రాష్ట్రాల్లో ఉనికిని కోల్పోయిన కాంగ్రెస్‌కు ప్రాంతీయ పార్టీల మైత్రే కీలకం. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించాయి ఆ పార్టీ మిత్ర పక్షాలైన జేఎంఎం, ఆర్జేడీ, నేషనల్ కాన్ఫరెన్స్.

**టీ కాంగ్రెస్ నాయకుల్లో భయం!**

చింతన్ శిబిర్‌లో తీసుకున్న నిర్ణయాలతో తెలంగాణ కాంగ్రెస్ సీనియర్లలో భయాలు మొదలయ్యాయి. ఐదేళ్లు పార్టీ పదవుల్లో ఉన్నవారిని పక్కన పెట్టాలనే నిర్ణయం కలకలం రేపింది. తెలంగాణ నుంచి ఏఐసీసీ కార్యదర్శులుగా మాజీ మంత్రి చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సంపత్, వంశీ, మాజీ ఎంపీ మధుయాష్కి కొనసాగుతున్నారు. వీళ్ల పరిస్థితి ఏంటి అన్నది పెద్ద ప్రశ్న. చిన్నారెడ్డి చాలా కాలంగా ఆ పదవిలో కొనసాగుతున్నారు. సంపత్ మహారాష్ట్ర వ్యవహారాలను చూస్తున్న పార్టీ నేతల్లో ఒకరు.

వంశీచంద్ రెడ్డి పార్టీ నిర్మాణ వ్యవహారాలు చూస్తున్న కేసీ వేణుగోపాల్‌కు తోడుగా ఉన్నారు. వీళ్లంతా తిరిగి ఏఐసీసీలో కొనసాగుతారా? అనే అంశంపై గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మధుయాష్కి తెలంగాణ ప్రచార కమిటీ చైర్మన్‌గా, కర్ణాటక వ్యవహారాలు చూసే నాయకుల్లో ఒకరిగా ఉన్నారు. ఒకరికి ఒకే పదవి అనే షరతు వర్తింపచేస్తే తన దగ్గర ఉన్న రెండు పదవుల్లో దేనిని ఎంచుకుంటారో తెలియదు.

సుదీర్ఘకాలం పీసీసీ చీఫ్‌గా ఉన్న ఉత్తమ్ కుమార్‌రెడ్డికి హైకమాండ్‌లో తనకంటూ ఓ కోటరీ ఉంది. అంతేకాదు సోనియాగాంధీ కోటరిలోనే ఆయన ఉన్నారని చెబుతారు. పీసీసీ చీఫ్ పదవికి రాజీనామా చేసిన సమయంలోనే ఉత్తమ్‌కు ఏఐసీసీలో కీలక బాధ్యతలు అప్పగిస్తారని ప్రచారం జరిగింది. ఆయన్ని పార్టీ ప్రధాన కార్యదర్శిని చేస్తారని.. ఏదో ఒక రాష్ట్రానికి ఇంఛార్జ్‌గా పంపుతారనే వాదన ఉంది. ఇలా మొత్తానికి కాంగ్రెస్ చింతన్ శిబిర్ ఆ పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేసింది ఏమిటో తెలియదు కానీ అయోమయాన్ని మరింత పెంచేసింది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



**ఎందరో త్యాగధనుల దశాబ్దాల పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రం. కొట్లాడి సాధించుకున్న నేటి తెలంగాణలో స్వరాష్ట్ర లక్ష్యాలు ఏ మేరకు సఫలమయ్యాయి? రాష్ట్ర ఆవిర్భావానికి కారకులైన ఉద్యమకారుల ప్రస్తుత పరిస్థితి ఏంటి? ఆత్మబలిదానాలు చేసిన వాళ్ల కుటుంబాల స్థితిగతులు ఏంటి? ఉద్యమంలో కేసీఆర్‌కు అన్నీ తామై వెంట ఉండి ఆయనను ముందుకు నడిపించిన ఆనాటి మేధావులు, ప్రముఖుల జాడెక్కడ? ఇలాంటి ప్రశ్నలు మళ్లీ ఉదయిస్తున్నాయి. ఆర్థికంగా ఆదుకునే విషయంలో ప్రాణత్యాగాలు చేసుకున్న 1500కు పైగా అమరవీరుల సంఖ్యను కేవలం 15 నుంచి 20 శాతానికి కుదించిన నాటి సంగతులను తెలంగాణ సమాజం నెమరేసుకుంటోంది.**

# తెలంగాణ అమరుల త

తెలంగాణ తెచ్చాను.. తెచ్చాను అంటూ ముద్ర వేసుకుని తనదైన చతురతతో రాష్ట్రానికి అన్నీ తానే అన్న బ్రాండ్‌ను సంపాదించుకున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఇప్పుడు చేస్తున్న పనులను రాష్ట్రవ్యాప్తంగానే కాదు దేశవ్యాప్తంగా చర్చించుకుంటున్నారు. స్వరాష్ట్రం సిద్ధించింది మొదలు అధికార పీఠం అధిరోహించినప్పటి నుంచీ తానే కేంద్రబిందువు అయి పాలన సాగిస్తున్నారు. ఒకరకంగా ఏకపక్షంగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. తనకు ఎదురుచెప్పిన వాళ్లపై, తన విధానాలను సహించని వాళ్లపై ఎప్పటికప్పుడు ఉక్కుపాదం మోపుతున్నారు. అది ప్రతిపక్ష నేతలైనా, ఉద్యమ కాలంలో తనకు అండగా ఉన్నవాళ్లయినా, అధికార పక్ష సభ్యులైనా, చివరకు ప్రభుత్వంలో కీలకంగా ఉన్న మంత్రులైనా సరే. అందుకోసం తనవైన రాజకీయ వ్యూహాలను అమలు చేస్తున్నారు.

ఇంట గెలిచి రచ్చ గెలవాలన్న సామెత కేసీఆర్‌కు సరిగ్గా సరిపోతుంది. ప్రస్తుతం ఆయన ఆలోచిస్తున్న తీరు, అనుసరిస్తున్న వైఖరి తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయంటున్నారు విపక్షాలు, విశ్లేషకులు. సొంత రాష్ట్రంలో ప్రజల కష్టాలు, వాస్తవ పరిస్థితులను వదిలేసి ఉత్తరాదికి వెళ్లారు. అక్కడ రైతు ఉద్యమంలో చనిపోయిన వాళ్లకు ఆర్థిక సాయం అందజేశారు. అక్కడి ప్రభుత్వాలు, బాధితులతో జేజేలు కొట్టించుకున్నారు. ఏ ప్రభుత్వానికైనా తమ రాష్ట్రం బాగు కోసం పరితపించడం, తమ ప్రజలకు అండగా నిలవడం, ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు తోడ్పాటునందించడం అనేది ప్రాథమిక బాధ్యత. ఏ రాష్ట్రంలో ప్రభుత్వం ఆ రాష్ట్ర ప్రజల బాగోగుల కోసమే పనిచేస్తుంది. కానీ, తెలంగాణ సీఎం కేసీఆర్ మాత్రం తనకు ఓటేసి గెలిపించిన ప్రజలను మరిచి, తాను ఈ స్థాయిలో ఉండటానికి కారకులైన ఓటర్లను విస్మరించి.. ఇతర రాష్ట్రాల్లో బాధితులకు సాయం చేస్తానని చెబుతున్నారు. అమరులను, ఉద్యమాల్లో బలైన వాళ్లను ఆదుకోవడం తప్పు కాదు. కానీ, సొంత రాష్ట్రంలో ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమంలో అమరులైన కుటుంబాలను వదిలేసి, ఆర్థిక సుడిగుండంలో చిక్కుకొని ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల కష్టాలు విస్మరించి, చనిపోయిన రైతు కుటుంబాల దీనస్థితిని పక్కనబెట్టి ఇతర రాష్ట్రాల్లో చనిపోయిన వాళ్లకే ముందు వరుసలో ప్రాధాన్యం ఇవ్వడం అనేది సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది.

ఢిల్లీ సహా పలు రాష్ట్రాల సుదీర్ఘ పర్యటనకు ప్రణాళిక వేసుకున్న సీఎం కేసీఆర్.. ఈనెల 22న పంజాబ్‌కు వెళ్లారు. కేంద్రం ప్రతిపాదించిన సాగుచట్టాలు రద్దు చేయాలంటూ ఉత్తరాదిలో, ప్రధానంగా ఢిల్లీ సరిహద్దుల్లో సాగిన రైతు ఉద్యమంలో పలువురు రైతులు ప్రాణాలు కోల్పోయారు. అలా.. ప్రాణాలు కోల్పోయిన 600 మంది రైతు కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం తరపున కేసీఆర్ ఆర్థిక సాయం అందజేశారు. ఒక్కో రైతు కుటుంబానికి 3 లక్షల రూపాయల చొప్పున సాయం చేస్తామని గతంలో ప్రకటించారు. ఆ హామీ మేరకు పంజాబ్ వెళ్లి మరీ చెక్కులను పంపిణీ చేశారు.

ఆ కార్యక్రమానికి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను కూడా కేసీఆర్ వెంట బెట్టుకొని వెళ్లారు. కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్‌మాన్‌తో కలిసి ఆ కార్యక్రమంలో కేసీఆర్ పాల్గొన్నారు. సాగు చట్టాలను కేంద్రం వెనక్కి తీసుకోవడానికి పంజాబ్ రైతుల పోరాటమే కారణమని, వాళ్లకు సలాం చేస్తున్నానని వ్యాఖ్యానించారు. ఈ పోరాటం దేశ చరిత్రలో నిలిచిపోతుందంటూ కొనియాడారు. అలాగే చైనాతో జరిగిన యుద్ధంలో గల్వాన్ లోయలో ప్రాణత్యాగం చేసిన అమర జవాన్ల కుటుంబాలకు కూడా కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వం తరపున 3 లక్షల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు.



**విపక్షాల మండిపాటు**

ఈ నేపథ్యంలో కేసీఆర్‌కు విపక్షాలతో పాటు, మేధావులు పలు ప్రశ్నలను సంధిస్తున్నారు. ఉద్యమంలో అసువులుబాసిన వారి కుటుంబాలను కేసీఆర్ గాలికొదిలేశారని, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం.. కొంతమందినే ఆదుకొని మిగతా కుటుంబాలకు మొండిచెయ్యి చూపిందని గుర్తుచేస్తున్నారు. తెలంగాణ అమరవీరులను మరిచిన కేసీఆర్.. పంజాబ్‌లో రైతులను స్మరిస్తున్నారని అభిప్రాయ పడుతున్నారు. అంతేకాదు, తెలంగాణలో అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారమే 1381 మంది ఆత్మబలిదానం చేసుకోగా.. 576 మందికి మాత్రమే



# త్యాగాలు గుర్తులేవా?

సుజాత గోపగోని, 6302164068

ప్రభుత్వం ఆర్థిక సాయం చేసింది. మిగతావాళ్లను అసలు అమరవీరులుగానే గుర్తించలేదు. కానీ, పంజాబ్‌లో మాత్రం రైతు ఉద్యమంలో చనిపోయిన 600 మందికి ఆర్థిక సాయం చేసింది. ఈ సంఖ్యను కూడా పలువురు ప్రస్తావిస్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావానికి కారణమైన త్యాగధనుల సంఖ్యను కుదించేందుకు తాపత్రయపడ్డ కేసీఆర్.. పంజాబ్‌లో రైతు ఉద్యమంలో మరణించిన వాళ్ల సంఖ్యలో ఏ లెక్కలు అనుసరించారని ప్రశ్నిస్తున్నారు. అంతేకాదు.. అమరవీరుల యాదిలో అమలు చేస్తామన్న హామీలు కూడా అటకెక్కాయని విమర్శిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేస్తామన్న అమరుల స్మారక చిహ్నం, స్మృతివనం ఎనిమిదేండ్లు గడుస్తున్నా ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయని ఎత్తిచూపుతున్నారు.

తెలంగాణ మలి దశ ఉద్యమంలో వాస్తవానికి శ్రీకృష్ణ కమిటీకి విజ్ఞప్తులు, నివేదికలు సమర్పించిన సమయంలోనే దాదాపు 1,381 మంది అమరులయ్యారని టీఆర్ఎస్‌తో పాటు, అప్పటి పొలిటికల్ జేఏసీ రిపోర్ట్ ఇచ్చాయి. ఆ తర్వాత 1,089 మంది అమరులు ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎలా చనిపోయారో పూర్తి వివరాలతో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కూడా మరో నివేదికను రూపొందించింది. టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే అమరుల కుటుంబాలను ఆదుకుంటామని 2014 మేనిఫెస్టోలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం, ఒకరికి ఉద్యోగం, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు సాగుకు యోగ్యమైన భూమి, పిల్లల చదువు బాధ్యతలు తీసుకుంటామని పేర్కొన్నారు. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 80ని కూడా రిలీజ్ చేసింది. కానీ, దశల వారీగా కేవలం 576 మందినే గుర్తించింది. వీరిలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.10 లక్షల ఆర్థిక సాయం మాత్రమే అందించింది. సాగు భూమి, ఇల్లు, చదువు, హెల్త్ కార్డులు మాత్రం ఇవ్వలేదు. ఇక 12 మందికి మాత్రమే వీఆర్వో స్థాయి ఉద్యోగాలు ఇచ్చారు. మిగతా వారందరికీ జూనియర్ అసిస్టెంట్, స్వీపర్, వాచ్‌మెన్, అటెండర్ ఉద్యోగాలు ఇచ్చారు. 1381లో 576 కుటుంబాలు పోగా, మిగతావారిని ప్రభుత్వం గాలి కొదిలేసింది. అమరుల బలిదానాల ఆధారాలు ఉన్నా పట్టించుకోవడం లేదని ఉద్యమకారులు, అమరుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. టీఆర్ఎస్ లీడర్లే వచ్చి అంతిమ సంస్కారాల్లో పాల్గొన్న ఫొటోలు ఉన్నా ప్రభుత్వం ఆర్థికసాయం చేయడం లేదని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి. తమను పట్టించుకోవాలని అమరుల కుటుంబాలు అనేక దఫాలుగా నిరసనలు, ఆందోళనలు చేపట్టినా పట్టించుకునేవారు కరవయ్యారు.

> హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్ వద్ద ప్రపంచంలో అత్యంత ఎత్తైన అమరుల స్మారక చిహ్నం, దాని పక్కనే అమరుల స్మృతివనం నిర్మిస్తామని టీఆర్ఎస్ మేనిఫెస్టోలో పేర్కొన్నారు. కానీ ఆ ప్రతిపాదనలు పూర్తి కావడం లేదు. నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పిస్తున్నాయి. అన్ని జిల్లాల్లో అమరుల స్మృతి వనాలు నిర్మిస్తామని మేనిఫెస్టోలో పెట్టడంతో పాటు నాయకులు ఎన్నికల్లోనూ ప్రచారం చేశారు. కానీ, వాటి ఊసు కూడా లేకుండా పోయింది.

హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్ వద్ద ప్రపంచంలో అత్యంత ఎత్తైన అమరుల స్మారక చిహ్నం, దాని పక్కనే అమరుల స్మృతివనం నిర్మిస్తామని టీఆర్ఎస్ మేనిఫెస్టోలో పేర్కొన్నారు. కానీ ఆ ప్రతిపాదనలు పూర్తి కావడం లేదు. నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పిస్తున్నాయి. అన్ని జిల్లాల్లో అమరుల స్మృతి వనాలు నిర్మిస్తామని మేనిఫెస్టోలో పెట్టడంతో పాటు నాయకులు ఎన్నికల్లోనూ ప్రచారం చేశారు. కానీ, వాటి ఊసు కూడా లేకుండా పోయింది.

ఇప్పుడీ అంశాలన్నీ తెలంగాణ ప్రజలు, ఉద్యమకారులు, విపక్షాల నేతలు గుర్తు చేస్తున్నారు. ఇలా.. ఇల్లు వదిలి రచ్చకేగి కేసీఆర్ ఏ సందేశం ఇవ్వదలచుకున్నారని ప్రశ్నిస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై అక్కసుతో కేసీఆర్ ఏం చేస్తున్నారో ఆయనకే అర్థంకాకుండా పోతోందని పలు పార్టీల నేతలు విమర్శిస్తున్నారు. మోదీకి తాను వ్యతిరేకమని, కేంద్రంలో కొత్త ఎజెండా రూపకల్పన చేస్తానని, ప్రత్యామ్నాయ ఫ్రంట్‌ను ఏర్పాటు చేస్తానని దాదాపు ఐదారేళ్లుగా సభలు, సమావేశాల్లో ప్రకటిస్తున్న కేసీఆర్ సందర్భం వచ్చినప్పుడల్లా తన ఆలోచనలను ప్రస్ఫుటించేలా చేస్తున్నారు. ఇప్పుడు ఉత్తర భారత పర్యటన కూడా దానికి సంకేతమంటున్నారు. ఢిల్లీలో బీజేపీని వ్యతిరేకించే ఆయా పార్టీల నేతలతో భేటీ అయ్యారు. అధికారిక పర్యటన పేరుతో పంజాబ్ వెళ్లి.. అక్కడి ముఖ్య మంత్రి భగవంత్‌మాన్‌ను కూడా కలిశారు. వెళ్తూ వెళ్తూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను కూడా వెంటబెట్టుకొని వెళ్లి.. ముగ్గురూ కలిసి మంతనాలు సాగించారు. ఆ తర్వాత ముందుగా రూపొందించుకున్న షెడ్యూల్‌ను పక్కనబెట్టి.. రాత్రికి రాత్రి హైదరాబాద్ బయలుదేరి వచ్చారు.

ఈ నెల 26న ప్రధానమంత్రి నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటన ఖరారైంది. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ – ఐఎస్‌బీ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని రానున్నారు. అయితే, మోదీది అధికారిక పర్యటన అయినందున రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రొటోకాల్ ప్రకారం తప్పనిసరిగా ప్రధానికి స్వాగతం పలకాల్సి ఉంటుంది. ఆ పర్యటనలో ప్రధాని వెంటే ఉండి.. తిరుగు ప్రయాణంలోనూ వీడ్కోలు పలకాలి. అయితే, దీనిని తప్పించుకునేందుకే కేసీఆర్ ఢిల్లీ పర్యటన షెడ్యూల్ చేసుకున్నారని విశ్లేషకులు అంచనా వేశారు. ఎందుకంటే ఏకంగా పదిరోజుల పాటు దేశవ్యాప్త పర్యటనను రూపొందించుకున్నారు ఆయన. ప్రధాని పర్యటన రోజు హైదరాబాద్‌లో ఉండకుండా ఉండేందుకే అదేరోజు కర్ణాటకకు వెళ్లి దేవెగౌడ, కుమారస్వామిని కలిసేందుకు కేసీఆర్ ప్లాన్ చేసుకున్నారని, మరుసటిరోజు కూడా తనదైన వ్యూహంలో భాగంగానే మహారాష్ట్ర టూర్ షెడ్యూల్ చేసుకున్నారని భావించారు. కానీ, ఉన్నట్టుండి 23 రాత్రే ఢిల్లీలో ఉండకుండా హుటాహుటిన హైదరాబాద్ వచ్చేశారు. షెడ్యూల్‌ను పక్కనబెట్టి మరీ కేసీఆర్ హైదరాబాద్‌కు తిరిగి రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

కేంద్ర ప్రభుత్వం పెట్రోలుపై తాజాగా రూ.8, డీజిల్‌పై రూ.6 చొప్పున ఎక్సైజ్ సుంకం తగ్గించింది. గత నవంబరులో పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. కాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం తగ్గించలేదు. ఇప్పుడు కూడా తగ్గిస్తామని అనడం లేదు సరికదా అసలు స్పందించడం లేదు. మొదటిసారి తగ్గించినప్పుడు 20 రాష్ట్రాలు తమ వ్యాట్‌ను తగ్గించుకుని ప్రజలకు ఉపశమనం కలిగించాయి. అందులో కేంద్ర ప్రభుత్వం పట్ల సఖ్యత లేని కేరళ, రాజస్థాన్ కూడా వున్నాయి. కోవిడ్ నేపథ్యంలో కొత్తగా ఏ రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్‌లు పెంచలేదు. కాని ఏపీ ప్రభుత్వం మాత్రం వ్యాట్ అదనపు పన్ను రూ.2, రోడ్ల అభివృద్ధి పన్ను రూ.1 విధించింది. పెట్రోల్‌పై రూ.31, డీజిల్‌పై రూ.22.5 వ్యాట్ విధించింది. కేంద్రం ఒకందుకు పన్నులు వేస్తే, సొంత లాభానికి పెంచినట్లు రాష్ట్రాలు ఆరో పిస్తున్నాయి. కేంద్రం తను వసూలు చేసిన ప్రతి రూపాయిని అభివృద్ధికి ఖర్చుచేస్తే వైకాపా ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుతోంది. అభివృద్ధి అనే మాటను దూరంగా ఉంచింది. వచ్చిన ఆదాయాన్ని పథకాల పేరుతో పంచేసి దుబారా చేస్తోంది. అభివృద్ధి మాట దేవుడెరుగు... కనీసం తన వంతుగా వ్యాట్ తగ్గిస్తే ప్రజలకు కాస్తయినా ఉపశమనం కలుగుతుంది. లేదా వారి శాపనార్థాలకు గురికాక తప్పదు.

కూరగాయలు, పప్పుల ధరలు తగ్గడానికి అవకాశాలు ఉంటాయి. దిగుమతి చేసుకునే కొన్ని వస్తువుపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గించారు. ప్లాస్టిక్ తయారీకి వాడే ముడిసరుకులపై సుంకాన్ని తగ్గించడం వల్ల సంబంధిత వస్తువుల ధరలు దిగివస్తాయి. ఈ నిర్ణయం వల్ల ప్లాస్టిక్ ఉత్పత్తుల పరిశ్రమకు కూడా మేలు కలుగుతుంది. స్టీలు తయారీలో వాడే ముడి పదార్థాలపైనా కస్టమ్ సుంకాలను తగ్గించడంతో ఇనుము ధరలు దిగివచ్చి ఎన్నో పరిశ్రమలకు మేలు జరుగుతుంది. చుక్కల్లో ఉన్న సిమెంటు ధరలను తగ్గించడానికి కూడా ప్రభుత్వం కొన్ని చర్యలను ప్రకటించింది. సరఫరాలో ఇబ్బందులను తొలగిస్తామని, ముతాతత్వం లేకుండా చేస్తామని తెలిపింది. దీనివల్ల సిమెంట్ ధర కూడా తగ్గేందుకు అవకాశాలు ఉంటాయి.

**ద్రవ్యోల్బణం అదుపునకు**

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని, ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఇనుము, ఉక్కు కోసం ముడి పదార్థాలపై కస్టమ్స్ సుంకాన్ని కూడా తగ్గించాలనే నిర్ణయాలు ద్రవ్యోల్బణం శాతం తగ్గించే యోచనతో చేసినవే. రిటైల్ ద్రవ్యోల్బణం ఎనిమిదేళ్ల గరిష్ఠ స్థాయి 7.9 శాతానికి పెరిగింది, అయితే టోకు ద్రవ్యోల్బణం వరుసగా 13 నెలలు రెండంకెలలో ఉంది. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి ఆర్థిక, ద్రవ్య విధానాలు రెండూ అవసరమని భావించిన కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇంధన పన్నులలో తగ్గింపు జూన్‌లో ద్రవ్యోల్బణాన్ని నేరుగా




# పెట్రో ధర తగ్గింపు రాష్ట్రా

కేంద్ర ప్రభుత్వం పెట్రో ఉత్పత్తులు, ఎల్పీజీ, స్టీల్, ఎరువులపై ఎక్సైజ్ డ్యూటీలను, పన్నులను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల సామాన్యుడికి ఎంతో ఉపశమనం కలుగనుంది. ముఖ్యంగా పెట్రో ధరల పెరుగుదల వల్ల అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయి. ఇక నుంచి ఇవి కొంత మేర తగ్గుతాయని చెప్పవచ్చు. పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ. 8, లీటర్‌కు రూ. 6 చొప్పున తగ్గించడం, ఎల్పీజీ సబ్సిడీ కస్టమ్ డ్యూటీలపై తగ్గింపుల వల్ల ఇంటి బడ్జెట్‌పైనా భారం తక్కువ కానుంది. ఇంధనాలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం జనానికి అన్నింటికంటే ఎక్కువ మేలు చేస్తుంది. వీటి రేట్లు దిగిరావడం వల్ల ఆహారం, రవాణా సహా చాలా వస్తువుల ధరలు తగ్గుతాయి. ఇంటి బడ్జెట్‌లపై ద్రవ్యోల్బణం ప్రభావాన్ని కొంతవరకు ఎదుర్కోవచ్చు. ఎక్సైజ్ సుంకాల కోత వల్ల ప్రభుత్వానికి ఏడాదికి రూ.లక్ష కోట్ల నష్టం వచ్చే అవకాశం ఉంది. పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్రాలు విధించే విలువ ఆధారిత పన్ను (వ్యాట్) కూడా తగ్గితే రేటు మరింత దిగివస్తుంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద ఎల్పీజీ సిలిండర్‌లపై రూ. 200 చొప్పున సబ్సిడీని అందిస్తారు. ఇలా 12 సార్లు ఇవ్వడం వల్ల ఇంటి బడ్జెట్‌పై భారం మరింత తగ్గుతుంది. ఎక్కువ ధరల కారణంగా సిలిండర్‌ను కొనడం మానేసిన వాళ్లు మళ్లీ కొంటారు. దీంతో ప్రభుత్వానికి పన్నుల ఆదాయమూ పెరుగుతుంది. దేశవ్యాప్తంగా రైతులకు ఎరువుల సబ్సిడీ కోసం కేంద్రం బడ్జెట్‌లో రూ. 1.05 లక్షల కోట్లు, తాజాగా మరో రూ. 1.10 లక్షల కోట్లు కేటాయించింది. దీనివల్ల రైతులకు మేలు జరుగుతుంది. సాగు ఖర్చు అదుపులో ఉంటుంది. దాదాపు 20 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించడంలో సహాయపడుతుంది. కేంద్రం ఇంధన పన్నులను తగ్గించడం ఇటీవలి కాలంలో ఇది రెండోసారి. గతేడాది నవంబర్‌లో పెట్రోల్‌పై రూ. 5, డీజిల్‌పై రూ. 10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. అప్పుడు, 21 రాష్ట్రాలు, కొన్ని కేంద్రపాలిత ప్రాంతాలు వ్యాట్‌ని తగ్గించాయి. ఈసారి కూడా రాష్ట్ర ప్రభుత్వాలు ఇదే విధానాన్ని అనుసరిస్తే ఉపశమనం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ తగ్గింపునకు ముందు కేంద్రం, రాష్ట్రాలు విధించిన పన్నులు పెట్రోల్ రిటైల్ అమ్మకపు ధరలో దాదాపు 43 శాతం ఉన్నాయి. కానీ తాజా తగ్గింపుతో, ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని ప్రీ-పాండమిక్ స్థాయికి తీసుకువచ్చింది. ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం వల్ల ప్రభుత్వ ఆదాయం రూ.లక్ష కోట్ల మేర తగ్గుతుందని ఆర్థిక మంత్రి

తెలిపారు. ఇలా ఏర్పడిన నష్టాన్ని.. పన్ను తగ్గించిన వస్తువుల అమ్మకాలపై వచ్చే పన్నుల ద్వారా భర్తీ చేసుకునే అవకాశం ఉంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, తగ్గింపు తర్వాత ప్రభుత్వ పన్ను రాబడులు బడ్జెట్ అంచనాల కంటే దాదాపు రూ. 1.3 లక్షల కోట్ల మేర పెరుగుతాయి.

**ధరలపై ప్రభావం చూపే అంశాలు**

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో మార్పు నేరుగా దేశీయ మార్కెట్‌లో ముడి చమురు ధరను ప్రభావితం చేస్తుంది. దేశంలో పెట్రోల్ ధరల పెరుగుదలకు ఇది ముఖ్యమైన కారణం. తక్కువ ఉత్పత్తి రేటు, ముడి చమురు ఉత్పత్తి దేశాలలో ఏదైనా రాజకీయ అశాంతి, అంతర్జాతీయ డిమాండ్ పెరుగుదల పెట్రోలు ధరను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. భారతదేశం, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలలో జరుగుతున్న ఆర్థికవృద్ధి కూడా పెట్రోల్, ఇతర ముఖ్యమైన ఇంధనాలకు డిమాండ్ పెరగడానికి కారణం. ద్విచక్రవాహనాల వినియోగం పెరగడం కూడా దేశంలో పెట్రోలు డిమాండ్‌కు ఒక



# నికి పట్టేదా?

కారణంగా పేర్కొనవచ్చు. ముడి చమురు ఇన్‌పుట్ అధిక ధర కారణంగా భారతదేశంలోని ఆయిల్ రిఫైనరీ కంపెనీలు మార్కెట్ డిమాండ్‌లను తీర్చడంలో సమస్యను ఎదుర్కొంటు న్నాయి. ఫలితంగా దేశంలో పెట్రోల్‌కు సరఫరాకు మించి డిమాండ్ ఏర్పడుతోంది. ఇంధనాలపై పన్నులు విధించే స్థానిక ప్రభుత్వ విధానాల ప్రకారం పెట్రోల్, ఇతర పెట్రోలియం ఉత్పత్తుల ధరలు మారుతూ ఉంటాయి. భారత ప్రభుత్వం ఇంధనాలపై పన్ను రేట్లు పెంచినప్పుడు, దేశంలోని చమురు కంపెనీలు ఆ నష్టాలను తిరిగి పొందేందుకు పెట్రోల్ ధరను కూడా పెంచుతాయి. అలాగే భారతదేశంలో పెట్రోల్ ధరను ప్రభావితం చేసే ప్రధాన కారకాల్లో రూపాయి–డాలర్ మారకం రేటు కూడా ఒకటి. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే చమురుకు భారతీయ చమురు కంపెనీలు డాలర్ల రూపంలో చెల్లిస్తాయి. ముడిచమురు ధర పతనంలో ఉన్నప్పుడు, డాలర్‌తో రూపాయి కూడా బలహీనంగా ఉన్నప్పుడు, అది చమురు శుద్ధి దారులకు లాభాలను తగ్గిస్తుంది. మరోవైపు, డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడి నప్పుడు ముడి చమురు ధర పతనంలో ఉన్నప్పుడు చమురు కంపెనీలు లాభపడతాయి. రిటైల్ ఇంధన ధర నిర్ణయించడంలో ముఖ్యమైన కారకాల్లో లాజిస్టిక్స్ ఒకటి. డిపోల నుండి దూరంగా ఉన్న నగరాలు లేదా ప్రాంతాలకు ఎక్కువ దూరాలకు రవాణా చేయబడిన పెట్రోల్, డీజిల్‌కు చమురు నిల్వ ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రదేశాల కంటే ఎక్కువ ధర ఉంటుంది. దేశంలోని వివిధ నగరాల్లో పెట్రోల్ ధరల మార్పు వెనుక కారణం ఇదే. ఒకదానికొకటి దూరంగా ఉన్న నగరాల మధ్య ఈ వ్యత్యాసం భారీగా ఉండవచ్చు. ఉదాహరణకు, ఢిల్లీలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు ఒక ధర ఉంటే ముంబైలో మరో ధర, దక్షిణాది రాష్ట్రాల్లో కొంత తేడా ఉంటుంది. తాజాగా తగ్గించాక కూడా న్యూఢిల్లీలో లీటరుకు రూ. 96.72, కోల్‌కతాలో లీటరుకు రూ.106.03, ముంబైలో లీటరు రూ.111.35, చెన్నైలో రూ.102.63. వసూలు చేస్తున్నారు. పెట్రోలు జీఎస్టీ పరిధిలోకి రానందున, దాని ధర రాష్ట్రాలలో ఇలా మారుతూ ఉంటుంది.

**దిగుమతుల ప్రభావం**

మనదేశం చమురు, గ్యాస్‌ల విషయంలో ప్రధానంగా దిగుమతులపై ఆధారపడి ఉంటుంది.



**తురగా నాగభూషణం**

దేశీయ అవసరాలను తీర్చడానికి దేశం 82.8% ముడి చమురు, 45.3% సహజ వాయువును దిగుమతి చేసుకుంటోంది. ముడి చమురు దిగుమతి కారణంగా 2017 – 2018 ఆర్థిక సంవత్సరానికి దేశ నికర విదేశీ మారకం 3.305 బిలియన్ డాలర్లుగా ఉంది. దేశీయ ముడి చమురు ద్వారా సుమారు 35.2 మిలియన్ టన్నుల పెట్రోలు, దాని సంబంధిత ఉత్పత్తులను ఉత్పత్తి చేసింది, అయితే పెట్రోలియం, దాని ప్రత్యామ్నాయ ఉత్పత్తుల వినియోగం 200 మిలియన్ టన్నులకు పైమాటే. దేశం 2021–22లో 212.2 మిలియన్ టన్నుల ముడి చమురును దిగుమతి చేసుకుంది. ఇది అంతకు ముందు సంవత్సరంలో 196.5 మిలియన్ టన్నులుగా ఉంది. 2019–20లో 227 మిలియన్ టన్నులు. 2019–20లో చమురు దిగుమతులపై చేసిన వ్యయం 101.4 బిలియన్ డాలర్లు. ఇంధనాన్ని అధికంగా దిగుమతి చేసుకోవడం వల్ల చమురు వినియోగం విషయంలో అమెరికా, చైనాల తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. దేశంలో పెట్రోలియం నిల్వలు సరిపడా లేకపోవడం వల్ల భారతదేశం దిగుమతులపై ఆధారపడవలసి వచ్చింది. వాయు కాలుష్యానికి బాగా దోహదపడే పెట్రోలియం ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలని యోచిస్తూ, ప్రత్యామ్నాయ ఇంధన సమృద్ధిని సాధించడానికి పునరుత్పాదక వనరులైన పవన, సౌర, బయోమాస్, జలవిద్యుత్ మొదలైన వాటిని ఉపయోగించుకోవడానికి దేశం నెమ్మదిగా మొగ్గు చూపుతోంది. వివిధ సంక్షేమ పథకాల అమలుకు, మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన వనరుల సేకరణ కోసమే పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకం పెంచవలసి వస్తున్నా, దానివల్ల సామాన్యులపై అదనపు భారం పడుతోంది. దేశంలో చమురు ఉత్పత్తుల నుంచి స్వీకరించిన పన్నులన్నీ ఎవరి జేబుల్లోకి వెళ్లడం లేదు. రహదారులు, రైల్వే లైన్లు, ఓడరేవులు, విద్యాసంస్థలు, ఆరోగ్య సదుపాయాలకు వాటిని ఖర్చు చేస్తున్నారు. అందువల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అయినా పెట్రోలు ధరలను దీర్ఘకాలికంగా తగ్గించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అందుకు మరింత మన్నికైన దీర్ఘకాలిక పరిష్కారాన్ని కనుగొనవలసి ఉంటుంది.

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో మార్పు నేరుగా దేశీయ మార్కెట్‌లో ముడి చమురు ధరను ప్రభావితం చేస్తుంది. దేశంలో పెట్రోల్ ధరల పెరుగుదలకు ఇది ముఖ్యమైన కారణం. తక్కువ ఉత్పత్తి రేటు, ముడి చమురు ఉత్పత్తి దేశాలలో ఏదైనా రాజకీయ అశాంతి, అంతర్జాతీయ డిమాండ్ పెరుగుదల పెట్రోలు ధరను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. భారతదేశం, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలలో జరుగుతున్న ఆర్థికవృద్ధి కూడా పెట్రోల్, ఇతర ముఖ్యమైన ఇంధనాలకు డిమాండ్ పెరగడానికి కారణం.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



# రావణ గర్వ

*(గత సంచిక తరువాయి)*

**కు**టీరం బయట చెట్టునీడలో కళ్ళు మూసుకుని కూర్చున్నాడు విశ్వామిత్రుడు. కొద్దిరోజుల క్రితం తాను చేయబోయిన యాగం గుర్తొచ్చింది. యాగం మొదలయ్యే లోపల అగ్ని ఆరిపోయేది. సమిధలు మాయమై వాటి స్థానే ఎముకలు కనిపించేవి. ఈ పనులన్నీ మారీచ సుబాహులవే. వీళ్ళకి తోడు వారి తల్లి తాటకి ఒకత్తె. ఈ కుర్ర కుంకల్ని చంపడం పెద్ద పని కాదు కానీ ఇన్ని వేల ఏళ్ళు తపస్సు చేసి తన శత్రువు చేత బ్రహ్మర్షి అనిపించుకున్న తనకి యాగం చేసే సమయంలో కోపం రాకూడదు. అయినా ఈ రాక్షసులకి ఇంతబలం రావడానిక్కారణం వీళ్ళ పైనున్న దశకంఠుడే. వాడి అండ చూసుకునే కదూ పేట్రేగిపోతున్నారు. ఏదో ఒకనాడు తనకి కోపం తెప్పించి ఎలాగోలా యుద్ధానికి రప్పించడానికి పది తలలతో విశ్వప్రయత్నం చేస్తున్నాడు. వీడి చావు ఎవరి చేతుల్లో ఉందో? ఈ యాగం ప్రస్తుతానికి ఆపి ఏదో ఒకటి ఆలోచించాలి.

బిగ్గరగా ఏడుస్తున్న ఓ స్త్రీ కంఠం వినిపించి కళ్ళు తెరిచి చూసేదు మహర్షి. నడుము వంగిపోయి చింపిరి జుట్టుతో నేలమీద పడి పొర్లుతూ ఏడుస్తోందో స్త్రీ.

"ఏమమ్మా? ఏమైంది?" అడిగేదు ఆత్రుతతో.

ఏడుపు ఆపి ఆవిడ చెప్పిన కథ అంతా విన్నాడు. కోపంతో మొహం జేవురించింది. జరగబోయేది చూడడానికా అన్నట్టు ఒక్క క్షణం ధ్యానంలో కళ్ళు మూసుకున్నాడు.

"విచారించకు. నువ్వు అయోధ్యకి వెళ్ళి అక్కడున్న ఇక్ష్వాకు మహారాజు దశరథుడితో నేను నిన్ను ఆశ్రయం కోసం పంపించాననీ, రాబోయే రోజుల్లో వచ్చి కలుసుకుంటాననీ చెప్పు. నీకీ గతి పట్టించినవాడని సర్వనాశనం చేయడానికీ నీచేత్తోటే బీజం వేద్దువు గాని. ఆలస్యం చేయకుండా బయల్దేరు. సృష్టికి ప్రతిసృష్టి చేసిన ఈ విశ్వామిత్రుడి మాట జరిగి తీరుతుందని గుర్తు పెట్టుకో."

ఆవిడటు వెళ్ళగానే కళ్ళుమూసుకున్నాడు విశ్వామిత్రుడు.




❄ 'మొక్క'బడి ❄



# దేవతావిగ్రహాలకు ప్రశస్తం దేవదారు

**దే**వదారు వృక్షజాతికి చెందినది. ఇది ఎక్కువగా అరణ్యాల్లో పెరుగుతుంది. వినాయక చవితి రోజు చేసుకునే వరసిద్ధివినాయక ఏకవింశతి పత్రి పూజా క్రమంలో ఈ ఆకు పదమూడవది. పార్వతీదేవికి మహా ఇష్టమైనది. చల్లని ప్రదేశంలో, ముఖ్యంగా హిమాలయ

**దోర్బల పూర్ణిమాస్వాతి**

# భంగం-3

ఈ సారి మనసుని దొలిచే ప్రశ్న ఒకటే. ఈ రావణుడి చావు ఎవరిచేతిలో రాసిపెట్టి ఉందో? ధ్యానంలో ఖంగు ఖంగుమని మోగే ధనుష్టాంకారం వినిపిస్తోంది. పినాకపాణిదా? మరి పరమ శివుడు రావణుడికి చంద్రహాసం ఇచ్చినట్టు విన్నాడే? కొద్ది క్షణాల్లో ఆ ధ్వని ఎవరిదో తెలిసింది. సుదర్శనమూ, నందకమూ ఎప్పటికప్పుడు స్వామి అడగకుండానే సిద్ధంగా ఉంటాయి కనక శార్ఙ్గ ధనువుకి ఇప్పటిదాకా ఏం చేయడానికీ అవకాశం రాలేదు.ఇప్పుడు ధనువుదే అవకాశం. అదన్నమాట ధ్వని. మరి ఇంతటి రాక్షస కులాన్ని నిర్మూలించడానికి, ఎక్కడో మూలనున్న రావణుణ్ని ఆ స్వామి ఎలా చేరతాడో? శతయోజన విస్తీర్ణమైన సాగరాన్ని లంఘించవద్దూ? అయినా ఇంత ఆలోచన దేనికీ? తన పని ఏమిటో తెల్సింది కదా? తను సాధించిన శస్త్రాస్త్ర సంపదనంతా ఆయనకు ధారాదత్తం చేస్తే చాలు. సాగర లంఘనం, రావణ సంహారం అవన్నీ ఆయనే చూసుకోడూ? సాగర లంఘనం ఓ పెద్ద పనా? ఏ కోతైనా దూకగలదు కావాల్సివచ్చినప్పుడు.

కిచకిచ చప్పుళ్లకి ధ్యానభంగమై కళ్ళు తెరిచేడు. ఎప్పుడొచ్చాయో చెట్టుమీద కోతులన్నీ దిగి చుట్టూరా కూర్చొనున్నాయి. ఇదన్నమాట అసలు రహస్యం. వీటితోటే ఆయన కావాల్సిందీ, చేతనైనదీ చేస్తాడు. తనపని తాను చేయడమే. లేచి కుటీరం లోకి వెళ్ళి ఉన్న పళ్ళు అన్నీ తెచ్చి కోతుల గుంపు ముందు పెట్టేడు తినడానికి. ★

పర్వతాల వద్ద పెరుగుతుంది ఈ వృక్షం. దేవదారు పూలు పరమేశ్వరుడికి కూడా ప్రీతిపాత్రమైనవే. దేవదారు ఆకులను తెచ్చి ఆరబెట్టి, వాటిని నూనెలో వేసి కాచి, చల్లార్చిన తరువాత నూనె తలకి రాసుకుంటే మెదడు, కంటి సంబంధ రోగాలు దరిచేరవు.

దేవదారు మాను నుంచి తీసిన నూనె చుక్కలను వేడినీళ్లలో వేసి ఆ నీటితో స్నానం చేస్తే శ్వాసకోశ వ్యాధులు నయమవుతాయి.

ఈ ఆకు ఎల్లప్పుడూ పచ్చ రంగులో ఉంటుంది. పరిమాణం పెద్దది. ఈ చెట్టు మహావృక్షంగా పెరుగుతుంది.

దేవదారు పత్రాల చిగుళ్ల మేహశాంతిని కలిగిస్తాయి.

దీని ఆకులతో కాచిన తైలం కళ్లకు చలువజేస్తుంది.

ఈ చెట్టు ఆకులు, పువ్వులు కూడా మంచి ఔషధులే.

**సువాసన గుణం**

ఈ పత్రి సుగంధభరితంగా ఉంటుంది.

ఇతర ఉపయోగాలు: ఈ మానుతో చెక్కిన విగ్రహాలకు సహజత్వం ఉంటుంది. దేవదారు శరీర వేడిని తగ్గిస్తుంది. ఈ పత్రి చర్మ వ్యాధులు, చిన్న చిన్న దెబ్బలు మానడానికి ఉపయోగపడుతుంది. దేవదారు కలపతో చేసిన పనిముట్లు చాలా దృఢంగా ఉంటాయి. ★

**❋ తాత్వికత ❋**

వేర్వేరు గురువుల దగ్గర శిష్యరికం చేస్తున్న ఇద్దరు యువకులు ఓచోట కలుసుకున్నారు.

ఇద్దరూ పరస్పరం కుశలప్రశ్నలు వేసుకున్నారు. ఆ తర్వాత తమ గురువుల గురించి మాట్లాడుకున్నారు.

వారిలో ఒకడన్నాడు..."మా గురువుగారు మహామేధావి. తెలుసా...? మనకంతా రోజుకు 24 గంటలేగా ఉండేది. కానీ మా గురువుగారికి మాత్రం ఆ సమయంలోనే 30 గంటలకు సరిపడా పని చేస్తారు" అన్నాడు.

"అలాగా..." అని రెండో శిష్యుడు ఆశ్చర్యంగా చూశాడు.

"అవును, ఆయన రోజూ ధ్యానం చేస్తున్నప్పుడే ఆరోజు ఎవరికి ఏం చెప్పాలా అని ఆలోచిస్తారు. స్నానం చేస్తున్నప్పుడు ఆ రోజు చెప్పవలసిన విషయాలకు అవసరమైన ఉదాహరణల గురించి, వాటిని ఏ విధంగా చెప్పాలి తదితర




విషయాల గురించి ఆలోచిస్తారు. అలాగే అన్నం తింటున్నప్పుడు నలుగురికీ చెప్పవలసిన విషయాల గురించి తనలో తానే మాట్లాడుకుంటారు. ఆ తర్వాత ప్రసంగం మొదలుపెట్టి జలపాతంలా తన మాటలను కుమ్మరిస్తారు. ఆ మాటలకు వినేవారందరూ పరవశించిపోవలసిందే" అన్నాడు.

"చాలా సంతోషం" అంటూ రెండో శిష్యుడు తన గురువుగారి గురించి చెప్పడం మొదలుపెట్టాడు. "మా గురువుగారూ మహాజ్ఞాని. కానీ ఉన్న గంటలను ఎక్కువ చేసుకుని హైరాన పడరు" అని చెప్పాడు.

"అదెలా" అని మొదటి శిష్యుడు ప్రశ్నించాడు.

అప్పుడు రెండో శిష్యుడు ఇలా చెప్పాడు "...మా గురువు ధ్యానం చేసేటప్పుడు దాని గురించే ఆలోచిస్తారు. మనసు మరి దేనిమీదా పోనివ్వరు. అలాగే స్నానం చేసేటప్పుడు దానిమీదే మనసుంటుంది. అన్నం తినేటప్పుడు తినే ఆహారంపైనే ఉంటుంది మనసంతా. శిష్యులకు పాఠం చెప్పేటప్పుడు తనకు తెలిసిన విషయాలనే ఆసక్తికరంగా చెప్తారు.... అంతే" అని.

అనంతరం మొదటి శిష్యుడు "నేనూ మీ గురువుగారి దగ్గరకే రావాలను కుంటున్నాను. నువ్వు నా విషయం ఆయనకు చెప్పి నన్ను చేర్పించు మీ గురువుగారి దగ్గర" అని అన్నాడు.

వర్తమానంలో జీవించడంలోనే ఆనందం ఉంది. జరిగిపోయిన నిన్నటి గురించి, జరగబోయే రేపటి గురించి ఆలోచించి బుర్ర పాడు చేసుకునేకన్నా, జరుగుతున్న నేటి గురించి మాట్లాడుకోవడం, ఆలోచించడం మేలు. ★

చింతపల్లి, లంబసింగి ప్రాంతాలని చలిగూడెం, పులిగూడెం అంటారు. పగలు చలి బాధే. చీకటి పడితే చలికి తోడు పులుల బాధ. మూగయ్యది ప్రస్తుతం దారుణమైన చలిబాధ. చలే పులై వెంటాడుతోంది. మీద పడి చీరుతోంది. ఎక్కువ మంది గుడిసెలలోనే ఉన్నారు.ఆ కథ వినాలని ఉన్నా శరీరం సహకరించడం లేదు. అలసట బాధిస్తోంది. పాదాలు ఒత్తుకుంటున్నారు. పిల్లలు ఏదో కాస్త తిని అప్పుడే నిద్రపోతున్నారు. “ఇందుకూరుపేట, కొత్తపేట ఊరోళ్లన్ని ఆ తెల్లోడు చావగొట్టేసాక పదిహేనేళ్లకి జరిగిందంట.” అని ఒక నిమిషం ఆగి అన్నాడు రామన్న, “ఈ కత నాకు చాలా ఇష్టం.” అలా అని చెప్పి ఇంకా ఆసక్తి పెంచాడు వాళ్లలో. “ఎందుకంటే లింగాలు! విలువైందేదీ పోగొట్టుకోకూడదు. ఒకేళ పులి కర్మ కాలిందనుకో! మళ్లీ తిరిగి తెచ్చుకోవాలి. అప్పుడు కదా మనం మొగోళ్లం! అదే చేశాడు రంప జమిందారు.”

ఆ గాథ చెప్పడం మొదలుపెట్టాడు రామన్న. అదీ వానాకాలమే. అప్పుడే వాన వెలిసింది. కొండదారులన్నీ ఎర్రటి కొండ మట్టినీళ్లతో నిండిపోయాయి. వర్షంతో రేగిన మట్టి గుబాళింపు, కొండలంతా.

వానలో తడిసినందువల్ల కాబోలు ఆ నల్లగుర్రం మరింత నల్లగా కనిపిస్తోంది. వేగంగా వస్తోంది ఆ కొండ గ్రామంలోకి. లంఖణాలు చేసి చిక్కినట్టుగా ఉన్న ఆ మనిషి అడవి మేతతో బలిసి ఉన్న ఆ గుర్రం మీద వీరావేశంతో ఊగిపోతున్నాడు. గెడ్డం మాసి ఉంది. ఏదో కోల్పోయినట్టు ఉన్నాడు. ఒంటి మీద పసుపు రంగు పంచె, ముదురునీలం రంగు కోటు. రెండూ పట్టువే.

కానీ పాతికేళ్ల క్రితం అటక మీద పడేసి, ఇప్పుడు బయటకు తీసినట్టు ఉన్నాయి. అవి కూడా వాన చినుకులతో కొద్దిగా తడిసి ఉన్నాయి. తలమీద ధరించిన పాగా కూడా పట్టుదే అయినా, చిమ్మెటలు కొట్టేశాయి. దుమ్ము కూడా పట్టేసి ఉంది. కాళ్లకి నలిగిన నల్లటి బూట్లు. మెడలో చిన్నహారం తప్ప అన్నీ వెలవెలబోతున్నాయి. అలంకారానికి ధరించే టెంగి గొడ్డలి మాత్రం వెండి లోహంలా మెరుస్తోంది.

ఒక చేతిలో కళ్లెం, రెండో చేతిలో ఆ టెంగి గొడ్డలి. చాలా గంభీరంగా గుర్రం మీద గ్రామంలోకి వచ్చాడతడు. ఆ రౌతు వెనుక రెండుమూడు వందల మంది ఉన్నారు. వారిలో ఎక్కువ మంది చేతిలో విల్లూ బాణాలే ఉన్నాయి. నలుగురైదుగురి చేతిలో మాత్రం పాత తుపాకులు కనిపిస్తున్నాయి. ఏ గ్రామంలో ప్రవేశించినా కొండవాళ్లంతా బయటకు వచ్చి పొర్లు దండాలు పెడుతున్నారు. దేవుడే వచ్చాడన్నంత సంబరపడుతున్నారు. ఏ గ్రామంలో అడుగుపెట్టినా అక్కడి మునసబు బయటకు వచ్చి, వంగి వంగి దండాలు పెడుతున్నాడు. ఎవరూ ఆపడం లేదు.

ఆయనే రంప జమిందారు. మన్సబ్‌దారని కూడా అంటారు. పేరు– రాజా రాంభూపతిదేవ్. నాలుగైదు రోజులుగా ఆయన అలాగే ఆ కొండలలో తిరుగుతున్నాడు. ప్రతి ఊరికి వెళు తున్నాడు. బారికని పిలిపించి ఆయన కూడా





# లంబసింగి రోడ్డు

## 7

**డా॥ గోపరాజు నారాయణరావు**

అక్కడే నిలబడి చాటింపుతో చెప్పిస్తున్నాడు– ఈ గ్రామాలు ఇక నావి, నేనే పాలకుడిని అని. అవన్నీ ఒకప్పుడు ఆయనగారి వంశీకుల ఏలుబడిలో ఉన్నవే. కానీ తెల్లోడి ప్రభుత్వం ఊరుకుంటదా! ఒక గ్రామం వచ్చారు జమిందారు గారు.


కొత్త కొత్త తుపాకులు గురెట్టి కుంఫిణీ సిపాయిలు చుట్టుమట్టి రాంభూపతిదేవ్‌ను బంధించారు. రెండు రోజుల కల్లా రాజమండ్రి తీసుకు పోయారు. ఇదంతా చూసి కోపగించినట్టు వరదతో పోటెత్తింది గోదావరి. పన్నెండు రోజులు బంధించి ఉంచారు.కుంఫిణీ ప్రభుత్వం జమిందారుని లొంగదీసి, ఒప్పందం చేసుకోమంది. కుంఫిణి ప్రతినిధిగా ఉండడానికి జమిందారు తలొగ్గాడు. ఆయన హక్కు ప్రకటించుకున్న గ్రామాలకి ఆయన్నే మొఖాసాదారుని చేసింది. ముప్పయ్ ఐదేళ్లు ఆయనే జమిందారు. వయసు కూడా అయిపోయింది. ఎండలు ముదిరిపోతున్నాయి. భూదేవి పండుగ జరుగుతోంది చాలా గ్రామాలలో.

తాడి, జీలుగు కల్లు పుష్కలంగా లభించే కాలం. పొలం పనులకి సెలవు. సోమ, మంగళవారాలంతా కల్లు తాగడం, చిందేయడమే. రాత్రంతా పాటలు పాడడం మరొకటి. నెలలో ఒక బుధవారం వేకువనే గొర్రె లేదా పందిని బలి ఇచ్చి భూమికి పూజ చేస్తారు. రంప దేశమంతా ఆ పండగ జరుగుతుండగానే కబురు తెలిసింది. రాజా రాంభూపతిదేవ్ చనిపోయాడు. వయసైపోయింది, ఆయన పోయాడు.

కానీ వారసుడు కావాలి కదా! అక్కడొచ్చింది గొడవ. వారసుడు ఎవరు? ఇది అంత తలబద్దలు కొట్టేసుకోవలసినదేమీ కాదని అంతా అనుకోవచ్చు.

కానీ అది కాదు. జమిందారు మొదటి సంతానం – ఓ బొట్టె. అంటే కూతురు. పేరు శ్రీజగ్గా అమ్మ. ఈడొచ్చినా, పెళ్లి చేసుకోలేదు. మనువు సంగతి అలా ఒగ్గిండి. ఆడది రాజ్యమేల్తానంటే ఏ మునసబు, ముఠాదారు ఒప్పుకుంటాడు? ఒప్పుకోలేదు. ఆమెకో పదమూడేళ్ల తమ్ముడు. ఆయనిక్కూడా రాంభూపతిదేవ్ అనే పేరు పెట్టారు...... అక్కడే ఠక్కున కథ ఆపాడు రామన్న, పెద్దగా ఆవలిస్తూ, “ఇంక పడుకుందాం...! ”అన్నాడు. “ఇదిగో రామన్న! ఆ కొడుక్కి పట్టాభిషేకం చేయడానికేమి?” అడిగాడు, లింగాలు, “రేపు చెప్పుకుందాం లే! నిద్ర.... నిద్ర...” బొంగురు గొంతుతో అన్నాడు రామన్న. “బాబ్బాబు. ఈ ఒక్క సంగతి చెప్పు! ఆ పిల్ల జమిందారుకి పట్టాభిషేకం జరిగిందా?” “జరగలేదు. నే పోతన్నా!” అంటూ లేచి నిలబడ్డాడు రామన్న. మిగిలిన అందరూ కూడా లేచి నిలబడ్డారు. మరి వారసుడు ఎవరు? రంప దేశం ఏమైంది? “ఇదిగో రామన్న! నాకు నిద్ర పట్టదు. పట్టాభిషేకం చెయ్యలేదన్నావ్ సరే, ఎందుకు? మూడు, మూడంటే మూడు మాటల్లో చెప్పు!” అన్నాడు అర్థింపుగా. రెండడుగులు వేసి అక్కడ ఆగి అన్నాడు రామన్న. “పిల్ల జమిందారు పెద్ద రాంభూపతి చాటుమాటు సంతానం మరి!”

✻ ✻ ✻



గొద్దు కళేబరంలా వేలాడుతోంది వాళ్ల భుజాల మీద ఉన్న బలమైన వెదురు బొంగుకి, ఆ బూడిద రంగు తోలు తిత్తి. నిండా ఉన్నాయి నీళ్లు. అందుకే పొట్ట ఉబ్బిన కళేబరంలా కూడా ఉంది. అంచె టపా మాదిరిగా మోస్తున్నారు నలుగురు వంతున. నాలుగు కిలోమీటర్ల అవతల, నర్సీపట్నం వైపు ఉన్న లంబసింగి

గ్రామ మునసబులూ, ముఠాదారులూ పోటీలు పడి రోడ్డు పనికి మన్యప్రజలని సమీకరించే బాధ్యత తీసుకున్నారు, మొదట్లో. ఇప్పుడు అందరికీ కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. ఈ రోడ్డు పని ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. దఫదఫాలుగా సాగుతూనే ఉంది. రేపటి నుంచి ఇక్కడ పని ఆపేస్తున్నామనీ, ఇవాళ ఇచ్చే కొంత బియ్యం, ఇచ్చిన కూలీ తీసుకుని వెళ్లి, మళ్లీ మొదలు పెట్టినప్పుడు రావాలని చెప్పారు అప్పుడు.



నుంచి వస్తున్నాయి నీళ్లు. అక్కడ గప్పీ దొర బంగ్లాకి కొంచెం అవతలే ఉన్న పెద్ద బావి నుంచి కొందరు నీరు తోడి ఈ తోలుతిత్తులు నింపుతూ ఉంటే, అర కిలోమీటరుకు ఒక బృందం వంతున మోసుకువస్తున్నారు, చిట్రాళ్ల గొప్పుకి. "ఒరేయ్! ముందు ఈ గోలెం నింపండ్రా!" వాళ్లని చూసి అరిచాడు కిష్టయ్య. నీళ్ల కోసమని బాస్టియన్ గుర్రాన్ని అప్పుడే ఆ గోలెం దగ్గరకి తెచ్చాడతడు. మూగయ్య కళ్లు ఆశతో మెరిసాయి. కానీ మనసంతా భయం. ముందు వైపు ఉన్న ఒక కూలీ ఆ తిత్తి మూతి విప్పి నెమ్మదిగా గోలెంలోకి నీరు ఒంపుతున్నాడు. అదే సమయం అనుకుంటూ మూగయ్య చేతులెత్తి దణ్ణం పెడుతూ పిలిచాడు, "కిట్టయ్యా!" చీదరగా చూశాడు కిష్టయ్య. గజగజలాడిపోతూ, చిన్నగా కాళ్లు వణుకుతుంటే ఒక్కొక్కమాటే చెప్పాడు మూగయ్య.


"దండవెడతాను. రాత్రి చలికి తట్టుకోలేకపోతన్నాను. నా గొంగడి నాకు ఇచ్చేయ్ బాబు! ఎలాగూ ఈసారిచ్చే కూలిలో తగ్గించుకుంటారు కదా! చిన్నోడివైనా నీ కాళ్లకి దణ్ణం!" అన్నాడు దీనంగా. భుజం మీద బరువుతో మాట కష్టంగా వచ్చింది. నీరసం వల్ల నూతిలో నుంచి వచ్చినట్టుంది. "పేరు మూగయ్యే గానీ, నీ నోరు పెద్దదని నాకు బాగా తెలుసొరేయ్! నిన్ననే కదరా గుర్తు చేశావ్! ఎన్నిసార్లు చెబుతావురా? మాకు ఏరే పనేంలేదా, నీ చింకి గొంగడి గోల తప్ప?"కిష్టయ్య అన్నాడు,

"చింకిది కాదు, కొత్తది కిష్టయ్యా! కొండసంతలో కొన్నాను. మూడు పావలాలు." అన్నాడు మూగయ్య. "నోర్మూస్కో" అరిచాడు కిష్టయ్య. అదిరిపడ్డాడు మూగయ్య. ఒక నిమిషం మౌనం. "కొత్తదంట కొత్తది! నీ గొంగడి ఊర్కే లాక్కున్నానా ఏంటి? అయినా ఒరే, దొరతనమోరి సొమ్ము అలా గుట్టు చప్పుడు కాకుండా ఎత్తుకెళిపోతే తప్పుకదరా! ఎవరు తీసుకోమన్నార్రా! దేనికైనా ఓ రూలుంటిది! అది మర్చిపోతే ఎలాగ! బేస్టీ దొర మంచోడు కాబట్టి ఇప్పుడిచ్చే కూలిలో తగ్గించుకోవడానికి ఒప్పుకున్నాడు. లేకపోతే ఈపాటికి నర్సీపట్నం సబ్ జైల్లో కూకునేవాడివి." అన్నాడు కిష్టయ్య. "అంత తప్పు నేనేం చేశాను కిష్టయ్యా!" అన్నాడు బాధగా మూగయ్య. "దొంగతనం." చాలా కర్కశంగా అన్నాడు కిష్టయ్య. ఆ నింద అతడిని బాగా కుంగదీసింది.

అయినా రాత్రి వేళ చలి అంతకంటే దారుణంగా బాధిస్తోంది. అందుకే బతిమాలడం మానలేదు. "తప్పు కాయి కిష్టయ్య ! నాకున్నది ఆ ఒక్క గొంగడే. పెద్దణ్ణి. ఇక్కడ చలి బాద నీకు తెలుసు కదా! మాపటేల గప్పీదొర బంగ్లా కాడికొస్తాను. ఇచ్చీయ్ బాబు!" జోడించిన చేతులు ఇంకొంచెం పైకెత్తి మళ్లీ అడిగాడు మూగయ్య. శబ్దం చేస్తూ నీళ్లు తాగుతోంది గుర్రం.

దాని మూతి కేసి చూస్తూ, "ఔరోయ్ !నువ్వు ముసిలోడివి! మర్చిపోయా! ఇస్తాలే. రాత్రికి కదా చలేస్తది! మాపటేలకి రారా!" అన్నాడు కిష్టయ్య, చాలా నిర్లక్ష్యంగా. మూగయ్య మాట కోసం చూడకుండానే గుర్రంతో ముందుకు నడిచాడు. నీటి బుంగలతో అక్కడ నిలబడి ఉన్నారు ఆరుగురు ఆడకూలీలు. నీళ్లన్నీ బుంగలలో నింపేసి ఖాళీ తిత్తితో మరోసారి తేవడానికి వెనుదిరిగింది మూగయ్య బృందం, ఆలస్యం చేయకుండా. వడివడిగా నడుస్తున్నాడన్న మాటే గానీ మూగయ్య ఆలోచనల నుంచి గొంగడి పోవడం లేదు... చిట్రాళ్లగొప్పు రోడ్డు పని మొదలైన రోజున, అంటే మొన్న– కిష్టయ్య ఎదురుపడగానే మొదట అడిగింది గొంగడి గురించే. సరిగ్గా ముప్పయ్ నాలుగు రోజుల క్రితం కూడా నర్సీపట్నం–చింతపల్లి రోడ్డు ఒక దశ కొంతపని జరిగింది. మూగయ్యే కాకుండా, ఇప్పుడు పనిచేస్తున్నవాళ్లలో చాలామంది అప్పుడూ వచ్చారు. ఆ సమయంలోనే మూగయ్య గొంగడి లాక్కున్నారు. మనిషికి రోజుకి ఆరు అణాల (అణా ఆరు పైసలు) కూలీ అని చెప్పారు. రోజులను బట్టి పద్నాలుగు కుంచాల వరకు బియ్యం ఇస్తామని చెప్పారు. ఎన్ని రోజులకి మాట్లాడుకుంటే అన్ని రోజులు పని జరిగే చోటే ఉండాలి. ఎనిమిది రోజులు, పదిహేను రోజులు, మూడు వారాలు.. ఇలా.

గ్రామ మునసబులూ, ముఠాదారులూ పోటీలు పడి రోడ్డు పనికి మన్యప్రజలని సమీకరించే బాధ్యత తీసుకున్నారు, మొదట్లో. ఇప్పుడు అందరికీ కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. ఈ రోడ్డు పని ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. దఫదఫాలుగా సాగుతూనే ఉంది. రేపటి నుంచి ఇక్కడ పని ఆపేస్తున్నామనీ, ఇవాళ ఇచ్చే కొంత బియ్యం, ఇచ్చిన కూలీ తీసుకుని వెళ్లి, మళ్లీ మొదలు పెట్టినప్పుడు రావాలని చెప్పారు అప్పుడు. గప్పీదొర బంగ్లా



దగ్గర అందరినీ వరసలో నిలబెట్టి, సంతానం పిళ్లై మస్తరు చూసి చెబుతుంటే, కిష్టయ్య కుంచం తీసుకుని లెక్క మేరకు కొండవాళ్లు తెచ్చుకున్న సంచులలో పోశాడు. మూడు కుంచాలే తీసుకోవలసిన మూగయ్య సంచిలో పొరపాటున నాలుగు కుంచాలు పోశాడు కిష్టయ్య. అది ఇద్దరూ గమనించలేదు. నిజానికి తప్పు కిష్టయ్యదే. చివరికి బియ్యం కాస్త తక్కువై గొడవ జరిగింది. అప్పుడే ఎవరో చెప్పారు, మూగయ్య సంచిలో ఒక కుంచం అదనంగా పడిన సంగతి. అతడి గురించి వెతికితే కనిపించలేదు. రోడ్డు పని కోసమని ఇల్లు వదిలి పదిరోజులైంది. చేతికి బియ్యం వచ్చింది. అవి తీసుకుని చడీచప్పుడూ కాకుండా పని వదిలేసి మూగయ్య తన ఊరు బయలుదేరి వెళ్లిపోయాడు. ఒక రోజంతా ఔరజ్ఞానం (భంగులా గాఢమైన మత్తు ఇచ్చే కల్లు) తాగి, దొరికితే కణుజుదుమ్ము కల్లు (కణుజు మాంసం ఒండినది) తాగేసి, కడుపు నిండా తిని, పడుకుని, రెండు రోజుల తరువాత వచ్చి పనిలో చేరవచ్చునని అతని ఆలోచన.

కానీ రెండో రోజుకే మూగయ్య ఇంటికి వచ్చాడు బారిక– బాస్టియన్ గప్పీదొర బంగ్లాకి రమ్మన్నాడని చెప్పాడు. పంచాయతీ మొదలయింది. 'కుంచెడు బియ్యం అదనంగా పట్టుకుపోవడం ఒక తప్పు' అన్నాడు పిళ్లై. 'చెప్పకుండా పని వదిలి వెళ్లడం రెండో తప్పు' అన్నాడు కిష్టయ్య. నాకేం తెలియదన్నాడు మూగయ్య. పైగా తప్పు నీదైతే నేనేం చేస్తాను అన్నాడు ఎదురు తిరిగి. ఇది మూడో తప్పు. ఇందులో దొరతనం మీద ధిక్కారం కూడా వినిపించింది బాస్టియన్‌కి. బంగ్లా స్తంభానికి కట్టేసి, బాస్టియన్ ఆదేశంతో కొరడా అందుకున్నాడు కిష్టయ్య. ఒక కర్ర తీసుకుని పిళ్లై దాడిచేశాడు. పది నిమిషాల పాటు ఆగకుండా కొట్టారు. అప్పుడే పిళ్లై కర్రకి తగులుకున్న గొంగడి ఊడొచ్చింది. ఇక దెబ్బలన్నీ నేరుగా శరీరానికి తగలడం మొదలైంది. బాధ పది రెట్లయింది. ఎలుగొడ్డు దాడి చేసినట్టు ఒళ్లంతా గాయాలు– అడ్డంగా, నిలువుగా, ఏటవాలుగా. అప్పటికే కొన్ని గాయాల్లో కారుతోంది నెత్తురు. కొన్ని కొన్ని గాయాలలో స్రవించడానికి భయపడుతున్నట్టు అలాగే నిలిచి ఉంది. కిష్టయ్య గావంచా కూడా లాగేశాడు. కొరడా దెబ్బలు, కర్రతో కొట్టిన దెబ్బలు స్పష్టంగా కనిపిస్తున్నాయి మూగయ్య కాళ్ల మీద. ఎదిరిస్తే మనిషి కాదు బాస్టియన్. గొంతు కొంచెం లేచినా పిచ్చికుక్కలా మారిపోతాడు. అవతలి మనిషి చచ్చిపోతాడేమోననిపిస్తుంది కొడుతుంటే. అక్కడితోనూ ఆగడు. ఆ మనిషి చచ్చిపోయినా ఫర్వాలేదు.

కానీ మరొకడు ఎవరూ నోరెత్త కూడదు. అందుకే అతడు ప్రత్యేకంగా కొన్ని శిక్షలను అమలు చేస్తుంటాడు.ఎక్కడి నుంచి తెచ్చి ఉంచాడో మరి, మిరపకాయలు నూరి ఆ ముద్ద పట్టుకొచ్చి బాస్టియన్ ఆదేశం మేరకు మూగయ్య ఒళ్లంతా రాసేశాడు కిష్టయ్య. అంతటితో ఆగకుండా మిరపగుజ్జు అంటుకున్న చేతులని ఒక పాత్రలో కడిగి ఆ నీళ్లు కళ్లని లక్ష్యంగా చేసుకుని మూగయ్య ముఖం మీద కొంచెం, దెబ్బల మీద, అతడి మర్మాయవాల మీద విసురుగా చిమ్మాడు కిష్టయ్య. ముళ్ల కంపతో ఒళ్లంతా కసిగా రుద్దేసినట్టయింది మూగయ్యకి. నగ్నంగా ఉన్న మూగయ్య దెబ్బల బాధతో, మిరపగుజ్జు మంటతో చిన్నపిల్లాడిలా ఏడుస్తూ, గావంచా అయినా ఇవ్వమనీ, లేదా చిన్న గోచి గుడ్డయినా ఇవ్వమని, కూలి చేసి గొంగడి తీసుకుంటానని కాళ్ల వేళ్లా పడ్డాడు. చివరికి పాత గావంచా ముఖాన కొట్టి, కొత్త గొంగడి మాత్రం గప్పీ దొర బంగ్లాలో పడేశాడు కిష్టయ్య. ఆ కంబళి కోసం అప్పటి నుంచి అతడు బెంగ పెట్టుకున్నాడేమో కూడా ! చలి బాధకి కంబళి కావాలి.

కానీ కిష్టయ్యని చూస్తే వెన్నులో చలి.

* * *

రోడ్డు పని కొంచెం మందకొడిగానే సాగుతోంది.బాస్టియన్ కూడా పరధ్యానంగా ఉన్నాడు. పైగా పని జరుగుతున్న చోటుకి కొంచెం దూరంగా లోయని చూస్తూ నిలబడి ఉన్నాడు. కాస్త ఊపిరి పీల్చుకుంటున్నట్టుగా ఉంది కూలీలకి. నర్సీపట్నంలో కడుతున్న సొంత బంగ్లా గురించే బాస్టియన్ ఆలోచిస్తున్నాడు. చాలామంది తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు అక్కడే ఇళ్లు కట్టుకుంటున్నారు. చెప్పకపోవడమేం! అందులో తనది కొంచెం పెద్ద కట్టడమే. దానితో సహాయ నిరాకరణ ఉద్యమకారులు మన్యాన్ని దోచేశాడని గోల మొదలు పెట్టారు. ఫిర్యాదులు వెళతాయేమోనని కొంచెం భయంగా ఉంది. ఎక్కువగా పిల్లల్ని పనిలో పెట్టి అణా అణా చేతిలో పెట్టి పంపేయడం గురించి నర్సీపట్నంలో గోలగానే ఉంది. "వణక్కం!" అంటూ వచ్చాడు పిళ్లై. "ఏమయ్యా! ఆ మర్రిపాలెం చెత్తనా కొడుకు పోలోజు లక్ష్ముడు దొరకలేదు కదా!" ఆరా తీస్తున్నట్టు అడిగాడు బాస్టియన్. "దొరకలేదు దొర!" అతి వినయంగా అన్నాడు పిళ్లై, పెదవి విరుస్తూ. "ఎక్కడికి పోతాడులే! ఆ లం..కొడుకుని నమ్మానయ్యా అనవసరంగా. ఇటకైపోయింది నర్సీపట్నంలో. ఇటక కాల్చడానికి కలప పంపరా ఎదవ నాకొడకా అని ఆడికి చెప్పాను. పంపలేదు. నెల పైనే అయింది. ఆణ్ణి ఏంచెయ్యాలంటావ్?" అన్నాడు కోపంతో బాస్టియన్. "తొళ్లు ఒలిచి పూడవాలా!" అంత ఆవేశంగాను అన్నాడు పిళ్లై. ఆ కలప ఉచితంగానే నర్సీపట్నం చేరవేయవలసిన బాధ్యత లక్ష్ముడికి ఉందని పిళ్లైకి తెలుసు. కానీ దొరవారికి ఆ మాత్రం చేయొద్దా అన్నదే అతడి తర్కం. "చింతపల్లి పనికి వాని కొడుకు, కూతురు, కోడలు వచ్చారు. వాడు మాత్రం పొలం పనికి పూడ్నాలని ఎగనామం పెట్టి పూడ్చాడు" అన్నాడు పిళ్లై." దొరక్కపోడు. కాళ్లూ, చేతులూ ఇరిచేస్తాను..... ఇంకో మునసబుని ఎవడినైనా చూడు. పచ్చి ఇటక తీయించాను. కాల్చాలి. వెంటనే కలప కావాలి మనకి..." అంటూ హఠాత్తుగా కూలీల కేసి చూశాడు బాస్టియన్. పని మందగించిన సంగతి తెలుస్తోంది. "ఏంట్రా పెళ్లి నడకలు నడుస్తున్నారు...! " గట్టిగా అరిచాడు బాస్టియన్, పూనకం వచ్చిన మనిషిలా కదులుతూ. ఆ కేక భయం పుట్టించింది. అదే, లేని ఓపిక తెచ్చి పెట్టింది. పనిలో మళ్లీ అదే వేగం.

(ఇంకా ఉంది)

కొరడా దెబ్బలు, కర్రతో కొట్టిన దెబ్బలు స్పష్టంగా కనిపిస్తున్నాయి మూగయ్య కాళ్ల మీద. ఎదిరిస్తే మనిషి కాడు బాస్టియన్. గొంతు కొంచెం లేచినా పిచ్చికుక్కలా మారిపోతాడు. అవతలి మనిషి చచ్చి పోతాడేమోననిపిస్తుంది కొడుతుంటే. అక్కడితోనూ ఆగడు. ఆ మనిషి చచ్చిపోయినా ఫర్వాలేదు. కానీ మరొకడు ఎవరూ నోరెత్త కూడదు. అందుకే అతడు ప్రత్యేకంగా కొన్ని శిక్షలను అమలు చేస్తుంటాడు.



ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

*'భీమవరం పట్టణాన్ని రెండవ బార్డోలీగా పిలిచేటట్లు చేసిన సర్దార్ దండు నారాయణరాజు అంకితభావం చిరస్మరణీయమే!'*

*'హరిజన్' (1928)*

పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక పట్టణం భీమవరం. గుజరాత్‌లో ఒక ప్రాంతం బార్డోలీ. భీమవరాన్ని రెండో బార్డోలీగా చరిత్ర పుటలలోకి ఎక్కించిన వ్యక్తిగా గాంధీజీ ఆయనను కీర్తించారు. నిజమే, రైతులకీ, వారి భూములకీ మధ్య సంబంధం అతి నిగూఢం. ఏనాడు వారి తాతముత్తాతలు ఆ భూములను సంపాదించిపెట్టారో! తరతరాల నుండి అనుభవిస్తున్న స్థిరాస్తులవి. పంటలు పండినా, పండకపోయినా, వాటినే కనిపెట్టుకొని ఉండి సంసారాలను ఏదో విధంగా పోషించుకుంటూ వస్తున్నారు. యజమాని పాదం పైని పడినప్పటికీ, భూమి ఆనందముతో పొంగి పోతుందని పెద్దలు చెబుతారు. ఇంతకీ గాంధీజీ ప్రస్తావించిన ఆ స్వాతంత్ర్య సమరయోధుడు దండు నారాయణరాజు.



# అహింసాయోధుడు దండు నారాయణరాజు

వ్యవసాయదారునిగా, న్యాయవాదిగా ఉద్యమంలో పాల్గొని, జైలులోనే తనువు చాలించిన ధన్యజీవి. ఇందులో కొన్ని లక్షణాలు బార్డోలీ సత్యాగ్రహం నిర్వహించిన సర్దార్ వల్లభ్ భాయి పటేల్‌ను చూస్తాం. బార్డోలీ సత్యాగ్రహం పటేల్ వంటి మహోన్నత నేతను స్వరాజ్య ఉద్యమానికీ, స్వతంత్ర భారతానికీ కూడా ప్రసాదించింది. పటేల్ రైతులను కూడగట్టారు. ఇక్కడ దండు నారాయణరాజు కూడా అంతే. పటేల్ బారిష్టరు. నారాయణరాజు న్యాయ వాది. ఇన్ని పోలికలు ఉన్నాయి కాబట్టే గాంధీజీ ఆ రకమైన పోలిక తెచ్చారు. అయితే నారాయణరాజు రైతు నాయకత్వ పాత్ర 1923లో మొదలు కాగా, పటేల్ నాయకత్వం 1925-1928 మధ్య సాగింది. కానీ నారాయణరాజు ఉప్పు సత్యాగ్రహంలో ఒక చేతిని కోల్పోయారు. క్విట్ ఇండియా ఉద్యమంలో జైలులోనే ప్రాణాలు విడిచారు.

దృఢ నిశ్చయం, కార్యదీక్ష, నిర్మాణ చాకచక్యం, స్వాతంత్ర్యం కోసం పరిపూర్ణ పిపాస- దండు నారాయణరాజు జీవితంలో కనిపించే విశిష్ట లక్షణాలు. 1923లో ఆయన ఏలూరులో 'పశ్చిమ గోదావరి జిల్లా రైతు సంఘం' నెలకొల్పారు. ఇది మద్రాసు ప్రెసిడెన్సీలో ఏర్పడిన తొలి సంఘం.

అమెరికా వెళ్లి, వ్యవసాయశాస్త్రంలో ఎమ్మెస్సీ చేసి వచ్చిన మాగంటి బాపినీడు, రైతు నాయకులు వేంచేటి సత్యనారాయణ, ఎం.సుబ్బారావు, మందేశ్వరశర్మల సహకారంతో 1931లో పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకులో 'రైతు విద్యాలయం' ఆయన స్థాపించారు. మాగంటి బాపినీడు, ఇతర నాయకులు రైతులకు తరగతులు నిర్వహించే వారు. నీటి సద్వినియోగం, వరి సాగులో మెలకువలు, వ్యవసాయోత్పత్తుల నిల్వ, గింజలు లేని పండ్లతోటల పెంపకం, సహజ ఎరువుల వాడకం, నీటి పన్ను, గిట్టుబాటు ధరల మీద అవగాహన వంటి అనేక విషయాలను బోధించేవారు.

బార్డోలీ ఉద్యమ ప్రభావం ఆనాడు దేశమంతా కనిపించింది. అక్కడ కరవు కాటకాలతో సతమత మవుతున్న రైతులు పన్ను తగ్గించాలని ఆందోళనకు దిగారు. ఒక్కసారిగా 22 శాతం పెరిగిన పన్ను వారిని ఆందోళన బాట పట్టించింది. ఈ పన్నును ఉపసంహరించుకోవాలని సర్దార్ పటేల్ నాటి బొంబాయి గవర్నర్‌కు లేఖ రాశారు. అతడు ఈ లేఖను బుట్టదాఖలు చేయడమే కాకుండా, పెంచిన పన్ను వసూలుకు తేదీ కూడా ప్రకటించాడు. 137 గ్రామాల ప్రజలు తిరుగుబాటు చేశారు. అయితే ఇది అహింసాయుత ఉద్యమమే. కానీ అధికారుల జులుం మాత్రం దారుణంగా ఉంది. రైతుల ఆస్తులు వేలం వేశారు. పశువులను తీసుకుపోయారు. ఇక్కడ కూడా రైతులపై విధించిన పన్ను గురించి పునరాలోచించాలని నారాయణరాజు ఏలూరు కోర్టులో జిల్లా రైతు సంఘ కార్యదర్శిగా కేసు వేశారు.

మందేశ్వరశర్మ ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకూ నిర్వహించిన రైతు యాత్రకు నారాయణరాజు సాయమందించారు.

దండు నారాయణరాజు భీమవరం తాలూకా, నేలపోగుల గ్రామంలో భగవాన్ రాజు, వెంకాయమ్మ దంపతులకు 15, 1889 ఆగస్టులో జన్మించారు. నరసాపురం తాలూకా పోడూరులో ప్రాథమిక విద్య, తణుకు ఉన్నత పాఠశాలలో మాధ్యమిక విద్య అభ్యసించారు. ఆయన చదువు లోనూ, క్రీడారంగం లోనూ ప్రతిభ చూపారు. 1907లో మెట్రిక్యులేషన్

పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల నుండి బి.ఎ. పట్టా పొందారు. 1910లో మహాదేవపట్నం కాపురస్థులు కలిదిండి వెంకటరామ రాజు కుమార్తె సుబ్బాయమ్మతో వివాహమయ్యింది. తణుకు ఉన్నత పాఠశాలలో కొంత కాలం ఉపాధ్యాయునిగా పనిచేశారు. తరువాత బి.ఎల్ పట్టా తీసుకున్నాక ఏలూరు జిల్లా కోర్టులో కొంత కాలం న్యాయవాదిగా పని చేశారు.

ఆ కాలంలో గాంధీజీ విధానాలకు ఆకర్షితులైన వారిలో దండు నారాయణరాజు ఒకరు. 1921 లో గాంధీజీ పిలుపు మేరకు న్యాయవాద వృత్తిని వదిలి సహాయ నిరాకరణోద్యమంలో చేరారు. తిలక్ సహాయ నిధికి అధిక మొత్తం వసూలు చేసి గాంధీజీకి బహూకరించారు. అల్లూరి శ్రీరామరాజు నడిపిన మన్య విప్లవం కాలంలో ప్రభుత్వం నారాయణ రాజును అరెస్టు చేసి, కాకినాడకు తరలించి 17 రోజులు జైలులో ఉంచి విచారించింది. నిర్దోషి అని తేలడంతో విడుదల చేశారు. 1927లో మద్రాసు శాసనసభకు పోటీ చేసి గెలిచారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో సర్దారు దండు నారాయణ రాజు, శ్రీమతి మాగంటి అన్నపూర్ణాదేవి ఇతర కార్యకర్తలతో కలసి ఖద్దరు వ్యాప్తికై విశేషంగా ప్రచారం చేశారు. 1923 నుండి 1926 వరకూ ఖద్దరు బోర్డుకు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఏలూరులో శ్రీమతి మాగంటి అన్నపూర్ణాదేవి సహాయంతో ఆగస్టు 18,1922న రూ. 2500/- పెట్టుబడితో 'మోహన్‌దాస్ ఖద్దరు పరిశ్రమాలయం' ప్రారంభించారు. తరువాత పశ్చిమ గోదావరి జిల్లా లోని తణుకు, భీమవరం, నరసాపురం, కొవ్వూరుల లోను ప్రారంభించారు.

మార్చి 12, 1930న గాంధీజీ దండియాత్ర ప్రారంభించారు. ఈ ఉద్యమాన్ని ఏప్రిల్ 6-13 తేదీల మధ్యన తమకనుకూలమైన రోజున చేసే స్వేచ్ఛను రాష్ట్రాలకిచ్చారు. ప్రతీ రాష్ట్రంలో ఉద్యమ నిర్వహణకు డిక్టేటర్‌లను నియమించారు. ఆంధ్రరాష్ట్ర డిక్టేటర్‌గా కొండా వెంకటప్పయ్యను నియమించారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా డిక్టేటర్‌గా సర్దార్ దండు నారాయణరాజును నియమించారు. రాజు మొదట పాలకొల్లు దగ్గరి మట్లపాలాన్ని సత్యాగ్రహ కేంద్రంగా నిర్ణయించారు.

నారాయణరాజు మార్చి 31న జాతీయ విద్యా లయం ఉప్పు సత్యాగ్రహయాత్ర ఆరంభించారు. ఏప్రిల్ 10న మట్లపాలెం చేరారు. 11వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటలకు వశిష్ట గోదావరి నుండి ఉప్పు నీటిని తెచ్చి మండిగలలో పోసి మరగబెట్టి ఉప్పు శాసనాన్ని ఉల్లంఘించారు. తరువాత మట్లపాలెం శాసనోల్లంఘన శిబిరాన్ని తూర్పుతాళ్లు అనే గ్రామానికి మార్చారు.

అక్కడ సర్దార్ దండు నారాయణరాజు ప్రదర్శించిన తెగువ, అదే సమయంలో గాంధీజీ ఆశయాన్ని వీడకుండా చూపిన నిగ్రహం చరిత్రాత్మకం. వండిన ఉప్పును చేతితో పట్టుకుని వదలలేదు. పోలీసులు ఆ పిడికిలి తెరిపించలేకపోయారు. ఆ చేతిని దగ్గర్లో గల పడవ అంచున పెట్టి పెద్ద కట్టెతో చితకకొట్టి, ఉప్పును పారబోయించారు. ఆ దెబ్బలకు ఆయన చేయి పూర్తిగా పనికి రాకుండా పోయి అంగవైకల్యం ఏర్పడింది. ఉప్పు సత్యాగ్రహం చేసినందుకు ఓ సంవత్సరం జైలుశిక్ష విధించి, వెల్లూరు జైలుకు పంపారు. కానీ గాంధీ - ఇర్విన్ ఒప్పందం వలన ఏడునెలల శిక్షాకాలం తరువాత విడుదల చేశారు. అయినా 'బార్డోలీ సత్యాగ్రహ విజయం, భారత స్వరాజ్య యుద్ధం, గాంధీ విజయం, పూర్ణ స్వాతంత్ర్యం' మొదలయిన కరపత్రాలు పంచుతున్నారన్న కారణంతో మరోసారి అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఆయన అకుంఠిత దీక్షకు ప్రజలు దండు నారాయణరాజుకు సర్దారు బిరుదును ఇచ్చి గౌరవించారు.

డిసెంబర్ 14, 1940న వ్యక్తిగత సత్యాగ్రహం చేసినందుకు అరెస్టు చేసి వెల్లూరు, తిరుచనాపల్లి జైళ్లకు పంపారు. ఆగస్ట్ 6, 1941న నరసాపురంలో సత్యాగ్రహం చేసినందుకు సంవత్సరం జైలుశిక్ష, 500 రూపాయలు జరిమానా విధించి 'ఆలీపూర్ క్యాంపు' జైలుకు పంపారు. తిరిగి విడుదల అయిన వెంటనే ప్రభుత్వ శాసనాలను ధిక్కరించాడనే కారణంగా మళ్లీ నిర్బంధించారు.

కానీ క్విట్ ఇండియా ఉద్యమ వేళ జరిగిన నిర్బంధం ఆయన జీవితాన్ని బలి తీసుకుంది. ఆగస్టు 12, 1942న క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు నారాయణరాజును అరెస్టు చేసి వెల్లూరు, తంజావూరు జైళ్లలో ఉంచారు. చివరకు ఆయన సెప్టెంబర్ 10, 1944, ఆరు గంటల సమయంలో తంజావూర్ జైల్లో తుది శ్వాస విడిచారు. గుండె జబ్బుతో మరణించినట్లు ప్రభుత్వం పేర్కొంది. 'ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయాం' అని గాంధీజీ అక్టోబర్ 9,1944న సంతాపం ప్రకటించారు.

నారాయణరాజు కారాగారంలో ఉండగా మాగంటి అన్నపూర్ణాదేవి అనేక అంశాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. వారు ప్రారంభించిన పరిశ్రమాలయం గురించి, ఆధ్యాత్మిక, ధార్మిక విషయాలను ఆ లేఖలలో ప్రస్తావించారు.

"తాను చేసిన యద్భుత సృష్టి యందలి మానవులు సోమరులై యుండకుండా గొన్ని కార్యములను చేయించుచుండును. మానవుల ద్వారా తన అద్భుత సంకల్పముల నెరవేర్చుకొనుచుండును. కాబట్టి మీరు లేనందువలన నిచ్చట జిల్లా సంఘమునకు, పరిశ్రమాలయమునకు నష్టము వాటిల్లుచున్నదని చింతిపవలదు" అని ఆమె తన మొదటి ఉత్తరంలో రాశారు. రెండవ ఉత్తరంలో ధార్మిక విషయాలు ఉన్నాయి.




**కాశింశెట్టి సత్యనారాయణ**

విశ్రాంత ఆచార్యుడు


"ప్రాపంచిక రాజకీయ సాంఘిక విషయము లటుంచుడు, మనకు జన్మ జన్మాంతము విముక్తికి గారణంబగు ధార్మిక విషయములను గురించియే ముచ్చటింతము, చర్చింతము, ఆలోచింతము, లిఖింతుము, భావింతుము. ఆ ఉద్దేశ్యములతో మన ప్రాణములర్పింతుము."

నారాయణరాజుతో కలిసి పని చేసిన శ్రీమతి మాగంటి అన్నపూర్ణాదేవి అమెరికాలో ఉన్న తన భర్త బాపినీడుకు అక్టోబర్ 4, 1922న రాసిన లేఖలో తన అనుభవాన్ని ఇలా రాసారు. సర్దార్ దండు నారాయణరాజుతో కలిసి వెళ్లిన "ప్రతీ స్థలము నందాయన చేసిన త్యాగమునకు, సేవను కొనియాడుచూ అభినందించుచున్నారు".

★

**సంప్రతించిన గ్రంథాలు**


1. Dictionary of Martyrs : Indian Freedom Struggle (1857-1947) Vol - 5, P - 44
2. అన్నపూర్ణాదేవి లేఖలు-ప్రకాశకుడు : బాపినీడు P- 177, 178, 190, 191, 198
3. డా. గాదం గోపాలస్వామి - శాసనోల్లంఘన ఉద్యమంలో చరిత్రకందని నారీమణులు జాగృతి వ్యాసం Dt. ఏప్రిల్ 11-17
4. "Harijan" dated 9, అక్టోబర్ 1944
5. Mandeswara Sharma as Peasant Leader by M Suseela Rao -- Vijayawada
6. Highlights of Freedom Movement by Sarojani Regani

చైనా ధృతరాష్ట్ర కౌగిలి ఏ విధంగా ఉంటుందో నేపాల్‌కు తెలిసొచ్చింది. స్నేహంగా ఉంటూ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్మిస్తామంటూనే, తమ భూభాగాలను క్రమంగా కబ్జా చేస్తూ, మరోపక్క అప్పుల ఊబిలో నెట్టేసే చైనా వైఖరి పట్ల నేపాల్‌కు జ్ఞానోదయమైంది. గత ప్రధాని కేపీ శర్మ ఓలి దేశాన్ని చైనా గుప్పిట్లోకి తీసుకెళ్లగా, ప్రస్తుత ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా వాస్తవాన్ని గుర్తించి, నిజమైన మిత్రుడు భారత్ మాత్రమేనని గుర్తించి చైనాకు దూరంగా జరగడం ఒక సానుకూల పరిణామం. గత ఏప్రిల్‌లో భారత్‌లో ఆయన పర్యటించడం దీని నేపథ్యమే.

# భారత్–నేపాల్ బం

మే 16, అంటే బుద్ధపౌర్ణమి రోజున ప్రధాని నరేంద్రమోదీ నేపాల్‌లో పర్యటించడమే కాదు, గౌతమబుద్ధుడి జన్మస్థలమైన లుంబినీని సందర్శించారు. భారత్‌లోని కుశినగర్ విమానాశ్రయం నుంచి ఆయన నేరుగా లుంబినీకి చేరుకున్నారు. గౌతమ బుద్ధుడు మహాపరినిర్వాణం చెందిన ప్రదేశమే కుశినగర్. 2021, అక్టోబర్ నెలలో కుశినగర్ విమానాశ్రయాన్ని ప్రారంభించిన సుమారు ఏడు నెలల తర్వాత మోదీ నేపాల్‌ను సందర్శించడం విశేషం. కుశినగర్ ప్రముఖ బౌద్ధ పుణ్యక్షేత్రం. ఇక్కడి విమానాశ్రయం నుంచి బుద్ధుడి ఆలయం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. బౌద్ధమత పుణ్య క్షేత్రాలను కలుపుతూ ఏర్పాటు చేసిన బౌద్ధ సర్క్యూట్‌లో ఈ రెండు పట్టణాలు భాగం. లుంబినీ నుంచి 19 కిలోమీటర్ల దూరంలో గౌతమబుద్ధ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చైనాకు చెందిన నార్త్‌వెస్ట్ సివిల్ ఏవియేషన్ ఎయిర్‌పోర్ట్ కన్‌స్ట్రక్షన్ గ్రూప్ నిర్మించింది. ఈ విమానాశ్రయంలో దిగి అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా లుంబినీకి చేరుకోవాలన్న నేపాల్ సూచనను మోదీ పట్టించుకో లేదు. ఈ విమానాశ్రయాన్ని బైపాస్ చేస్తూ ఆయన నేరుగా పర్‌లో లుంబినీకి చేరుకోవడం ద్వారా, నేపాల్‌లో చైనా అభివృద్ధి చేసిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో భారత్ భాగస్వామి కాబోదని చైనాకు స్పష్టం చేసినట్లయింది. లుంబినీలో మాయావతి దేవాలయాన్ని మోదీ సందర్శించి పూజలు జరిపారు. 2566 సంవత్సరాల క్రితం జన్మించిన గౌతమ బుద్ధుడి జన్మస్థలిని బుద్ధపౌర్ణమినాడు మోదీతో పాటు నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా కూడా సందర్శించారు.

గతంలో మోదీ నేపాల్ పర్యటన సందర్భంగా లుంబినీ సందర్శనాభిలాషను వ్యక్తం చేసినప్పుడు ఇది మతపరమైన లేదా సాంస్కృతిక పరమైనదిగా భావించినప్పటికీ, ప్రస్తుతం ఇది చాలా వ్యూహాత్మకమనేది స్పష్టమవుతోంది. ఇందులో ముందుగా చెప్పుకోవాల్సింది నేపాల్ రాయబారిగా శ్రీవాస్తవ నియామకం. ఈయన గల్వాన్ ఘర్షణ అనంతరం చైనాతో భారత్ తరపున చర్చల్లో పాల్గొన్నారు. భారత విదేశాంగశాఖలో ఈస్ట్ ఆసియా డెస్క్‌ను చూస్తున్న ఆయన్ని నేపాల్ రాయబారిగా నియమించడమంటే, అక్కడి చైనా ప్రమేయాన్ని గట్టిగా నిరోధించడానికేనని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. నిజానికి షేర్‌బహదూర్ దేవ్‌బా కొత్త ప్రధాని కాగానే, నేపాల్‌పై చైనా కమ్యూనిస్టు పార్టీ పట్టు కోల్పోయింది. వినయ్ క్వాత్రా నేపాల్‌లో రాయబారిగా ఉండగానే మావోయిస్టు కమ్యూనిస్టు మూవ్‌మెంట్ నిట్టనిలువుగా చీలిపోయి బలహీన పడింది. 2017లో సిపిఎన్–యుఎంఎల్ తరఫున ప్రధానిగా ఎన్నికైన కేపీ శర్మ ఓలి, పూర్తి భారత వ్యతిరేక విధానాన్ని అనుసరించారు. ఆయన కాలంలో భారత్‌తో నేపాల్ సంబంధాలు గతంలో ఎన్నడూలేని స్థాయికి దిగజారి పోయాయి. ఒకరకంగా చెప్పాలంటే నేపాల్‌ను తీసుకెళ్లి చైనా 'ఒళ్లో' కూర్చోబెట్టారు. ఇండియన్ వైరస్.. ఇటాలియన్ లేదా చైనా వైరస్ కంటే ప్రమాదకరమని వ్యాఖ్యానించడం, కాలాపానీ ప్రాంతాన్ని నేపాల్‌లో భాగంగా చూపడం వంటి వివాదాస్పద చర్యల వల్ల భారత్‌తో సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

ఇటీవల యూఎస్–చైనాల భౌగోళిక రాజకీయ స్పర్థల మధ్య నేపాల్ ఇరుక్కుపోయింది. ముఖ్యంగా 'మిలియనియం ఛాలెంజ్ కార్పొరేషన్'కు యూఎస్ అందిస్తానన్న 500 మిలియన్ డాలర్ల గ్రాంట్‌ను అంగీకరించవద్దని చైనా హెచ్చరించడంతో నేపాల్ ఇరుకునపడింది. ఎట్టకేలకు ఒక నెల తర్వాత నేపాల్ యూఎస్ గ్రాంట్‌ను ఆమోదించింది. వెంటనే చైనా తన విదేశాంగ మంత్రి వాంగ్‌యిని ఖాట్మండుకు పంపి, బెల్ట్ అండ్ రోడ్ కింద కొన్ని కొత్త ప్రాజెక్టులను ప్రతిపాదించగా, తమకు అటువంటి వాణిజ్య రుణాలపై ఆసక్తిలేదని నేపాల్ సున్నితంగా తిరస్కరించింది. ఇప్పటికే చైనా నుంచి రుణాలు తీసుకొని దివాలా తీసిన శ్రీలంక, నిండా మునుగుతున్న పాకిస్తాన్ మరోపక్క స్పష్టంగా కనబడుతున్నాయి. ఇదే సమయంలో బంగ్లాదేశ్ కూడా చైనా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నది. ముఖ్యంగా ఇటీవలి కాలంలో ఆ దేశ విదేశీ మారకద్రవ్య నిల్వలు గణనీయంగా పడిపోవడం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఈ పరిణామాలను గమనించి, చైనా రుణాలను ఆమోదించడం 'అంపశయ్యను' తానే సిద్ధం చేసుకున్నట్టు కాగలదన్న





# ధం మరింత పటిష్టం

జ్ఞానోదయం నేపాల్‌కు కలగడమే ఈ మార్పునకు కారణం.

**ఒప్పందాలతో సంబంధాలు గాట్లోకి..**

సరిగ్గా రెండు నెలల క్రితం అంటే ఏప్రిల్‌లో నేపాల్ ప్రధాని దేవ్‌బా భారత్‌లో పర్యటించారు. అయితే 2019లో ప్రధానిగా రెండోసారి ఎన్నికైన తర్వాత మోదీ నేపాల్‌లో పర్యటించడం ఇదే ప్రథమం. మొదటి దఫా ప్రభుత్వంలో ప్రధాని మోదీ నేపాల్‌లో నాలుగుసార్లు పర్యటించారు (2014లో రెండుసార్లు, 2018లో రెండుసార్లు). ఇప్పటి మాదిరిగానే గతంలో ఆయన జనక్‌పూర్, ముక్తినాథ్‌లలో మతపరమైన, సాంస్కృతిక పర్యటనలు జరిపారు. నేపాల్ ప్రధాని దౌవ్‌బా, భారత ప్రధాని మోదీ పరస్పరం రెండు దేశాల్లో పర్యటించడంతో సన్నిహిత సంబంధాల పునరుద్ధరణ యత్నం ఉన్నతస్థాయిలో ప్రారంభమైందని చెప్పవచ్చు.

ఇరుదేశాల ప్రధానుల మధ్య 45 నిమిషాల పాటు చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా 'వెస్ట్ సేటీ హైడ్రో పవర్ ప్రాజెక్టు' పనులను చేపట్టాల్సిం దిగా నేపాల్ ప్రధాని కోరారు. ఈ ప్రాజెక్టును మొదట ఆస్ట్రేలియా చేపట్టి తర్వాత వదిలేసింది. చైనాకు చెందిన గార్జెస్ కార్పొరేషన్ దీన్ని నిర్మించడానికి ఆసక్తి చూపినా, నేపాల్ దీన్ని మనదేశానికే అప్పగించడం ఆ దేశంలో వచ్చిన మార్పునకు చిహ్నం. గతంలో 900 మెగావాట్ల సామర్థ్యం గల అరుణ్-3 పవర్ ప్రాజెక్టును అక్కడ భారత్ విజయవంతంగా నిర్మించింది. దీన్ని సట్లెజ్ జల్ విద్యుత్ నిగమ్ (ఎస్‌జేవీఎన్) చేపట్టింది. ఇది కేంద్రం, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాల ఉమ్మడి వెంచర్. మద్రాసు ఐఐటీ, ఖాట్మండు యూనివర్సిటీలు ఉమ్మడిగా డిగ్రీ కార్యక్రమాన్ని నిర్వహించడంపై మరో ఒప్పందం



కుదిరింది. మూడవది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్, లుంబినీ బౌద్ధ యూనివర్సిటీ మధ్య ఉన్నత విద్యారంగంలో కుదిరిన ఒప్పందం. దీని ప్రకారం లుంబినీ బౌద్ధ యూనివర్సిటీలో 'డాక్టర్ అంబేద్కర్ ఛైర్ ఫర్ బుద్దిస్ట్ స్టడీస్' ఏర్పాటు చేస్తారు. ఆరుగంటల ఈ పర్యటన కార్యక్రమంలో భిన్న రంగాల్లో ఒప్పందాలు కుదరడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రకటించిన ఇండో-నేపాల్ ప్రణాళికలో లుంబినీకి సముచిత ప్రాధాన్యమివ్వడం, లుంబినీ గౌతమ బుద్ధుడి జన్మస్థలిగా మోదీ నొక్కి చెప్పడం, భారతీయ బౌద్ధారామానికి శంకుస్థాపన చేయడం వంటి చర్యలు నేపాల్-భారత్ సంబంధాలు మళ్లీ గాట్లో పడుతున్నాయనడానికి గొప్ప ఉదాహరణ. గత ఏప్రిల్‌లో నేపాల్ ప్రధాని మనదేశాన్ని సందర్శించి నప్పుడు ఇద్దరు ప్రధానులు భారత్‌లోని జయనగర్ నుంచి నేపాల్‌లోని కుర్తా వరకు ప్యాసింజర్ రైలు సర్వీసును ప్రారంభించారు. ఇది రెండు దేశాల మధ్య వర్తకం, ప్రజల రాకపోకలకు ఏవిధమైన అడ్డంకులు లేకుండా జరగడానికి దోహదం చేస్తుంది. నేపాల్‌లో రూపే కార్డును ఉపయోగించే సదుపాయాన్ని కూడా ఏప్రిల్‌లో ప్రారంభించడం గమనార్హం. కాగా నేపాల్.. మహేంద్రనగర్, నేపాల్‌గంజ్, జనక్‌పూర్‌లకు విమాన అనుసంధానత కోరుతోంది.

**భాజపా వ్యూహం!**

బౌద్ధం ద్వారా పాన్-ఆసియా, ఇతర ప్రపంచ దేశాలతో సంబంధాలను మరింత పటిష్టం చేసుకోవాలన్న వ్యూహాన్ని అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి భాజపా అనుసరిస్తోంది. అదీకాకుండా దేశంలో బౌద్ధమతావలంబికులైన దళిత సామాజిక వర్గంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు కూడా వ్యూహాత్మకంగా పార్టీ ముందుకు కదులు తోంది. దేశంలో దాదాపు 8.7 మిలియన్ల మంది బౌద్ధులుండగా వీరిలో 87% మంది ఇతర మతాల నుంచి చేరినవారే. ముఖ్యంగా హిందూ సమాజం లోని దళితులే అధికం. వీరినే నియో-బౌద్ధులు అంటారు. మిగిలిన 13% మంది ఈశాన్య, ఉత్తర హిమాలయ ప్రాంతాల్లో నివసిస్తుంటారు. వీరు సంప్రదాయిక బౌద్ధ మతస్థులు. 2016, అక్టోబర్‌లో వారణాసిలో '5వ అంతర్జాతీయ బౌద్ధ సమ్మేళనం' నిర్వహణ, 2017లో రాజ్‌గిరిలో '21వ శతాబ్దంలో బౌద్ధం' పేరుతో మరో అంతర్జాతీయ సదస్సు, నలంద విశ్వవిద్యాలయాన్ని తిరిగి ప్రారంభించడం వంటివి బౌద్ధం పట్ల ప్రభుత్వ నిబద్ధతను వెల్లడించడానికే. దళితుల ఆరాధ్యుడు, రాజ్యాంగ నిర్మాత డా॥బి.ఆర్. అంబేద్కర్ 1956లో బౌద్ధమతం స్వీకరించారు. అటువంటి ప్రముఖ రాజకీయవేత్త చేరడంతో



**జమలాపురపు విఠల్‌రావు**

సీనియర్ జర్నలిస్ట్

బౌద్ధానికి సహజంగా సామాజిక, రాజకీయపరంగా ప్రాధాన్యం పెరిగిందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం నియో-బౌద్ధుల్లో అక్షరాస్యత బాగా మెరుగవడం గమనార్హం.

ఇప్పుడు మోదీ లుంబినీ నగరాన్ని దర్శించడం, దళితులకు మరింత దగ్గర కావడానికి భాజపాకు ఒక అవకాశం కల్పిస్తున్నది. ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్‌లో బహుజన్ సమాజ్‌పార్టీకి (బీఎస్పీ)కి మూల స్తంభాలుగా నిలుస్తున్న ఓటర్లు వీరే. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ పనితీరు ఘోరంగా ఉండటమే కాదు, ప్రస్తుతం ప్రజల స్మృతిపథం నుంచి క్రమంగా తొలగిపోతున్న ఛాయలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీఎస్పీ ఓటు బ్యాంకును ఆకర్షించడానికి కాంగ్రెస్ కూడా రంగంలోకి దిగింది. ముఖ్యంగా 1980లో తాను అనుసరించిన దళిత- బ్రాహ్మణ- ముస్లింల ఓటుబ్యాంకు ఫార్ములాను పునరుద్ధరించే దిశగా పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలో భాజపా దళితులను ఆకట్టుకునే వ్యూహంలో భాగంగా బౌద్ధంపై దృష్టిపెట్టింది. షెడ్యూల్డు కులాల మొత్తం జనాభాలో మాయావతి ఉపకులమైన 'జాతవుల' వాటా 14%. మొన్నటి ఎన్నికల్లో జాతవుల్లో



12.9% ఓట్లు మాత్రమే బీఎస్పీకి పోలవడం చూస్తే, సొంత కులంవాళ్లే పార్టీని పక్కనబెట్టినట్టు స్పష్టమవుతోంది. 2017 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీఎస్పీ ఈసారి 10% ఓటుషేరు కోల్పోయింది. అప్పటి ఎన్నికల్లో 22.2% ఓట్లతో 19 సీట్లు గెలిచిన పార్టీ ఇప్పుడు కేవలం ఒకేఒక సీటుతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఓటు బ్యాంకును సుసంఘటితం చేసుకుంటే ఉత్తర ప్రదేశ్‌లో పార్టీని మరింత పటిష్టం చేసుకోవచ్చునన్నది భాజపా ఉద్దేశం. అదేవిధంగా 2024లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే మహారాష్ట్రలో బౌద్ధులను తనవైపు తిప్పుకునేందుకు కూడా భాజపా వ్యూహాత్మకంగా కదులుతోంది. ఇక్కడ బౌద్ధుల జనాభా 6,531,200. అంటే రాష్ట్ర జనాభాలో 5.81%. రాష్ట్రంలో ఈ మతం మూడో స్థానంలో ఉంది. 2011 జనగణన ప్రకారం మహారాష్ట్రలోని బౌద్ధుల సంఖ్య దేశంలోని మొత్తం బౌద్ధుల జనాభాలో 77.36%. రాష్ట్రంలో దళిత బౌద్ధ ఉద్యమంలో భాగమైన నవయాన బౌద్ధం ఇక్కడ ప్రాచుర్యంలో ఉంది. ఇక్కడి బౌద్ధులను ఆకట్టుకునేందుకు భారతీయ జనతా పార్టీ.. మోదీ లుంబినీ యాత్రను ఉపయోగించుకోవచ్చు. తనకు సంప్రదాయిక భాగస్వామిగా ఉన్న శివసేన, నయా సెక్యూలరిస్టు పార్టీలైన ఎన్సీపీ, కాంగ్రెస్‌లతో జట్టుకట్టిన నేపథ్యంలో, ఈ కూటమిని వచ్చే ఎన్నికల్లో ఎదుర్కొనే క్రమంలో తనదైన శైలి రాజకీయాలు నడపడంలో భాగంగానే బౌద్ధులను ఆకర్షించే పనిలో పడింది. ఎన్నికల్లో కేవలం ఒకటి, రెండు శాతం ఓట్ల తేడాతో పార్టీలు గల్లంతవుతున్న నేపథ్యంలో, భాజపా దళిత ఓటుబ్యాంకుపై దృష్టి కేంద్రీకరించి, తన స్థానాన్ని పటిష్టం చేసుకోవడానికి వచ్చే ఏ చిన్న అవకాశాన్ని వదిలిపెట్టబోదన్న సంగతి మాత్రం సుస్పష్టం.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**





# పనే పరదైవం

**పనే దైవం (వర్క్ ఈజ్ గాడ్) పనే పూజ (వర్క్ ఈజ్ వర్షిప్) అని ఆర్యోక్తి. జీవిక కోసం ప్రతి ఒక్కరూ తమకు వచ్చిన, నచ్చిన ఏదో ఒక పని చేయాల్సిందే. తరతరాలు తిన్నా తరగని ఆస్తిపాస్తులు వారసత్వంగా సంక్రమించినా ఏ పని చేయకుండా వాటిని అనుభవించాలనుకోవడం స్వార్థం, సోమరితనం కిందికే వస్తాయన్నది పెద్దల వాక్కు. 'పని చేయనివాడికి తినే హక్కులేదు' అనే మాట ఉండనే ఉంది. వయోభారం వల్లనో, అనారోగ్యంతోనో శరీరం సహకరించక పోతేనో తప్ప అన్నీ అనుకూలంగా ఉండీ 'పని గండం'గా భావించే వారిని సమాజం క్షమించదు. పని ధ్యాస ఉన్నవారికి పాడు ఆలోచనలు మనసులోకి రావంటారు. కష్టించే తత్వం, ఏకాగ్రత, లక్ష్య సాధన, మనిషిని మహోన్నతునిగా తీర్చిదిద్దుతాయి. అందుకు ఎందరో మహనీయులు ఉదాహరణగా నిలిచారు.**

ప్రతి వ్యక్తి తనకు కేటాయించిన పనిని (కర్తవ్యాన్ని) శ్రద్ధతో సకాలంలో నిర్వహించగలిగితే సత్ఫలితాలు సాధించవచ్చు. పని దైవ స్వరూపం అని పెద్దలు ఏనాడో శ్లాఘించారు. భక్తి ద్వారా భగవంతుడిని దర్శించాలనుకోవడం కంటే, పని ద్వారా దానిని సాధించాలనుకోవడం అర్థవంతంగా ఉంటుందని, అందులో పరమార్థం దాగి ఉంటుందని పెద్దలు చెబుతారు. ఏ కారణంతోనైనా కర్తవ్యాన్ని విస్మరించినా, జాప్యం చేసినా ఫలితాలు తారుమారు కావచ్చు. రేపటి పనిని ఇవ్వాళే, ఈరోజు పనిని ఇప్పుడే చేయాలని సూక్తి. దీనిని పాటించినవారు ఎన్నో అద్భుతాలు సాధించారు, సాధిస్తున్నారు. ఏ పనినైనా, జీవనయాత్ర రేపోమాపో ముగుస్తుందన్నట్లుగా మొదలుపెట్టాలని, పని చేసేటప్పుడు 'మరి కొన్నేళ్లు బతుకుతాను' అనేంత ఆనందంగా కొనసాగించాలంటారు.

ప్రతి ఒక్కరు జీవనం కోసం ఏదో ఒక పని చేసుకుంటూపోవాలి. ఏమీ చేయకుండా కూర్చోవడం అందరికి సాధ్యం కాదు. పని లేదా వృత్తి చేసుకుని ఆర్జించిన దానితోనే తృప్తి లభిస్తుంది. అదృష్టం వల్ల కొందరికి వారసత్వంగా సిరిసంపదలు దఖలు పడవచ్చేమో కానీ కష్టించే తత్వం మాత్రం అలా రాకపోవచ్చు. అలా కుటుంబ పెద్దల నుంచి ఆస్తిపాస్తులు సంక్రమించే కొందరికి ఇతరత్రా పని చేయవలసిన అవసరం ఉండకపోవచ్చు. అయితే పనితనం లోపిస్తే ఆ ఆస్తిపాస్తులు వ్యర్థమవుతాయనేందుకు అనేక ఉదాహరణలు కళ్ల ముందు కదలాడతాయి. 'మేము కష్టపడ్డాం కనుక మా సంతానానికి ఆ పరిస్థితి ఎదురు కాకూడదు. మేము ఆర్జించిన దానితో, ఏ పనీ చేయకపోయినా

భావితరాలు సుఖంగా బతికేయవచ్చు' అనే భావనను పెద్దలు తుడిచిపెట్టి 'కొండలైన కరిగిపోవు కూర్చుని తింటే...' అనేలా పని, ఆర్జన విలువలను తెలియ చెప్పాలి. 'తాతల తండ్రుల ఆర్జన తింటూ జలసాగా నువు తిరగకురా/కండలు కరుగగ కష్టం జేసి తలవంచక జీవించుమురా...' అని ఒక సినీకవి ప్రబోధించారు. కాలం ఎల్లవేళలా ఒకేలా ఉండదు. ఓడలు బండ్లు, బండ్లు ఓడలు కావచ్చు. సంపన్నుడు అతి సంపన్నడు లేదా సిరి రహితుడు కావచ్చు. అలాంటి పరిస్థితులలో 'పని సంస్కృతే శ్రీరామరక్ష'. పని సంస్కృతి అలవడితే పూవుకు తావి అబ్బినట్లే.

**పని వ్యక్తి ధర్మం**

సృష్టిలో ప్రతి మనిషీ కారణజన్ముడే. ఏదో విధంగా సమాజానికి ఉపకరించవలసినవాడే. పెద్దదో, చిన్నదో అర్హత, అదృష్టాన్ని బట్టి అందివచ్చిన పని నిర్వర్తించవలసినవాడే. అదే సమయంలో చేసే పనిపై గౌరవం ఉండాలి. తాము చేసే పనే గొప్పదని, లేదా తన పని కన్నా ఇతరులు చేసే పని ఉన్నతమైన దనే భావన కూడదు. అలా అనుకుంటే మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. వివిధ వృత్తుల వారు అలా అనుకుంటే జీవనచక్రం స్తంభించిపోతుంది. అప్పగించిన, ఎంచుకున్న పనిని ఎలా నిర్వర్తిస్తున్నాం? అనే దానిపైనే దాని విలువ, ఉన్నతి ఆధారపడి ఉంటాయి. సేతు నిర్మాణంలో వానరవీరులతో పాటు ఉడుత కూడా శక్తి మేరకు పాలుపంచుకుని చిరస్థాయిగా నిలిచి పోయింది. 'ఉడుత సహాయం' జాతీయంగా వినుతికెక్కింది. అలాగే పనుల నిర్వహణలోనూ ముందు వెనుకల ప్రాధాన్యక్రమం, అవసర, అనవసరాలనే భేదాలు ఉంటాయి. అవసరమైన పనిని చేయ(లే)క పోవడం, అనవసరమైన దానిని చేయడం రెండూ పొరపాటే అనేందుకు 'మిత్రలాభం'లోని కుక్క-గాడిద కథనే ఉదాహరణంగా చెబుతారు. 'చేయవలసిన పనిని ఆలస్యంగా చేయడం అమాయకత్వం కానీ చేయకూడని పనిని ముందుగా చేయడం మూర్ఖత్వం' అవుతుందని పెద్దలు వ్యాఖ్యానించారు. చేపట్టిన పని ఎంత కఠినతరమైనదైనా ప్రయత్నంలోపం ఉండ కూడదు. మధ్యలో వదిలేయకూడదు. ప్రతి యత్నం గెలుపు సోపానం కాబోదు. అలా అని విజయ తీరాలకు చేర్చకపోదు.

**మానసిక ప్రశాంతతకు దివ్యౌషధం..**

బతుకుతెరువు కోసం చేయడం, ఆ అవసరం అంతగా లేకపోయినా ఆసక్తితో చేయడం.. అని పనిని స్థూలంగా రెండు రకాలుగా చెబుతారు. రెండవది ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను ఇస్తుందని పలువురు స్వానుభవంతో చెబుతారు. పని పలు సంతోషాలకు పట్టుగొమ్మ అని పెద్దలు అంటారు. అనేక రుగ్మతలను, అనర్థాలను దూరం చేసే దివ్యౌషధం పని అని వైద్య నిపుణులు పేర్కొంటారు. 'పని చేస్తుంటే ఉక్కులా ఉంటావు. అదే లేకుంటే తుక్కులా మారతావు. పని అంటే ఆరోగ్యం, దానిని వద్దంటే శరణ్యం వైరాగ్యం' అనే నానుడి ఉండనే ఉంది. 'ఆడుతూ పాడుతూ పని చేస్తుంటే అలుపూ సొలుపు ఉండదు..' అనే గీతం దీనికి సమాంతరంగా పుట్టి ఉంటుంది. శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసంతో పాటు సమాజ, దేశాభివృద్ధి పని సంస్కృతిలో ఇమిడి ఉన్నాయి. దేశానికి ఆర్థిక పరిపుష్టినిచ్చే వస్తూత్పత్తి, సమాజాభ్యుదయం లాంటివి అందులో దాగి ఉన్నాయి.

'ఆశలావు పీక సన్నం' అన్నట్లు చేయాల్సినంత పని చేయకపోవడం, అంతకు మించి ఫలితం ఆశించడం.. రెండూ తప్పే. మొదటిది అసమర్థతను, రెండవది అత్యాశను సూచిస్తుంది. చేపట్టిన పని ఇష్టపడేలా ఉండాలే కానీ మొక్కుబడిగా ఉండకూడదు. ఆనందంగా చేసే పని నిర్విఘ్నంగా పూర్తవుతుంది. ప్రతి పనిని కేవలం ఆర్థికాంశంతో ముడిపెట్టకుండా, తాను చేయగలిగిన పనివల్ల ఇతరులకు ఏ కొంచెమైనా మేలు కలుగుతుందా? అని ఆలోచించ



వలసిన అవసరం ఉంది. పనిచేస్తూ పోతే ఫలితం దానంతట అదే పరిగెత్తుకు వస్తుందని గీతాచార్యుడే చెప్పాడు.

పనికి, ఏకాగ్రతకు అవినాభావ సంబంధం ఉందంటారు. అనుకున్న పనిని ఏకాగ్రతతో చేయాలి. అలాగే, పని పట్ల శ్రద్ధను సారిస్తే ఏకాగ్రత పెరుగు తుంది. పనికి శక్తియుక్తులే పరిమితులు. కానీ 'లోకో భిన్న రుచిః' అన్నట్లు పని విషయంలో ఒక్కొక్కరు ఒక్కొక్కలా వ్యవహరిస్తారని పరిశీలిస్తే తెలుస్తుంది. తమకు అప్పగించిన పనిని బాధ్యతాయుతంగా నెరవేర్చేవారు కొందరైతే, నిర్లక్ష్యం, నిర్లిప్తత ప్రదర్శించేవారు కొందరు. కేటాయించిన పని చేయడం సామాన్యుల లక్షణం కాగా, అప్పగించిన పనిని ఇష్టంగా మార్చుకోవడంతో పాటు ఇతర అనుబంధ పనులను చక్కపెట్టడం సమర్థుల లక్షణం. అందుకు హనుమను ప్రథమోదాహరణగా



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**

చెప్పుకోవచ్చు. లంకలో సీతామాత జాడ తెలుసుకున్న ఆయన తనను ఎదిరించిన అక్షయ కుమారుడు, ఇతర దానవసేనను చంపడం, శత్రువుల ఆయుధా లను, వారి యుద్ధ నైపుణ్యాన్ని పరిశీలించడం గమనార్హం. అలా రామకార్యాన్ని విజయవంతంగా నిర్వహించిన హనుమను ఆదర్శంగా తీసుకోవాల న్నారు రామకృష్ణ పరమహంస.

**పనిలోనే విశ్రాంతి**

పనిలోనే విశ్రాంతి అంటారు కొందరు. పనితనాన్ని ప్రాణప్రదంగా భావించుకునేవారు ప్రతి క్షణం తమను తాము మెరుగుపరచుకుంటూ, పనిని సమర్థంగా పూర్తి చేసేందుకు యత్నిస్తారు. జీవనం కోసం, జీవితంలో ఉన్నతి కోసం పనిని శ్వాసిస్తూ, పనిని ప్రేమించాలంటారు. అలాంటి వారు ఎందరో ఆ దిశగానే అద్భుతాలు సాధించారు. వాటి ఫలితాలు వారికి ఎంత వరకు ఉపకరించాయన్నది అటుంచితే లోకానికి ఎంతో మేలు చేస్తున్నాయి. అంకిత భావంతోనే ఆ వృత్తిలో నైపుణ్యాన్ని సంపాదించ గలుగుతారు. అందుకు అల్లుకుపోయే తత్వం ఉండాలంటారు. కొందరు అప్పగించిన పనినే చేస్తారు. మరికొందరు ఎదుటి వారి పనిలోనూ భాగం పంచుకుని వారిపై పని ఒత్తడిని తగ్గించే ప్రయత్ని స్తారు. మొదటిది కర్తవ్యం కాగా, రెండవ దానిని పారమార్థికంగా చెప్పవచ్చు. ఇంకొందరు అందులోని నైపుణ్యాలను, విశేషాలను తెలుసుకునేందుకు చొరవ చూపుతారు.

**ఉచితాలతో నిర్లిప్తత**

చేయడానికి పనిలేదనే మాట కొందరి నోట తరచూ వినిపిస్తుంది. పని చేయాలనే ఉద్దేశం గట్టిగా లేకపోతే ఏమో కానీ కష్టించే తత్వం ఉన్నవారికి అవకాశాలు మూసుకుపోతాయని చెప్పలేమంటారు నిపుణులు. రాజకీయ ప్రయోజనాల కోణంలో ప్రభుత్వాలు అందిస్తున్న ఉచిత పథకాలు కూడా కొందరిలో పని పట్ల నిర్లిప్తతను పెంచి పోషిస్తున్నా యని మేధావివర్గం, విశ్లేషక ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ఉచితాలు', పని పట్ల విముఖత లాంటివి సహజ వనరుల, దేశ సంపద క్షీణతకు కారణమవుతున్నాయి. ఫలితంగా దేశాలు, రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ కుదేలవుతోందన్నది నడుస్తున్న చరిత్ర.


**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**

# ఐతిహాస సాహిత్య వ్యాసుడు –

"దినయామిన్యే సాయం ప్రాతః శిశిర వసంతే పున రాయాతః" అని శంకర భగవత్పాదుల వారి వక్యాణం. మనుషులు, జంతువులు, పశుపక్ష్యాదులు, క్రిమికీటకాలు ఎన్నో ప్రపంచంలోకి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. జన్మను సార్థకం చేసుకొని ప్రజల హృదయాలలో పది కాలాల పాటు పదిలంగా నిలబడే ప్రత్యేకత ఉత్తమ పురుషులకే సాధ్యపడుతుంది. అటువంటి సత్ పురుషుల కోవకు చెందినవారు త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యం.

సహస్ర చంద్రదర్శనానికి చేరుగా వచ్చిన సుబ్రహ్మణ్యం వరంగల్ పట్టణంలోని పండిత వంశంలో జన్మించారు. రజాకార్ల కాలం నాటి కష్టనష్టాలను, స్వాతంత్ర్య పోరాట కష్టాలను అనుభవించారు. తదనంతరం ముదిమి వయస్సులో భారతీయ ఇతిహాసాలపై మక్కువతో సంప్రదాయ సాహిత్యా రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టారు. ఆ క్రమంలోనే ఇటీవల ఆయన 'భాగవత నామకోశము: బమ్మెర పోతన' అనే ఎంతో విలువైన పుస్తకం వెలువరించారు. ఈ గ్రంథం ఎంత విలువ కలిగి ఉంటుందో తెలుసుకోవాలంటే ఇంతకు ముందు ఆయన చేసిన కృషిని గురించి క్లుప్త పరిచయంతో సాధ్యమవుతుంది.

ప్రస్తుత సమాజంలో 18 పర్వాల కవిత్రయ మహాభారత గ్రంథాన్ని చదివే తీరిక, అవకాశం లేక కొన్ని భాగాలే చదివి చాలామంది తృప్తి పడుతున్నారు. ఇటువంటి తరుణంలో మహాభారతంలోని అన్ని పాత్రలను వాటి పూర్వాపరాలను అకార క్రమంలో మహాభారత నామ కోశ నిఘంటువులను లిఖించారు. 13 సంవత్సరాల సుదీర్ఘ శ్రమ చేసి ప్రథమ భాగం 690 పేజీలు, ద్వితీయ భాగం 577 పేజీలతో వెలువరించారు. ఈ రెండు గ్రంథాలు చదివితే మూల వ్యాస భారతం చదివినట్లే. ప్రతి నామ సంగ్రహ చరిత్రను విశదీకరిస్తూ అది ఎక్కడ ఏ పర్వంలో వస్తుందో సంఖ్యా సూచకంగా వివరించారు. ఈ గ్రంథాలు పరిశోధక విద్యార్థులకు, ఇతిహాసాలపై మక్కువ ఉన్న వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. ఈ రచనలను త్రోవగుంట వారు ఒక తపస్సుగా, జన్మ చరితార్థ మహస్సుగా భావించి చేశారు.




**భాగవత నామకోశము** (బమ్మెర పోతన)

**సంకలనం :** త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము


**ప్రతులకు :** ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ, హైదరాబాద్, ఇతర ప్రముఖ పుస్తక కేంద్రాలు.

**పే. :** 840; **వెల:** రూ. 999/–

భారతీయ ఇతిహాసాల్లో ఇద్దరు స్త్రీ మూర్తులను మహోన్నతంగా పేర్కొంటారు. వారు ఒకరు సీత, రెండవ వారు ద్రౌపది. సీతాదేవి సౌమ్యమూర్తి. ద్రౌపది వీరనారి. మహాభారతంలో ఎన్ని పాత్రలున్నప్పటికీ అన్నింటికీ కథా బీజం ద్రౌపది పాత్రే. అగ్ని సంభూత. ఈమె కన్యారాశికి ప్రతీక. ఎన్నో కష్ట నష్టాలను ఓర్చుకొని పతివ్రతా శిరోమణిగా వెలుగొందిన పుణ్యవతి. లోగడ కొందరు ఆధునిక, వామపక్ష లౌకికవాద రచయితలు, రచయిత్రులు తమ విశృంఖల స్వేచ్ఛా ముసుగులో నిరంకుశంగా ద్రౌపది పాత్రపై తమ నీచ నికృష్ట స్వభావ ఆలోచనలను బహిర్గతం చేస్తూ మానవీయ విలువలను మంటగలిపారు. వారు పెట్టిన క్షోభ నుంచి, ఆ పాత్రకు చేసిన అన్యాయం నుంచి సాంత్వన పొందడానికి త్రోవగుంట వ్యాఖ్యానం చదవాలి. ద్రౌపది పాత్ర ఔన్నత్యం చెడకుండా నిబద్ధతో ఆనాటి సమాజంలో ఉన్న నీతి నియమాల సారంగా ధర్మబద్ధంగా జీవనం నడిపే రాజమాతగా, చైతన్య సాహసమూర్తిగా ద్రౌపదిని తమ 'యాజ్ఞసేని' (నవల) గ్రంథంలో త్రోవగుంట వారు తీర్చిదిద్దారు. ఈ నవలా రాజం మొత్తం 370 పేజీలు. సుబ్రహ్మణ్యం గారికి మహాభారతం కథ కరతలామలకం. అందుకే ఈ యాజ్ఞసేని నవల చదివితే ద్రౌపది దేవిపై ఉన్న అపోహలన్నీ తొలగిపోతాయి.

మహాభారతంలో నలదమయంతుల ఉపాఖ్యానం ఉంది. దీన్ని సంస్కృతంలో శ్రీహర్షుడు, తెలుగులో శ్రీనాథుడు శృంగార నైషధం పేరిట కావ్యాలుగా రచించారు. బ్రహ్మశ్రీ వేంకట సుబ్రహ్మణ్యం నలదౌత్యాన్ని వచనంలో నవలా రూపంగా 183 పేజీల గ్రంథాన్ని 'నైషధం' పేరుతో రచించి వెలువరించారు.

ఇది పరిమాణంలో చిన్నదయినా పరిగణనలో గణనీయమైనది. ఈ నవల యాజ్ఞసేని లోగడ ధారావాహికగా 'ఆంధ్రభూమి' దినపత్రికలో ప్రచురితమైనది. ఈ నవలలోని పాత్రలు, కథాగమనం ఆసక్తిదాయకంగా నిర్మించి సామాన్య పాఠకులు సైతం ఐతిహాస నవలలకు దగ్గర అయ్యే త్రోవ చూపించారు త్రోవగుంట. పాశ్చాత్య పోకడలతో, వికృత ధోరణులతో మనం ఎంతో అపురూపంగా చూసుకునే వివాహ వ్యవస్థ బీటలు




**జన్నాభట్ల నరసింహప్రసాద్**
8297263741

# త్రోవగుంట

వారుతున్న తరుణంలో సుబ్రహ్మణ్యం 'నైషధం' రూపంలో భార్యాభర్తల అనుబంధాలను, హిందూ సనాతన సంప్రదాయాలను ఎంతో గొప్పగా చిత్రీకరిస్తూ తనదైన పాండిత్య శైలిలో నేటి సమాజానికి మార్గదర్శనం చేశారు.

ఇప్పుడు భాగవత పదకోశాన్ని 796 పేజీలలో ఎంతో శ్రమకు ఓర్చి రచించి విడుదల చేశారు. లోగడ భాగవతంపై ఇలాంటి ప్రయత్నాలు కొందరు రచయితలు చేశారు. కాని అవి క్వాచిత్కములు. అసంపూర్ణములు.

వీరు వయోవృద్ధులైన కూడా ఎంతో శ్రమించి భావితరాలకు భాగవత నామకోశాన్ని అందించారు.



త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము

ఇలాంటి రచనా విధానంలో విసుగు, అలసట కలగటం సహజం. కాని అలాంటి వాటిని దరికి రానీయకుండా అన్ని పాత్రలకు ప్రాణం పోశారు. మరీ ప్రత్యేకంగా వివిధ మహర్షుల రాజవంశాల క్రమణికను అనుబంధాలు అనే అధ్యాయంలో విపులంగా పొందుపరచారు.

ఇందులో ఒక ఒక పదంతో, ఒక వాక్యంతోనే పరిచయం చేసిన పాత్రల నుంచి, ఒకటిన్నర పుటతో చేసిన వివరణలు కూడా ఉన్నాయి. ఒక్క పాత్రలేకాదు, స్థలాలు, వస్తువులు, మంత్ర సంబంధ ముద్రలు, భాగవతంలో ప్రస్తావించిన ప్రకృతికి సంబంధించిన పదాలకు కూడా చక్కని వివరణ ఉంది. ఈ పుస్తకానికి ఆచార్య ముదిగొండ శివప్రసాద్, కుప్పా వేంకటకృష్ణమూర్తి, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డా. అక్కిరాజు సుందరరామకృష్ణ రాసిన ముందుమాటలు ఎంతో విలువైనవి.

ఇది నిజంగా నిష్కామకర్మ. ఈ రెండు నామకోశముల ద్వారా తెలుగువారికి, భరతజాతికి ఎంతో సేవ చేశారు. ఈ పుస్తకం చేతిలోకి వచ్చిన తరువాత, లేదా కొంత చదివిన తరువాత వచ్చే ధర్మసందేహం– ఈ వ్యాఖ్యాత రాధ పాత్ర గురించి ఏం చెప్పారు? రాధ లేని కృష్ణభగవానుని ఊహించ డానికి కూడా కొందరు ఇష్టపడరు. ఇన్ని పాత్రల గురించి చెప్పినప్పుడు రాధ పాత్రను పరిచయం చేయకుండా ఎలా? కానీ భాగవతంలో రాధాదేవి ఊసే లేదన్నారు. అంత అద్భుతమైన పాత్ర గురించి బ్రహ్మవైవర్తన పురాణంలోనే తప్ప, భాగవతంలో ప్రస్తావన లేదని తేల్చారు. అదొక కల్పిత పాత్ర అన్న వాదన మాటను కూడా ప్రస్తావించారు. అలాగే మనం ఎంతగానో ప్రచారం చేసుకున్న నరకాసుర వధ ఆంధ్ర మహా భాగవతంలోనే కనిపిస్తుందట. రావు సింగ భూపాలుడు అడిగినా పోతన భాగవతాన్ని అంకితం చేయకపోవడం, ఆ గ్రంథాన్ని పాతి పెట్టడం, దానితో శిథిలమైన కొన్ని భాగాలను ఆయన శిష్యులు పరిష్కరించడం వంటి అంశాలను గ్రంథకర్త త్రోవగుంట తన ముందుమాటలో చక్కగా విశదీకరించారు. పోతనామాత్యుల శైలీ విన్యాసాలు, కవికాలాదులు కూడా ఇందులో ఉన్నాయి. భాగవత పురాణంలో క్రీస్తుపూర్వం 340 నాటి చరిత్ర పరిచయం ఉన్న సంగతి విస్మయపరిచేదే. అదే చంద్రగుప్త మౌర్యుడు, చాణక్యుని విజయగాథ.


ఈ రెండు నిఘంటువులు పురాణ పాత్రల గురించి విషయాన్ని త్వరితంగా తెలియజేస్తా యనటంలో సందేహం లేదు. నేను రచయితను కనుక నా స్వీయ అనుభవంతో ఈ వాక్యం రాస్తున్నాను. కారణం నా కథా రచన వ్యాసంగానికి ఈ రెండు నామకోశాలు ఎంతగానో ఉపకరించాయి.

సామాన్యంగా ఇటువంటి నామకోశాలు నిర్మించే వారిలో సృజనాత్మక లక్షణాలు తక్కువ అని నానుడి. కాని వీరు అద్భుతమైన సాహిత్య శిల్ప అవగాహనతో బహుముఖమైన ప్రజ్ఞతో నవలలు కూడా రాస్తున్నారంటే చాలా అరుదైన విషయం. ఇలాంటి విలక్షణమైన రెండు విభిన్న సాహిత్య కోణాలు త్రోవగుంట వారి ప్రత్యేకత.

"యదిహాస్తి తదన్య త్రియన్నే హాస్తిన చత్క్వచిత్"

అని ప్రతిజ్ఞ చేసిన వేద వ్యాస మహర్షిని తెలుగు వారికి పరిచయం చేసిన కవిత్రయం వారి సాహిత్య అడుగులలో నడచి గొప్ప సాధన చేసి సాఫల్యాన్ని పొందిన త్రోవగుంట సుబ్రహ్మణ్యం ధన్యజీవి. శ్రీకృష్ణ పరమాత్మ వీరికి ఆయురారోగ్యాలు అనుగ్రహించాలని మనసా వాచ కర్మణా కోరుకుంటున్నాను.

పైన ఉదహరించిన ఐతిహాస గ్రంథముల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నం 040–24534210, 9491878082. ★





ఛందోబద్ధ పద్యాలలో వర్తమాన దృశ్యాలను ఎంత చక్కగా ఆవిష్కరించవచ్చునో నిరూపించిన వారు ఎందరో ఉన్నారు. 'చంపకాలోచనమ్' (ఖండకావ్యం)లో పాణ్యం దత్తశర్మ అదే చేశారు. ప్రౌఢమైన పద్యాలతో సమకాలీన సమస్యలను అద్భుతంగా ఆవిష్కరించారు కవి. ఆధునిక గృహిణ ఆరళ్లను చంపకమాలలతో రమణీయంగా గుదిగుచ్చారు దత్తశర్మ. 'ఒక గృహిణ మనోగతము' అని దీనికి ఉప శీర్షిక కూడా ఉంచారు. 'వదలక నెల్ల బత్రికల, వాట్సపునందును, ఫేసుబుక్కునన్/ సుదతుల మీద జోకులను సుంతయు నింగి తమన్నలేక, బల్/ ముదమున బేల్చి పొంగెదరు...'

## అష్టమ వ్యసనం... చెప్పుకోండి చూద్దాం!

అన్నారు. ఇల్లాళ్లకు సెలవులు ఉండవు. ఆదివారం ఇంటిల్లపాది తిని కూర్చుంటే, ఆమె మాత్రం మలినపు గుడ్డలు ఉతికే పనిలో ఉంటుంది. ఎంత సేవ చేసినా కాస్త కూడా మెచ్చే సద్గుణం ఈ మొగుళ్లకి ఉండడం లేదని వాపోవడం ఇందులో కనిపిస్తుంది. ఒక వ్యాసం సహా, శంకరుల శ్రీలక్ష్మీ నరసింహ కరావలంబ స్తోత్రానికి తెలుగు అనువాదంతో పాటు 16 రచనలు ఇందులో ఉన్నాయి. 'సామాజిక మాధ్యమ వధ్యశిల' పేరుతో రాసిన పద్యాలు ఈ కవికి ఉన్న ప్రత్యేక దృష్టిని తెలియచేసేవే. స్మార్టు ఫోన్‌ని 'అష్టమ వ్యసనం'గా అభివర్ణించడం అద్భుతమైన చమక్కు. ఇందులో ఒకొక్క పద్యం ఒక్కొక్క ఛందస్సులో రాశారు. 'బాలికా రక్షణమ్', 'పాత పేపర్లు కొంటాం' పద్యాలు చెప్పుకోదగినవి. దత్తశర్మ భాష, శైలి రమణీయంగా ఉన్నాయి. ఇవి చదువుతుంటే ఎలాంటి ప్రక్రియలో అని కాదు, చెప్పినది ఎంత రమ్యంగా చెప్పారో కదా అనే మనం అనుకుంటాం.

**చంపకాలోచనమ్ (ఖండకావ్యం)**
**కవి:**పాణ్యం దత్తశర్మ,
**ప్రతులకు:** అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో.
**పే:** 84, **వెల:** రూ. 99/– ★

కథ

# ఇంత తెలిసి

చీకటి చిట్లిపోయినట్లుంది!

చిట్లిన చీకటి చారికలలోంచి

వెలుతురు ప్రభంజనమై వీస్తుందని ఆశపడుతున్నాడు. కానీ యాదయ్యకు నిత్యం నిరాశ ఎదురవుతూనే ఉంది. అసలే అమావాస్య! వెలువెత్తుతున్న చీకటి తనను దుప్పటిలాగ కప్పేస్తుంటే భరిస్తూనే ఉన్నాడు. అది రాత్రివేళ ప్రకృతి ధర్మం! కానీ ఆ మిద్దె మీద బిక్కు బిక్కుమంటూ ఉన్న యాదయ్యకు కృతకంగా అనిపిస్తూ ఉంది. అలా పక్కకు తిరిగి చూసుకున్నాడు. తనతో బాటు ప్రక్క గదులలో తెలియని ఇద్దరు మనుషులు. కరోనా కారణంగా దిక్కుతోచక భయంతో ఇక్కడకు వచ్చి తలదాచుకుంటున్నారు.

మనుషుల మధ్య మాటలు లేవు. ఎవరికి వారుగా కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఏదో స్వచ్ఛంద సేవా సంస్థవారు పంపించిన 'కరోనా కిట్' యాదయ్యకు బాగానే అక్కరకు వస్తూ ఉంది. తనకు కరోనా పాజిటివ్ అచ్చిన నాటి నుండి మరో స్వచ్ఛంద సేవా ట్రస్ట్‌వారు ముద్దను తెచ్చి అలా దూరంగా పారేసి పోతున్నారు.

యాదయ్యకు ఆ ముద్దను ముట్టబుద్ధి కావడం లేదు. కానీ కడుపులోని ఆకలి కళ్లలోకి తన్నుకొచ్చేసరికి ఎంగిలి పడక తప్పడం లేదు. కొంత ఆకలితోనూ, మరికొంత భయంతోనూ శరీరం కొంకర్లు పోతూ ఉంది.

అసలే చలికాలం. అంతలోనే చీకటి కాలంలో మనసంతా చీకటి కమ్మేసి బుద్ధి వంకర్లు పోతూ ఉంది. భార్య రమణకుమారి, కొడుకు వసంత్ గుర్తుకొచ్చారు. తనలోని ఆత్మాభిమానం ఒక్కసారిగా పెల్లుబుకసాగింది.

తనకు ఈ వైరస్ సోకిందని అయిన వాళ్లే దూరంగా విసిరి పారేశారు. ఇక లోకం సంగతి సరేసరి! ఊరిలోని ఆస్పత్రులలో బెడ్స్ ఖాళీలు లేకపోవడం తనను భయాందోళనకు గురిచేస్తూ ఉంది. గతిలేక ఊరి చివరనున్న ఆరామ క్షేత్రంలోని 'అపరకర్మలు' చేయించే శాలలోకి చేరిపోయాడు.

అదృష్టం...ఇటువంటి విపత్కర పరిస్థితులలో కనీసం ఈ మాత్రం నీడ దొరికింది తనకు. లేకపోతే అక్కడినుండే ఎకాయికీ కాటికి చేరిపోయేవాడేమో! ఆ వాస్తవం యాదయ్యను నిలువునా కంపించి పోయేలా చేస్తోంది.

తానున్న పై మిద్దెలోని కిటికీ తలుపులు తెరవబోయాడు. కానీ తానున్న వాతావరణం స్ఫురణకు వచ్చి మానుకున్నాడు. గుండెను దిటవు చేసుకొని చిన్నగా తెరిచి చూశాడు. కాసింత దూరంలోని వల్లకాడులో కాలుతూన్న మృతదేహం తాలూకు వాస్తవం యాదయ్యలో అనేక ప్రశ్నలకు తెరదీస్తూ ఉంది.

'కొన్ని క్షణాలలోనో, మరికొన్ని రోజులలోనో తాను ఇక్కడి నుండి అక్కడికి!' యాదయ్య తనలో తాను తర్కించుకుంటున్నాడు.



# జీవితలు

**వడలి రాధాకృష్ణ**

వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది

పక్క గదులలోని కరోనా బాధితుల వివరాలు తెలియరావడం లేదు. ఎప్పుడో ఉదయం ఆహార పొట్లాలప్పుడు అలికిడి విన్న గుర్తు.

తర్వాత అంతా నిశ్శబ్దం అలుముకు పోయింది. చెప్పాలంటే యాదయ్య ఎక్కడ ఉండకూడదో అక్కడ ఉండక తప్పడం లేదు.

ఈ మహమ్మారి వైరస్ కారణంగా ఊరికి దూరంగా, గతిలేని స్థితిలో ఈ ఆరామ క్షేత్రం ప్రాంగణంలో అడుగుపెట్టి పదిరోజులు దాటిపోయింది. అప్పటి నుంచి ఎవరో దాతలు ఇస్తున్న నాలుగు ముద్దల్ని తింటూ బతుకీడుస్తున్నాడు.

ఎదురుగా రాత్రనక, పగలనక నిత్యం కాలుతూన్న వాస్తవాలు తనలో తీవ్రమైన ఉత్కంఠను రేపుతున్నాయి.

యాదయ్య ఎప్పుడూ కాశీకి పోయి రాలేదు. కానీ తన తండ్రి సుబ్బయ్య చెబుతూ ఉండేవాడు. కాశీలోని హరిశ్చంద్ర ఘాట్‌లో దహనకాండలు పగలనక, రాత్రనక ముప్పొద్దులా జరుగుతూ ఉంటాయట! కాస్త అటుఇటుగా రోజూ ఇక్కడ అటువంటి సన్నివేశాలనే చూస్తున్నాడు.

కరోనా బారిన పడినవారి శవాలు అనేకం ఇక్కడే బారులు తీరుతున్నాయి. ప్రాణాలకు తెగించిన వెట్టివాళ్లు తమ ధర్మాన్ని తాము నిర్వర్తిస్తున్నారు. అందుకు ప్రతిఫలంగా వచ్చిన వారి దగ్గరనుండి డబ్బుల్ని బాగానే గుంజుతున్నారు.

అలాగే అపరకర్మల్ని చేయించే జింకశాస్త్రి గారి సంగతి సరేసరి! ఆయన గారు ముప్పొద్దులా ఇక్కడే కొలువు దీరుతూ ఉన్నాడు. అకాల మృత్యువాత పడిన వారికి సద్గతులు కలగాలని తనదైన రీతిలో నమ్మబలుకుతున్నాడు. అందుకు తాంబూలాలను బాగానే డిమాండ్ చేస్తున్నాడు.

యాదయ్యలోని అస్థిమితం అనేక ప్రశ్నలకు తెరతీస్తూ ఉంది. చేతిలోని సెల్‌ఫోన్‌ను చూసుకున్నాడు. ఊరిలోనే ఉన్న భార్య, కొడుకుల దగ్గర నుండి గాని, ఇతర మిత్రుల నుండి గాని 'మిసిడ్‌కాల్స్' ఏమీ లేవు.

ఇంటికి ఫోన్ చేద్దామనుకున్నాడు. కానీ చేయబుద్ధి కావడం లేదు. ఈ ఆరామ క్షేత్రానికి ఆనుకొని ఉన్న వాటికలో కాలుతూన్న మృత దేహాల తాలూకు మానవీయ స్పర్శలోని అంతరార్థం యాదయ్యకు అర్థం కాకపోయినా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

* * *

క్రమంగా యాదయ్య ఆ భయానక వాతావరణానికి అలవాటు పడుతున్నాడు. చీకటి రాత్రుల్లోనూ, వెలుతురు పగలులోనూ నిర్భీతిగా కిటికీ తలుపులు తెరవగల్గుతున్నాడు. దేనికీ భయపడటం లేదు. కానీ ఉన్నట్లుండి కొంత భీతావహంగా అనిపిస్తూ ఉంది.

కారణం ప్రక్క గదిలోని మనిషి నిన్న రాత్రే మృత్యువాత పడ్డాడు. పరామర్శించడానికి కనీసంగానయినా ఎవరూ రాలేదు.

సంబంధిత వ్యవస్థ తాలూకు వారు వచ్చి ఇక్కడినుండి అక్కడికి తరలించేశారు.

యాదయ్యకు అయోమయంగా ఉంది. తనకు భయంగా అనిపిస్తూ ఉంది. నిన్న రాత్రే అతగాడు.... ఈరోజో రేపో లేక మరో పదిరోజుల తర్వాత తానో. తన ప్రస్థానమూ ఇక్కడినుండి అక్కడికి.

ఒక అణగారిన జీవన వాస్తవం యాదయ్య కంటి ముందర సజీవ దృశ్యమవుతూ ఉంది. మూసి ఉన్న కిటికీ తలుపు సందుల్లోంచి జొరబడుతున్న అనాలోచిత వెలుగు రేఖలు గదిలోకి చొరబడి తనను హెచ్చరిస్తున్నాయి.

యాదయ్య వాటికి ఎదురొడ్డక,గుండెను దిటవు చేసుకోక తప్పడం లేదు. ఇక్కడికొచ్చిన తనకు త్వరలోనే చావు ఖాయమని నిర్ధారించుకున్నాడు.

ఎంత నిబ్బరంగా ఉన్నా ఒక్కో సంఘటన తనను అతలాకుతలం చేస్తూ ఉంది. నిన్న మధ్యాహ్నం తన ప్రక్క గదిలోని కుర్రాడు కరోనాకు బలైపోయాడు. తర్వాత మామూలే!

యాదయ్యకి ఇక్కడినుండి మరోచోటికి తరలిపోవాలని ఉంది. లేదా ఎవరికీ తెలియకుండా మరో చోటికి పారిపోవాలని ఉంది. ఏ నదిలోనయినా దూకి ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తూ ఉంది.

కానీ లోకమంతా ఉపద్రవమై మహా కల్లోలాన మునిగి తేలుతున్న ప్రస్తుత పరిస్థితిలో అక్కరకురాని ఆలోచనలు ప్రతిబంధకాలుగా మారి కొట్టి పారేస్తున్నాయి.

ఆశ్చర్యంగా ఉంది. యాదయ్య తనను తాను నమ్మలేకపోతున్నాడు. తాను ఇంకా బ్రతికి ఉన్నాడంటే నమ్మశక్యంగా అనిపించడం లేదు. ఆ కరోనా ఉపద్రవాన్ని అధిగమించి అప్పడే ఐదు సంవత్సరాలై బతికి బట్టకట్టడం నిజమనిపించడం లేదు. ఈ భూమి మీద తనను కదిలించలేకపోయాయి.

ఇప్పుడు భార్య రమణకుమారి చాలా ప్రేమగా చూసుకుంటుంది. కొడుకు వసంత్ పిల్లా పాపలతో ఉద్యోగం చేసుకుంటూ బాగానే కాలక్షేపం చేస్తున్నాడు. ఉద్యోగ రీత్యా పర్మినెంట్ కావడంతో బదిలీ మీద తణుకు వెళ్లిపోయాడు యాదయ్య.

తను చేస్తున్న బంట్రోతు ఉద్యోగంలో రిటైరైపోయాడు యాదయ్య. నెలకు ఐదువేల రూపాయల ఫించను వస్తోంది. రిటైరైనప్పుడు వచ్చిన పదిలక్షల రూపాయల్ని బాగానే జాగ్రత్త చేసుకున్నాడు. ప్రస్తుతానికి ఏ ఉపద్రవాలకు లోనుకాకుండా బాగానే బ్రతుకుతున్నాడు.

'ఎరియర్స్ రెండు లక్షల రూపాయలు వచ్చాయి. వచ్చి తీసుకెళ్లమని' ఇంతకు ముందు



పనిచేసిన ఆఫీసునుండి కబురు రావడంతో చీరాల బయలుదేరాడు.

ఎందుకో అలనాటి కరోనా కష్టకాలం స్ఫురణకు వచ్చింది. వెన్నులో చిన్నగా వణుకు ప్రారంభమయింది. అప్రస్తుతమైనా ఆనాటి కల్లోల సమయంలో రెండు నెలలపాటు తనకు నిలువ నీడనిచ్చి నిలబెట్టిన ఆరామ క్షేత్రం వైపునకు వడివడిగా అడుగులు వేశాడు.

ఇప్పుడు అక్కడ ఏ అలజడీ లేకుండా కొంత ప్రశాంతత నెలకొని ఉంది. చెప్పాలంటే తాను మృత్యువును జయించినవాడు. ఆనక ఆత్మస్థైర్యంతో కాలాన్ని జయించినవాడు.

ఒక్కసారిగా యాదయ్య మనసారా నవ్వుకున్నాడు. తనను తాను పరామర్శించుకున్నాడు. అలా కొన్నాళ్లు బిక్కు బిక్కుమంటూ గడిపిన ఆరామ క్షేత్రంలోని మిద్దె మీదకు నడిచాడు.

అక్కడ ఉన్న గుమాస్తా తనను బాగానే గుర్తుపట్టాడు. తనవెంట తరలివచ్చాడు. యాదయ్య అక్కడి కిటికీ తలుపును తెరచిచూశాడు. ఒక మహాఉపద్రవం తర్వాత తెప్పరిల్లిన జీవన వాస్తవం అక్కడ అగుపిస్తూ ఉంది.



అక్కడ ఉన్న గుమాస్తా తనను బాగానే గుర్తుపట్టాడు. తనవెంట తరలివచ్చాడు. యాదయ్య అక్కడి కిటికీ తలుపును తెరచిచూశాడు. ఒక మహాఉపద్రవం తర్వాత తెప్పరిల్లిన జీవన వాస్తవం అక్కడ అగుపిస్తూ ఉంది.

అక్కడ నిరంతరంగా కాలిన చితిమంటలు ఏమీ కానరావడం లేదు. కొంత నిర్మానుష్యంగానూ, మరికొంత ప్రశాంతంగానూ ఉంది.

ఆ నిర్మానుష్యం వెనుక జీవనేతిహాసం యాదయ్యను తీవ్రంగా ప్రభావితం చేస్తూ ఉంది. దానితో అదే పనిగా చలించిపోతూ ఉన్నాడు.

కాలం కట్టెల పొయ్యిగా మారి కాల్చి పారేసిన ఒకనాటి 'జీవన ధృతి' స్ఫురణకు వస్తోంది.

'ఈ ఆరామ క్షేత్ర నిర్వహణ చాలా కష్టతరమవుతోంది! నిధులు కొరత చాలా విపరీతంగా ఉంది. పైగా అతి ముఖ్యమైన నీటి వసతులు కూడా అరకొరగా ఉన్నాయి. కాబట్టి దొరల సహాయ సహకారాలతో ఆ కనీసం అవసరాలను తీర్చడానికి ప్రయత్నం చేస్తున్నాము.

కాబట్టి మీకు తోచినది చందారూపంలో ఇస్తే ఈ క్షేత్రానికి ఎంతో సహాయం చేసిన వారు అవుతారు అన్నాడు వెంటవచ్చిన గుమాస్తా. 'ఇతర అవసరాలను తీర్చడానికి నా వంతుగా ఈ రెండు లక్షల రూపాయలు విరాళంగా అందిస్తున్నాను'అని అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయం యాదయ్యకు విపరీతంగా ఏమి అనిపించలేదు.

ఎంతో ఆత్మసంతృప్తిగా అనిపిస్తూ ఉంది. ఇందాక ఆఫీసులో ఇచ్చిన రెండు లక్షల రూపాయల ఎరియర్స్ సొమ్ముల్ని ఆ గుమాస్తాకి ఇచ్చి రశీదు తీసుకొని వడివడిగా బయటకు నడుస్తున్నాడు యాదయ్య. ★


## జాగృతి/స్వర్గీయ ఎం.డి.వై. రామమూర్తి స్మారక నవలల పోటీ

జాగృతి ఆధ్వర్యంలో ఎం.డి.వై. రామమూర్తి స్మారక 'నవలల పోటీ- 2022'కి రచనలను ఆహ్వానిస్తున్నాం.



ప్రథమ బహుమతి రూ. 25,000

ద్వితీయ బహుమతి రూ. 20,000

సూచనలు :

- ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు.
- నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు.
- సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. వ్రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు.
- నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా మొబైల్ నంబర్తో సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి.
- ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.
- నవలలు పంపవలసిన చిరునామా : **3-4-228/4/1**, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- **500027.**

రచయితల విన్నపం మేరకు గడువు పొడిగించామని చెప్పడానికి సంతోషిస్తున్నాం.

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 10 జూన్, 2022**

# జర్నలిస్టుల సేవలు మరువలేనివి




**నిజామాబాద్ :** నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సమాచార భారతి కల్చరల్ అసోసియేషన్, ఇందూరు శాఖ ఆధ్వర్యంలో మే 16న దేవర్షి నారద జయంతి, ప్రపంచ పాత్రికేయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సమాచార భారతి ప్రముఖ్ రాంపల్లి మల్లికార్జున్ మాట్లాడుతూ.. నారదుని వలె పత్రికా విలేకరులు కూడా లోక కల్యాణార్థం పనిచేస్తున్నారని కొనియాడారు. నారదుడు అంటే తగువులు పెట్టేవాడనేది అపోహ మాత్రమే. నారద మహర్షి లోకకల్యాణం కోసం ముల్లోకాలు తిరిగాడు. నేడు అలాంటి పాత్రను జర్నలిస్టులు పోషిస్తున్నారని మల్లికార్జున్ అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు, సమాచార భారతి జిల్లా కన్వీనర్ రాంనరేష్, జిల్లా సోషల్ మీడియా ప్రముఖ్ రాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.




**కరినగర్ :** సమాచార భారతి, కరినగర్ శాఖ ఆధ్వర్యంలో మే 5న నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో నారద మహర్షి జయంతిని విజయవంతంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కరినగర్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వి. సత్య నారాయణ, ముఖ్యవక్తగా సీనియర్ పాత్రికేయులు, సమాచార భారతి సభ్యులు వేదుల నరసింహం పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా సహ సంఘచాలక్ ఎలగందుల సత్యనారాయణ, విభాగ్ ప్రచార ప్రముఖ్ తడిగొప్పుల శంకరయ్య, జిల్లా ప్రచార ప్రముఖ్ గీకూరి శ్రీనివాస్, జర్నలిస్ట్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కమిటీ సమావేశం



**సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా కొక్కిరేణి గ్రామంలో మే 18న సేవాభారతి ఆసుపత్రి నిర్మాణం కోసం ఏర్పడిన కమిటీ సమావేశమైంది. సేవాభారతి ప్రాంత అధ్యక్షులు దుర్గారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతు శ్రీనివాస్, నల్గొండ విభాగ్ సంఘచాలక్ గార్లపాటి వెంకయ్య, సూర్యాపేట జిల్లా సంఘచాలక్ అంకటి అప్పయ్య తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ★

నివాళి

## సత్యనారాయణ లేని లోటు తీరనిది



తెనాలి జిల్లా సంఘచాలక్ గడ్డం సత్య నారాయణ మే 18న స్వర్గస్థులయ్యారు. ఆయన ఎంతో క్రమశిక్షణ గల స్వయంసేవక్. సంఘ పరివార్ సంస్థలలో అనేక బాధ్యతలను ఎంతో నిబద్ధతతో, క్రమశిక్షణతో నిర్వహించారు. బాపట్లలో ఆర్ఎస్ఎస్ కార్యాలయం నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించారు. స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ సెక్రటరీగా నాలుగు సార్లు ఎన్నికై ఉత్తమ సేవలందించారు.

వారి అకాల మరణం సంఘానికి తీరని లోటని ఆర్.ఎస్.ఎస్. జిల్లా ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. సామాజిక సమరసత బాపట్ల జిల్లా కన్వీనర్ మామిడి రాజశేఖర్ సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాపట్ల కార్యవాహ బి.బాలాజీ, సహ కార్యవాహ కె. ఉపేంద్ర, సేవా ప్రముఖ్ నక్కల మురళి, బౌద్ధిక్ ప్రముఖ్ గవిని కోటేశ్వరరావు, ప్రచార ప్రముఖ్ ఉమామహేశ్వర రావు, వ్యవస్థా ప్రముఖ్ బి.శేషు, ఎస్. వెంకటప్పయ్య, పి.నవీన్, భీమా కోటేశ్వరరావు, లేళ్ల సుధాకర్, సేవాభారతి డా॥ శ్రీనివాస్, రామకోటేశ్వరరావు, బీజేపీ జిల్లా ఇంచార్జి కమల, పట్టణ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్, బాబునాగేంద్ర, తిరుప తయ్య, కామరాజుగడ్డ శ్రీనివాస్ తదితరులు సత్య నారాయణ మృతికి నివాళులు అర్పించారు. ★



**'నిండు నూరేళ్లూ జీవించు' అంటాం. శత సంవత్సరాలూ ఆరోగ్యభాగ్యంతో ఉండాలని కోరుకుంటాం. చిరాయువుగా నిలవాలని ఆశించడం, ఆశీర్వదించడమూ సహజమే. వీటన్నింటినీ మించిన ఆశలూ ఆశీస్సుల చిరునామా – తిమ్మక్క. స్వచ్ఛమైన ఆమె మనసువంటి తెల్లని జుట్టు. నుదుటిమీద నిండుగా ఎర్రటి బొట్టు. చూడచక్కని దంత సౌభాగ్యం. చూపుల్లో అదే పదును. నవ్వులో వెల్లివిరిసే ఆత్మవిశ్వాస పటిమ. ఒక్కసారి తనను చూసినా, మాట్లాడినా, మాట్లాడుతున్నప్పుడు విన్నా – మన జన్మ ధన్యమైందని అనిపిస్తుంది. కాదా మరి? తనకిప్పుడు మూడు ఒకట్ల వయసు. అక్షరాలా, అంకెలారా 111 ఏళ్లు. నూట పదకొండు అని రాస్తుంటేనే కలం పులకితమవుతోంది. వయసును జయించిన కథానాయిక ఇదిగో…ఈ మధ్యనే భాగ్యనగరాన ఒక్కసారిగా తళుక్కుమంది.**

## వృక్షమాత- ప్రాణదాత

# శతాధిక నాయిక తిమ్మక్క

పొరుగు రాష్ట్రం కర్ణాటక నుంచి తెలుగు నేలకు చేరిన తల్లి తిమ్మక్క మనందరికీ ఏం చెప్పిందో తెలుసుకోవాలని ఉందా? శతాధిక వృద్ధురాలైనా, శారీరక మానసిక శక్తి సంపత్తిలో ఇప్పటికీ అగ్రగామి గానే ఉన్న తన గురించి ఎంత తెలుసుకున్నా ఇంకా తెలియాల్సింది మరెంతో ఉంటుంది. అతి పెద్ద వయస్కురాలైనా, ఆ అవ్వ మనసు మాత్రం చక్కటి మొక్క వంటిది! నాటిన విత్తనం కాలక్రమంలో మొక్కయి, చెట్టయి ఎందరెందరికో నీడ నిస్తుంటే ప్రకృతికి పులకింత. వృక్ష పరిరక్షణలో పర్యావరణ మంతా వెల్లివిరిస్తే అంతటికీ సార్థకత. ఈ అన్నీ నిండిన ధన్య జీవితం కాబట్టే ఆమె మానవ జీవన కావ్య నాయకురాలు. ఆ క్రమం ఏమిటంటే….

పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు. అందరూ చెప్పే మాటే ఇది. ఆకుపచ్చదనమే పురోగతికి సంకేతం. అంతటా వినిపించే నినాదమూ ఇదే. వనం–మనం అంటున్నాం. హరితహారం కోరుకుంటున్నాం. 'చేతు లారా తీసుకో మొక్క… సరైన చోట నాటు ఎంచక్కా' అని ఊరూవాడా మోత మోగిస్తున్నాం. అవునవును. చెట్లే మన మౌన నేస్తాలు. వనాలు పెరిగితేనే వానలు కురుస్తాయి. జలమైనా, జీవమైనా అదే. చెట్ల గాలి పీలిస్తేనే మన బతుకుల్లో వెలుగులు. ఆ చెట్లకింద చేరితేనే సేదతీరేది. వాటిని చక్కగా సంరక్షిస్తేనే మానవాళికి మనుగడ. జీవ వైవిధ్యంతోనే మనషుల ఉనికీ మనికీ. నేలపటుత్వాన్ని పెంచాలన్నా, లోపలి సారాన్ని పరిరక్షించుకోవాలన్నా అన్నింటికీ వృక్షాలే. మిగతావారికీ, తిమ్మక్కకీ తేడా–వారు ఆలోచిస్తారు, ఆమె చేస్తారు. ఇతరులు చెప్పేవాటిని తాను చేసి చూపిస్తారు. తన ఇంటిపేరు సాలుమరద. తనలో ఆశయాల వరద. రామనగర ప్రాంతంలోని హులికల్ ఆమె గ్రామం. ఊళ్ళోవాళ్ళంతా చెట్లమీద ఆమెకున్న మక్కువ చూసి దానినే ఇంటిపేరుగా మార్చేశారు. పుట్టిన, మెట్టిన ఊళ్ళలోనివారు చెట్టుకు పర్యాయ పదంగా తిమ్మక్కనే చెప్తుంటారు. మొక్కలు నాటాలన్న చిన్నప్పటి ఆసక్తికి పెళ్ళయ్యాక ఆ శక్తి తోడైంది. తొలి నుంచీ ఎందుకు అంత వృక్షాభిమానమంటే ఏమని బదులిస్తారో తెలుసా?'మొక్కలు, పిల్లలు ఒక్కట నిపిస్తుంది.ఎంతగా పెంచితే అంత బాగా పెరుగుతారు పిల్లలంతా. మొక్కలూ అంతే. వాటిని మనం కాపాడితే, అవీ మనల్ని కాపాడితీరతాయి. మరో మాట..మనలా వాటికీ మాటలుంటాయి. వినే ఓపికా, తీరికా మనకుండాలి కానీ ఆ ప్రతీ మాట తేనెల ఊట. అందుకే నేను మొక్కల్ని చేతితో కాదు, మనసుతో నాటుతాను. మనసు పెట్టి చెట్లను పెంచుతాను. ఇదేదో సేవ అనిపించదు నాకు. నా రోజువారీ బాధ్యతగా చూసుకుంటాను? ' ఇవిగో ఈ పలుకులే వృక్షాలపాలిట ప్రేమ చినుకుల య్యాయి. భర్త చిక్కయ్య తోడ్పాటు తిమ్మక్కకు అలవాటుగా పరిమళించింది. తిరిగిరాని తీరాలకు ఆయన తరలి వెళ్ళిపోయినా అలవాటునే కొన సాగిస్తూ వస్తోందామె.

**ఒక్క మొక్క నాటరాదూ?**

వయసుతోపాటు శక్తీ పెరగడం ఆ బామ్మ ప్రత్యేకత. పెద్దావిడ కనుక 'మీరు' అని పిలిస్తే నవ్వుతూ వారిస్తుంది. 'ఈ గౌరవం, అభిమానం చెట్ల మీద చూపండ్రా' అంటుంది. చూసిన ప్రతివారినీ ఆప్యాయంగా పలకరిస్తుంది. వాళ్ళు ఏం చెప్తున్నారో శ్రద్ధగా వింటుంది. అన్నీ విన్నాక చివర్లో 'నువ్వూ ఒక మొక్క నాటుతావా?' అని అడుగుతుంది. కాదని ఎవరంటారు?ఆ పని చేయకుండా ఎలా ఉంటారు? ఆ విధంగా చూస్తుండగానే చెట్లు పెరిగిపోయాయి. అడవుల పెంపకం కార్యక్రమాలకు దారితీశాయి. హులికల్ మొదలు కుదురు దాకా కిలోమీటర్ల మేర రోడ్ల పక్కన చెట్లే చెట్లు. అన్నింటికంటే ఎక్కువ మఱ్రి వృక్షాలు. శాఖలుగా, ఊడలుగా విస్తరించి ఎంతగానో ఆశ్రయం కల్పిస్తున్నాయి. మఱ్రిమాను అనగానే ఆంధ్రప్రదేశ్‌లోని కదిరి ప్రాంత 'తిమ్మమ్మ' గుర్తుకొస్తుంది. వందల సంవత్సరాలుగా సేవ. తెలంగాణలోని మహబూబ్‌నగర పరిసరాల్లోని 'పిల్లల మఱ్రి' మదిలో మెదులుతుంది. తిమ్మక్క స్వరాష్ట్రంలో ఉన్న కుంబల్‌గోడ్ ఊళ్ళో గల భారీ తరువూ తలుపుకొస్తుంది. మనందరికీ తెలిసిందే – మఱ్రితో ఔషధ ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. బెరడు సహా దాని ఆకులు, మొగ్గలు, పాలు, పళ్లు అన్నీ బహుళ ప్రయోజకాలే. అటువంటి చెట్లను పెంచి పోషిస్తూ, తన ప్రాంతంలో అవ్వ చేసిన నిరంతర కృషి బహుధా



విస్తరించింది. చుట్టూ ఉండేవి పరిసరాలైతే, వాటి మౌలిక అంశాల సమాహారమే పర్యావరణం. పరిసర పరిశుభ్రత, అందులో భాగంగా కాలుష్య నివార, మంచి గాలితోనే అదంతా సాధ్యమవుతుంది. ప్రాణ సమాన వాయువు వచ్చేది చెట్ల నుంచే, చెట్లతోనే. అంతటి ప్రాణ ప్రదానం చేసినందుకే తిమ్మక్కకు పురస్కారాల పరంపర.

**ప్రగతి భవనాన దీపమాలిక**

భారత ప్రభుత్వం ఆ క్రియాశీలిని జాతీయస్థాయి పౌర పురస్కారంతో ఘనంగా సత్కరించింది. 'పద్మశ్రీ' పురస్కారం మూడేళ్ల క్రితం వరించింది. వృక్షమిత్ర, కర్ణాటక కల్పవల్లి, పంపవతి పర్యావరణ పురస్కృతి ఆమెకే. వీటన్నిటికన్నా మిన్నగా ఆమె పేరున 'తిమ్మక్కాస్ రీసోర్సెస్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్' సంస్థ ఏర్పాటైంది. మన దేశంలో కాదు, అమెరికాలో. అక్కడి (లాస్ ఏంజెలిస్, కాలిఫోర్నియా, ఓక్లాండ్) పర్యావరణ సంస్థలు మూడింటికీ ఆమె పేరే. పల్లెటూరు మొదలు అగ్ర దేశం వరకు సేవల విస్తరణ. స్వస్థలంలో వర్షపు నీటి నిల్వకు ఒక పెద్ద ట్యాంకు నిర్మాణం జరిగితే ముందుండి పనులు జరిపించింది ఆమె. సుదూర దేశాల్లో జరిగిన, జరుగుతున్న భారీ నిర్మాణ నిర్వహణలకూ దీప్తి ఈ పర్యావరణవేత్తే. ఇంతటి ప్రశస్తిని గమనించిన స్వరాష్ట్రంలోని కేంద్రీయ విశ్వ విద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం ద్వారా తనను తాను సన్మానించుకున్నట్లు అయింది. పెద్ద చదువేమీ లేని చిన్నపాటి కార్మికురాలిగానే తప్ప మరి ఏ ఇతర జీవనాధారమూ కనిపించని ఆమె ఎంతో సమున్నత స్థాయికి చేరినందునే హంపి యూనివర్సిటీ ఏనాడో ప్రత్యేక అవార్డు బహూకరించింది. మహిళా సంక్షేమ శాఖ విశిష్టపురస్కారాన్ని ప్రదానం చేసింది. బెంగళూరు కేంద్రంగా గల ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ప్రశంసా పత్రం అందించింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఫౌండేషన్లు తదితర వ్యవస్థలు పెద్ద యెత్తున సన్మానించాయి. 'గ్రీన్ ఛాంపియన్' విజేతను చేశాయి. మరీ ప్రధానంగా బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) వందమంది ప్రభావాత్మక మహిళల్లో ఒకరిగా తిమ్మక్కను ప్రకటించింది. ఇది ఆరేళ్ళనాటిది. నేటికీ పర్యావరణ సంరక్షణే ప్రాణంగా ఉన్న ఆమెను తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరావు సాదరంగా ఆహ్వానించారు. అధికారిక ప్రగతి భవన్‌లో మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష





జంధ్యాల శరత్‌బాబు

సమావేశానికి తోడ్కొని వెళ్లారు. అక్కడున్న ప్రతీ ఒక్కరికీ ప్రత్యక్షంగా పరిచయంచేసి, గౌరవ సత్కారాలతో కృతజ్ఞత చాటారు.ఆమెను మించిన దేశభక్తురాలు ఇంకెవరుంటారని పలు విధాలుగా కీర్తించారు. 'తల్లి తిమ్మక్కది మంచి ఆరోగ్యం. మొదటి నుంచి గొప్ప కార్యక్రమం నిర్వహిస్తోంది. చెట్ల పెంపకం వటి మహోన్నత పనిలో దశాబ్దాలుగా మమేకం కావడమే తన విజయ రహస్యం' అన్నారాయన. ప్రతిస్పందన ఇంకెంత గొప్పగా ఉందో చెప్పమంటారా? 'మీరు ఎన్నెన్నో సంరక్షణలు చేస్తున్నారు. మీకు ఇంకా ఏవైనా మొక్కలు కావాలన్నా నేనిస్తా' అని. అదీ వృక్షమాత నిబద్ధత.

**మొక్కలూ పిల్లలూ...**

కవి హృదయం పలికినట్లు – పర్యావరణం ఓ వికసిత వదనం, పురివిప్పిన పరవశం, పదిలపరచు కోవాల్సింది మనిషే. చెట్లను పెంచితే క్షేమం, నరికితే క్షామం. మొక్కలనేవి దైవప్రేమకు ప్రతిరూపాలు. వాటిని కాదూకూడదంటే మిగిలేవన్నీ అనర్థాలే. ప్రతి నీటిబిందువూ, ఆత్మబంధువని తెలుసుకుంటేనే ప్రాణికోటికి మనుగడ. మొక్కలుంటేనే వర్షాలు, లేకుంటే సకల కష్టాలు. వీటిని నాదాలకో,నినాదాలకో పరిమితం చేస్తే ఒరిగేదేముంటుంది? రాతల్లోనివి చేతలుగా మారకుంటే ఉపయోగం ఇంకేమిటి? తిమ్మక్క జీవితం మనకు పాఠాలెన్నో నేర్పుతోంది. ఆయువును పెంచుకోవడం మన చేతుల్లోనే ఉంటుందని తెలియచెబుతోంది.కూడు, గూడు, గుడ్డ, పాడి, కాడి అన్నీ తానే అయిన వృక్షానికి రక్షకులమవుదాం. 'కావాలి మన జీవనం పర్యావరణ సహితం; ప్రకృతితో కలగలిసిన జీవితం సర్వప్రాణులకూ హితం'. ఈ సూత్రమే వర్తించేలా చేసినప్పుడు ఆశాశ్వాసా కలకాలం నిలబడతాయి. ప్రకృతి పరిరక్షణ అనేది 'దారితప్పిన పసివాడికి తల్లి ఒడిలాంటిది / వడగాలి ఉమిసే నోటికి పాలజడి వంటిది / ఆ తేజం విశ్వచరితకు అభినవ భూమిక / ఆ జ్ఞానం నవ్య మానవతకు అఖండ దీపిక'అన్నారు ఆచార్య సి.నారాయణరెడ్డి. అంతటి తేజాన్ని, జ్ఞానాన్ని ప్రసాదిస్తున్న తిమ్మక్క మీకూ నాకూ అందరికీ ఆదర్శప్రాయం. చెట్ల పెంపకంలో దైవాన్ని, బాల్యాన్ని చూడగలిగిన ఆ వృక్ష మాతది సార్థక చరిత. ధన్యత అంటే నీదేనమ్మా!

వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్



# తాంబూలం

**రెండు తాంబూలాల గౌరవం**

ప్రాచీన సంస్కృత సాహిత్యంలో తాంబూల గౌరవానికి సంబంధించి అనేక ఉదంతాలు మనకు కనిపిస్తాయి: శ్రీహర్షుడు రాజాశ్రయం పొందాలని ప్రయత్నించినప్పుడు మనసులో "తాంబూలద్వయ మాసనంచ లభతే యః కాన్యకుబ్జేశ్వరాత్" తనకు కన్యాకుబ్జ ప్రభువు నుండి తాంబూల ద్వయ గౌరవం దక్కాలని మనసులో అనుకుంటాడు.

తాంబూల ద్వయం అంటే ఏమిటి? పండు, తాంబూలం, శాలువా ఇలాంటి గౌరవాలను ఒక్కటిగా ఇవ్వరు. రెండు పండ్లు, రెండు తాంబూలాలు, రెండు శాలువాలూ ఇచ్చేవారు. బహుశా గౌరవం పొందే వ్యక్తికీ, అతని భార్యకూ కలిపి రెండు గౌరవాలూ ఇచ్చే వారనుకుంటాను. రెండు పండ్లు, రెండు శాలువాలు అనేదే ''దౌ శాలువా''–"దుశ్శాలువా" అయ్యిందని పండితులు చెప్తారు. దౌశాలువా లాగానే దౌతాంబూలం ఇచ్చే ఆచారం కూడా ఉండేదన్నమాట.

**200 యేళ్లనాటి హైదరాబాదీ తాంబూలం**

ఏనుగుల వీరాస్వామి (1780 – 1836) యాత్రాసాహిత్య కర్త. ఆయన 'కాశీయాత్ర చరిత్ర' 200 యేళ్లనాటి భారతీయ సమాజాన్ని రికార్డు చేసిందని భావించవచ్చు. ఆయన హైదరాబాదు సందర్శించారు. అక్కడి ప్రజల ఆచార వ్యవహారాలు రాస్తూ, "హైదరాబాదులో గొప్పవారందరున్నూ పండుటాకులు (తమలపాకులు) వేసుకొనుచున్నారు. బాలకొండలో పండుటాకులు దొరకును. కడప మొదలుగా గోదావరీ తీరమువరకు (నిజామాబాదుకు ఉత్తరములో) అమ్మే వక్కలు ముడి వక్కలు, ఈ దేశములో పేదలు నిండా తాంబూలము వేసుకోవడము లేదు, వక్కలు మాత్రము నములుతారు, శూద్రుల చేతి హుక్కాలు ఇతరులు తాగుచున్నారు. హైదరాబాదులో పండ్లు దొరకును. కాని "చెన్నపట్టణము కంటే మూడింతల వెల యివ్వవలసినది. కూరగాయలు ఆ ప్రకారమే ప్రియమైనా మహా రుచికరముగా నున్నవి, "కూరగాయల రుచికి హైదరాబాదు సమముగా యీ వరకు నేను చూచిన భూమిలో యేదిన్నీ కూడ చెప్పలేదు'' ఇలా రాశారాయన. మద్రాసు తమలపాకులు, కూరగాయలకన్నా ఆనాటి హైదరాబాద్ ఆకులు కూరగాయలు చాలా రుచికరంగా ఉండేవిట.

**1550 నాటికే పొగాకు తాంబూలం**

*"గుడిసెయు మంచము కుంపటి/విడియమును పొగాకు తన్ను విడవాల్లని మే/ల్పడతియు గలిగిన జలియెక్కడి దప్పా...."* అని కవి చౌడప్ప, చలికాలంలో వేడిని కలిగించే సాధనంగా తాంబూలాన్ని, పొగాకుని పేర్కొన్నాడు, మట్లి అనంత భూపాలుడు, తంజావూరు రఘునాథనాయకుడు ఇతన్ని సన్మానించటాన్ని బట్టి 1550–1640 మధ్య కాలం నాటి వాడని తెలుస్తుంది. అంటే 1550 నాటికే పొగాకు జన సామాన్యానికి అందుబాటులోకి రావటం, మన వాళ్లు అనాటికే చుట్టపీకలు తాగటం మొదలై పోయాయనటానికి ఈ పద్యం సాక్ష్యం.



**పరగడుపు తాంబూలం**

''ప్రాతర్భుక్త్వా దంతకాష్ఠం తాంబూలం సర్వదా భజేత్'' ఉదయంపూట ఏదైనా తిన్నతరువాత నోరు కడుక్కొని తాంబూలం సేవించాలని ఆప్తవాక్యం. ఈ వాక్యంలో చెప్పదగిన సూచనలు కొన్ని ఉన్నాయి. నిద్రలేస్తూనే ఖాళీ కడుపున తాంబూలం సేవించ కూడదు. ఏదైనా తిన్న తరువాత వేసుకోవాలి. తాంబూలం వేసుకోవటం అంటే భోజనం అయ్యిందని అర్థం. తాంబూలం తిన్నాక అన్నం తినటం సబబు కాదు.

**పప్పు తాంబూలం**

నలమహారాజు పాకదర్పణం అనే గ్రంథం రాశాడు. ఇది తొలి ఆహార శాస్త్ర గ్రంథం. ఆయుర్వేద సంహితలకు వ్యాఖ్యానాలు రాసిన చక్రపాణిదత్త లాంటివారు ఈ గ్రంథంలోంచి అనేక అంశాలను ఉదహరించటం వలన ఇది ప్రామాణిక గ్రంథంగా పేరుతెచ్చుకుంది. ఇందులో కందిపప్పు, పెసరపప్పు ఉలవల్లాంటి పప్పుధాన్యాలతో పప్పు వండుకోవటం గురించి అనేక విశేషాలున్నాయి. వండిన ముద్దపప్పులో చల్లారాక చిటికెడంత పచ్చకర్పూరం కలపాలి. తొడిమనీ, కొననీ తీసేసిన లేత తమలపాకు పైన ఈ పప్పు మందంగా పరిచి, ఆకుని మడిచి విస్తట్లో వడ్డిస్తారు. ఈ పప్పు తాంబూలాన్ని కొద్దికొద్దిగా కొరుకుతూ నెయ్యి కలిపిన వేడన్నంతో తింటారు. ఇది రాజభోజనం (Royal Food) అన్నాడు నలుడు. ఇలా తింటే పప్పు వలన గ్యాస్, ఉబ్బరం, భుక్తాయాసం కలగకుండా ఉంటాయి.

**ముఖారవింద తాంబూలం**

భీష్మపురాణంలో శ్రీనాథుడు శ్రీకృష్ణస్తుతి చేస్తూ, "బాలిక మోమును తవనబర్హి కిశోరకలాస్య లీల బైవాలిచి పచ్చ కప్పురపు వాసన తోడి ముఖారవింద తాంబూలపు మోవిమోవి పయి మోపుచు రాధకు నిచ్చు ధూర్తగోపాలుడు బ్రోచుగావుత" అంటూ పచ్చకర్పూరం సువాసనతో కూడిన తన ముఖారవిందపు తాంబూలపు మోవిని రాధ మోవికి ఆన్చి అందించిన శ్రీకృష్ణుడు బ్రోచుగాక! అని వర్ణిస్తాడు. ముఖారవింద తాంబూలం అనేది నోటి నుండి నోటితో అందుకోవలసింది. రెండు మోముల్ని, రెండు తనువుల్ని, రెండు హృదయాల్ని రెండు కుటుంబాల్ని, రెండు దేశాల్ని, రెండు శక్తుల్ని, రెండు సంస్థల్ని, రెండు వ్యవస్థల్ని ఏకం చేసేది ముఖారవింద తాంబూలం.

**ఆహ్వాన తాంబూలం**

పెళ్లి కార్డుల మీద సకుటుంబ సమేతంగా విచ్చేసి మదర్పిత చందన తాంబూలాది సత్కారములు గైకొనమని గొప్పగా రాస్తుంటాం. కానీ, పెళ్లికి




కళారత్న డా॥ జి.వి. పూర్ణచందు
9440172642


తరలివచ్చిన అసంఖ్యాకులైన అతిథులకు అలాంటి తాంబూల సత్కారాలు క్రమేణా అదృశ్యమౌతున్నాయి. వచ్చామా-తిన్నామా-వెళ్లామా అన్నట్టు ఎక్కువ పెళ్లిళ్లకు అతిథులువచ్చి వెళుతున్నారు. విందు భోజనం తరువాత కట్టిన కిళ్లీలు ఇస్తున్నారుగా అదే తాంబూల సత్కారం ఇప్పటి కాలంలో! ఒకప్పుడు పెళ్లికి పిలవటానికి తాంబూలం ఇచ్చేవారు. పెళ్లికి వచ్చాక తాంబూల సత్కారం చేసేవారు. తిరిగి వెళ్లేప్పుడు వీడ్కోలు తాంబూలం ఇచ్చేవారు. పెళ్లంటే తాంబూలంతో మొదలై తాంబూలంతో ముగిసే వేడుక. రాయలసీమ ప్రాంతంలోని కొన్ని పల్లెల్లో హరికథలు, బుర్రకథలు, వీధినాటకాలు ఒక ఊరిలో జరుగుతూ వుంటే తమ ఊరిలో కార్యక్రమం జరపండని అందరి సమక్షంలో తాంబూలం ఇచ్చి ఆ కళాకారుల్ని ఆహ్వానించే ఆచారం ఇంకా కొనసాగుతోందట.

**వీడ్కోలు తాంబూలం**

వ్రతాన్నో హోమాన్నో పూజనో ప్రారంభించ బోయే ముందు వినాయకుడికి, ఇతర దేవతలకు తాంబూలం ఇస్తారు. తాంబూలంతో పాటు అందులో దక్షిణ కూడా ఉంటుంది. వ్రతాలు చేప్పటప్పుడు కాసిన్ని చిల్లర నాణాలు దగ్గరుంచుకోమంటా రందుకే! వ్రతం అయ్యాక వీడ్కోలు చేసేప్పుడు సంభావన లేకపోయినా కనీసం తాంబూలమైనా ఇచ్చి పంపాలి. లేకపోతే మర్యాద లోపంగా భావిస్తారు.

*"తాంబూలన్య గుణాః నంతి నఖే శతసహస్రశహః ఏకశ్చాపి మహాన్ దోషః యప్పదా వాగ్రి సజవకమ్"* తాంబూలంలో వందలాది గుణాలుండవచ్చు. కానీ, తాంబూలం చేతిలో పెట్టారంటే ఇంకచాలు వెళ్లు అనటం అనే అర్థం ఏర్పడుతోంది కదా! తాంబూలంలో ఇదొక్కటే దోషం. అందుకని వచ్చిన అతిథులు ఇంక బయల్దేరటానికి సన్నద్ధమైనప్పుడే తాంబూలం ఇచ్చి బట్టలుపెట్టి సాగనంపుతారు. ముందే ఇచ్చేసి ఒక పనైపో యిందనుకోవటం సబబు కాదు. మన సంస్కృతిలో తాంబూలం ఇవ్వటం వీడ్కోలుకి చిహ్నం. దూర ప్రయాణానికి వెళ్లేప్పుడు పొలిమేరల్లో గంగానమ్మకి తాంబూలం ఇచ్చి ప్రయాణం సుఖంగా సాగేలా అనుగ్రహించమని వేడుకుంటారు. శవాన్ని ఊరేగింపుగా తీసుకుపోయేప్పుడు కూడా ఆకులూ వక్కలు వేస్తారు. మూడు ఆకులూ, మూడు వక్కలు ఇస్తే ఇంక మన ఇద్దరిదీ భార్యాభర్తల సంబంధం కాదు, సోదరసంబంధం అన్నట్టుగా భావించే ఆచారం సుమిత్రాలో ఉందట. తాంబూలం బైబై చెప్పే సాధనం అక్కడ.

పాండవదూతగా వచ్చిన పురోహితుని తాంబూల సత్కారం చేసి, ధృతరాష్ట్రుడు వీడ్కోలు చెప్పాడట. "సతం సత్కృత్య కౌరవ్యః ప్రేషయామాస పాండవాన్" అని మూలభారతంలో శ్లోకానికి తిక్కనగారు "నీవు మున్నేగుమని యతనికి విభూషణాంబరమ్ములతో తమ్ములంబు బెట్టి వీడుకో లిచ్చి పుచ్చిన..." అంటూ అనువదించారు. యుద్ధానికి ముందు తన పక్షంలోని వీరాధివీరులైన యోధులందరికీ ధర్మరాజు తాంబూలాభరణాలిచ్చి వీడుకొల్పినట్టు కూడా భారతం చెప్తోంది.

**వశీకరణ తాంబూలం**

కళాపూర్ణోదయంలో పింగళి సూరనగారు తాంబూలాన్ని ప్రేమ విజయ సాధన ప్రక్రియగా ప్రయోగించటం ఎలాగో చెప్పిస్తారు. 'సుగాత్రి' అనే నాయికకు ఆమె భర్త విముఖుడుగా ఉన్నాడు. అతన్ని దారికి తెచ్చుకోవటం ఎలాగో ఆమె తల్లి ఓ ఉపాయం చెప్పింది:

*"గారామున తోడ్తోడన/రా రమ్మనుడనుచు మగిడి రానేటికి గ*
*ర్పూరంబుతోడి బాగా/లీరాదో ఆకుమడిచి యీరాదో చెలి"* గారాముతో ఏదో విధంగా అతన్ని రప్పించి, కర్పూరంతో బాగాలు అంటే వక్కలు వేసి ఆకులు మడిచి ఇవ్వాలనేది ఆ తల్లి చేసిన సూచన.

ఎంతవారయినా తాంబూలదాసులేనని ఆమె నమ్మకం. తాంబూలం ఇవ్వడం అంటే అవతలి వ్యక్తిని ఐస్ చెయ్యడమే ఆ రోజుల్లో!

బండి వెంకట స్వామి అనే కవి "రంభానల కూబర విలాసం" కావ్యంలో తాంబూలాన్ని ప్రేమగా ఎలా ఇవ్వాలో, ప్రేమను ఎలా పొందాలో వివరిస్తూ రంభ నలకూబరుణ్ణి ఎలా లోబరచుకుందో వివరిస్తాడు.



*"వినిమోద మొసగంగ వనజాక్షి తములంబు*
*గొని చెంత నిలుచుండి కొమరు మిగుల*
*తన గళంబున కిది దగునె సాటి యటంచు*
*ఖండము ల్గావించి క్రముకములను*
*తన కక్షములకిది యనయంబు తుల్యమై*
*నందుకొను తమలపాకుల నొగి..."* చక్కగా నవ్వుతూ తమలపాకులు చేత్తో పుచ్చుకుని అతని పక్కనే నిలబడి, తన సొగసుకు ఇది సాటి అగునా అనుకుంటూ, వక్కలు ముక్కలు చేసి, ఆకుల్ని మధ్యకు చీల్చి ఈనెలు తీసి, మంచి ముత్యభస్మాన్ని పచ్చకర్పూరం పలుకుల్ని ఎక్కువగా వేసి గట్టిగా చుట్టి అణచుకోలేని ప్రేమతో శరీరం పులకరిస్తుంటే అతనికి అందించింది...ఇలా సాగుతుందావర్ణన. గూడూరి నమశ్శివాయగారు తాంబూల సేవన ప్రశంస" అనే వ్యాసం (శాంతి భార్గవ విద్యాదేవ కులపతి సంపాదకత్వం)లో ఈ పద్యాన్ని ఉదహరించారు.

(వచ్చేవారం ముగింపు)

వ్రతాన్నో హోమాన్నో పూజనో ప్రారంభించ బోయే ముందు వినాయకుడికి, ఇతర దేవతలకు తాంబూలం ఇస్తారు. తాంబూలంతో పాటు అందులో దక్షిణ కూడా ఉంటుంది. వ్రతాలు చేసేటప్పుడు కాసిన్ని చిల్లర నాణాలు దగ్గరుంచుకోమంటా రందుకే! వ్రతం అయ్యాక వీడ్కోలు చేప్పేప్పుడు సంభావన లేకపోయినా కనీసం తాంబూలమైనా ఇచ్చి పంపాలి. లేకపోతే మర్యాద లోపంగా భావిస్తారు.

కథ

# పంట పొలాలు

చొప్పదండి సుధాకర్

అతడు రమేశ్!

రమేశ్ చెరువుకట్ట మీద అచేతనంగా కూర్చొని ఉన్నాడు. సాయంకాలం! సూర్యుడు పడమరవైపు దిగిపోతూ "ఇంకాసేపటికి వెళ్లొచ్చులే" అన్నట్టు నిదానించి కదులుతున్నాడు. అతడి ఆలోచనలు వివిధ కోణాల్లో ఇష్టారాజ్యంగా సంచరిస్తున్నాయి. వెనకవైపు చెరువు నీటి గలగలలు లయబద్ధంగా వినిపిస్తోన్నా మనసు మాత్రం ఇక్కడ లేదు.

నీటి మీదుగా మంద్రంగా వీస్తున్న గాలి శరీరాన్ని సున్నితంగా పలకరిస్తుంటే ఒకింత స్పృహలో కొచ్చి చుట్టూ చూశాడు. సగానికి పైగా నిండి ఉన్న చెరువులో రకరకాల చేపలూ, పక్షులూ ఉబుసుపోక అటూ ఇటూ ఎగురుతూ జలదృశ్యానికి మరింత రమణీయతను సంతరింపజేస్తున్నాయ్! కుడి పక్క చెరువూ,ఎడమ పక్క కట్టకిందుగా కళ్లకు తమ శక్తి మేర ఆహ్లాదాన్ని పంచుతూ పంట పొలాలు, పొదలు.. తుప్పలు, ఎవరు పట్టించుకోకున్నా ఏపుగా పెరిగిన వేపచెట్లు... ఇంకా కంచిపట్టు చీరకు జరీ అంచులా పక్కనే ఒంపుసొంపుల మెలికలుగా తిరిగి తరలిపోతోన్న చిన్నపాటి సెలయేరు!

రోజూ చూసేదే అయినా అతడికా దృశ్యం నిత్య నూతనంగా కనిపిస్తూ... అనిపిస్తూ... ఉంటుంది. చల్లటి గాలి.. అన్నీ గమనిస్తూ మౌనంగా మిగిలిపోతోన్న పరిసరాలు.. ఎవరో అదృశ్యంగా వెలిగించిన అగరుబత్తుల్లా సహజ పరిమళాలు వెదజల్లుతూ 'మమ్మల్ని కనుక్కో' అంటూ ఆటపట్టించే అడవి మల్లెల సుగంధం–వెరసి ఒక అద్భుత జ్ఞాపక చిత్రం లాగా కనువిందు చేస్తుంటాయి.

వీటన్నింటికి తోడుగా కొద్ది దూరంలో నిటారుగా నిలబడి మనిషికి ధైర్యం చెబుతున్నట్టుగా కొలువైన తాటివనం!

ప్రకృతిని చూసి మనిషి బొమ్మలేయడం నేర్చుకొన్నాడా? బొమ్మలను చూసి ప్రకృతి అందంగా ముస్తాబయిందా? ఏం పిచ్చివాదన.. తాత మొహం అచ్చు మనవడిలా ఉందనట్టు– ఎక్కడో చదివినట్టు గుర్తు. మనిషి అమ్ముడు పోతూ... భూమిని అమ్ముతున్నానని చెప్పడం లాంటిదే. భూమిని వాస్తవానికి ఎవరమ్మ గలరూ? ఆ మాట వింటే భూమి ఫక్కున నవ్వుకోదా?

దూరంగా నాలుగయిదు మోటారు సైకిళ్లు ఆగి ఉన్నాయి. వాటి పక్కనే నలుగురైదుగురు భూదళారులు అటూ ఇటూ చేతులూపుతూ పెద్దగా మాట్లాడుతున్నారు. మధ్యమధ్య నవ్వుతూ ఆ ప్రాంతం గొప్పదనాన్ని విశ్లేషిస్తున్నారు. ఆ మాటలు లీలగా వినిపిస్తున్నాయి.

పొన్నాల–సిద్ధిపేట పట్టణానికి ఆనుకొని ఉన్న కుగ్రామం. ఏం జరిగిందో ఏమోగానీ రెండు, మూడేళ్లుగా ఒకటే ల్యాండ్‌బూమ్ సునామిలా దాన్ని చుట్టు ముట్టింది. పట్టణానికి పది కిలోమీటర్ల పరిధిలోని అన్ని రకాల భూముల ధరలకు రెక్కలొచ్చాయి. వేల ధరల్లో ఉన్నవి లక్షల్లో, లక్షల విలువైనవి కోట్లలో మండిపోతున్నాయ్. సిద్ధిపేట రిజిస్ట్రేషన్ ఆఫీసులో రోజూ సందడే! కొమురెల్లి జాతర చందమే! సైట్‌మ్యాపులు... దస్తావేజులు... నోటరీలు చెట్ల కిందనే బయానాలు... అక్కడక్కడా ఛాలెంజ్‌లు... సిగపట్లు... మారుబేరాలు... అబ్బో అదో వర్ణింపనలవి కాని దృశ్య సమూహం.

దళారులు, అమ్మేవారు, కొనేవారు అందరూ మనవారే. మనుషులు కదా! ఏది లాభంగా ఉంటే అదే చేస్తారు. పైసాలోనే పరమాత్మ ఉందంటే అతిశయోక్తి ఏమీ కాదు.

"నర్సింలు అనేది అదే!" రమేశ్ గుర్తుచేసుకున్నాడు. "ఒరే చెబితే కొంచెం అసహ్యంగా ఉంటుందేమో గానీ ఇవాళ జనం సుఖాలకు విపరీతంగా అలవాటు ...కాదు కాదు అడిక్ట్ అయిపోయేరు. రిమోట్ దొరకకపోయినా, టి.వీ.ఛానల్ మార్చవచ్చు అనే ఇంగిత జ్ఞానం మర్చిపోయి, దానికోసం తన్నుకు చస్తున్నారు. రిమోట్ దొరికే దాకా బి.పి. పెంచుకొంటున్నారు. ఒకప్పటి పారిశ్రామిక విప్లవం ఇట్లా తిరగబడుతుందని తెలిస్తే ఆ ప్రక్రియను అప్పుడే ధ్వంసం చేసే వారేమో? మనిషికిపుడు సుఖమే పరమావధి. అందునా స్మార్ట్ మనీ... కష్టపడకుండా వేరే వాడి కష్టం మీద బతకాలి. ఇందుకు ఆడామగా తేడా లేదు. పల్లె,పట్నం అనే మాటే లేదు.


నర్సింలు, రమేశ్ డిగ్రీ క్లాస్‌మేట్స్, నిర్మల కూడా. అదేమిటో గానీ నర్సింలు పట్టిందల్లా బంగారమే! వాడికి పెళ్లయి ఆరేళ్లు దాటిపోయింది. అబ్బాయి స్కూలుకెళుతున్నాడు కూడా. రమేష్ ప్రేమ మాత్రం నిర్మల దగ్గరే ఆగిపోయింది. పదేళ్ల ప్రేమకు ఇంకా ముగింపు దొరకలేదు.

రమేష్ పెదాలపై ఓ చిరునవ్వు రాబోతూ ఆగిపోయింది. కారణం చేతిలోని స్మార్ట్‌ఫోన్ మోగడమే. దానివైపు చూశాక ఇందాకా రాబోతూ ఆగిపోయిన చిరునవ్వు నిస్సంకోచంగా ఆవిష్కృతమైంది.

"నిమ్మా" నిర్మలను తలచుకొని ఫోన్ లిఫ్ట్ చేయబోయాడు. అంతలోనే కాల్ కట్ అయింది.

'నర్సింలుకి తామిద్దరు ప్రేమించుకొన్నట్టు తెలుసు'. గతం గుర్తు చేసుకొన్నాడు. నిర్మల గుర్తుకు రాగానే ఒక్కసారిగా మనసంతా అదోలా మారిపోయింది. కొంత ఆనందం. ఎక్కువ విషాదం. ఎక్కువ విషాదం కొంత ఆనందం కలగలిసిన ఒకానొక మానసిక స్థితి. అనిర్వచనీయ అనుభూతి అది.

రమేశ్‌కి చదువు పుష్కలంగా ఉన్నా కోరుకొన్న ఉద్యోగం రావడం లేదు. నిర్మలకేమో ఉద్యోగం సిద్ధంగా ఉన్నా చేయడానికి మనసొప్పడం లేదు.



"నిన్ను పెళ్లి చేసుకొని ఇద్దరు ముగ్గురు పిల్లల్ని కనేసి చచ్చేదాకా నీకు, వాళ్లకు సేవ చేసుకోవడమే నా అసలయిన ఉద్యోగం అంటుంది స్వచ్ఛంగా.

"అదేం, పాత చింతకాయ బుద్ధీ" ఎగతాళిగా అన్నాడు. "ఎందుకూ..?" ఉడుక్కొంది నయన మనోహరంగా!

"చక్కగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్కో, అదీ అద్దాల మేడలో"... "ఏమొద్దూ.. నా దృష్టిలో కాపురం చేసుకోవడమే మంచి ఉద్యోగం, అదీ... ఎవరు ఊహించని రీతిలో, మొగుణ్ణి, అత్తమామలను ప్రేమిస్తూ, పిల్లల్ని పెంచి పెద్ద చేస్తూ, వంటలు చేస్తూ కోపానికి గురవుతూ, ప్రతిగా అలుగుతూ, తిడుతూ, తిట్లు పడుతూ ఓహ్... అదో అద్భుత లోకం... "నిర్మల గొంతులో పరవశం...

"వెర్రి బాగా ముదిరింది.." రమేష్ తెచ్చి పెట్టుకొన్న కోపంతో అన్నాడు. "ఉహు.. దీన్ని మీ ఊళ్లో వెర్రి అంటారేమో.. కానీ మా ఊళ్లో ప్రేమ, ఉత్తమ ఇల్లాలు..ఇంకా అదేదో ఆదర్శ దాంపత్యం అంటారు" దీర్ఘం తీస్తూ చెప్పింది.

"నిన్నెవడు చేసుకొంటాడో గానీ – వాడు ఉద్యోగం, సద్యోగం ఏదీ చేయడు. నీ కొంగు పట్టుకొని తిరిగి తిరిగి సర్వనాశనమైపోతాడు.

హు–నీకలా అర్థమయిందా... అటునుండి గాఢమైన నిట్టూర్పు.

"ఒకవేళ మనకు పెళ్లే కాలేదనుకో ఎలా –"రమేశ్ ప్రశ్నించాడు. నిర్మల నుండి అయిదారు సెకన్ల మౌనం.

"కొంపదీసి చచ్చిపోతావా? ఏమిటి?" సరదాగా అడిగినట్టనిపించినా అతడి గొంతులో లీలగా భయం పొడసూపింది.

"కాదు –అసలు నా జీవితంలోంచి పెళ్లినే బహిష్కరిస్తాను".కళ్లు చెమర్చినాయి కాబోలు ఆ 'తడి' గొంతులో ప్రతిఫలించింది. అయిదేళ్లుగా ఇదే తంతు... కలిసిన ప్రతిసారి ఇవే మాటలు!

ఫోన్ మళ్లీ మోగింది. మళ్లీ నిర్మల.. అదే నిమ్మా.. ఈసారి ఫోన్ లిఫ్ట్ చేయక తప్పలేదు. ఎందుకంటే ఆలోచనల్లో పడి గమనించలేదు గానీ, అది అయిదో మిస్‌డ్ కాల్!

"చెప్పండి నిర్మలా మేడమ్!" నిర్లిప్తంగా విష్ చేశాడు. అటునుండి నిశ్శబ్దం మాట్లాడుతున్నట్టు మళ్లీ మౌనమే! "ఇందుకేనా ఫోన్ చేసింది" రమేశ్ గొంతులో ఇష్టమైన నిష్ఠూరం. "కాదు నీ గొంతు వినాలనీ – "ఆమె గొంతు స్థిరంగా మంద్రంగా ఉంది. నిర్మలా ఒత్తిడితో తల్లడిల్లిపోతున్నాను".

ఇక్కడ నాగతీ అంతే. రామకోటి రాసినట్టు ఒకటే మాట పెళ్లి చేసుకో, పెళ్లి చేసుకో అని చంపుతున్నారు.

ఏం చేయాలో తోచడం లేదు. రమేష్ అభావంగా అన్నాడు. చేసేదేముంది? అనుకొన్నది సాధించే శక్తి లేనపుడు, జీవితం ఎటు తీసుకెళ్తే అటు వెళ్లడమే.



కొద్దిసేపటి తర్వాత కాల్ కట్ అయింది.

రమేశ్‌కి మళ్లీ ఫోన్ చేయాలనిపించలేదు. ఎందుకో గానీ కాసేపు మనసుని బాధ బాధగానే ఉంచాలనిపించింది.

అలాగయిన తన పిరికితనానికి తగిన శిక్ష విధించుకొన్నట్టుగా ఉంటుందనిపించింది. మసక చీకట్లు కమ్ముకొస్తుంటే నిస్సత్తువగా కట్టమీది నుండి లేచి ఇంటివైపు బయలుదేరాడు. మనసంతా ఖాళీఖాళీగా ఉంది. ఇంటి నుండి పొలానికి వస్తున్నాడో.. పొలంనుండి ఇంటికి వెళుతున్నాడో కూడా తెలియనంత గందరగోళం.

చేతిలో సెల్‌ఫోన్ మళ్లీ మోగింది!

"మళ్లీ నిమ్మియే..." అనుకొంటూ ఫోన్‌కేసి చూశాడు.

ఈసారి నిమ్మి కాదు... నర్సింలు...! లిఫ్ట్ చేశాడు. "హాయ్ రా.. రమేశ్.." అటు నుండి నర్సింలు పలకరించాడు.

"హాయ్.." మనస్ఫూర్తిగానే బదులిచ్చాడు.

"ఏరా –డల్‌గా ఉన్నట్టున్నావ్" నర్సింలు అసలే ఆవులించకుండానే పేగులు పేగులు లెక్కబెట్టే రకం.

"సర్లే నీ సంగతి తెలియందేముంది. అన్నింటికి తటపటాయింపే..అది పోనీ – మీ ఊళ్లో ఎక్కడయినా పదెకరాల పొలం అయినా మెట్ట భూమయినా ఉందా? కొనడానికి.."

"ఎందుకురా.." షాక్‌లు మీద షాక్‌లు తట్టుకోలేక అడిగాడు. ఎందుకేమిట్రా కొనేస్తా – ఈ ఉద్యోగం అదే సాఫ్ట్‌వేర్ జాబ్ ఎప్పుడుంటుందో, ఎప్పుడు పోతుందో.. కాసింత జేబులు చల్లగా ఉన్నప్పుడే కొనిపడేస్తే నేలతల్లితో కాస్తా అనుబంధం పెరుగుతుంది.బతుక్కి భరోసాగా ఉంటుంది. అదీగాక – ఆ పొలాలు, ఆ గాలీ, చెట్లూ, వాటి సామీప్యం ఓహ్ – ఆ థ్రిల్లే వేరు –" నర్సింలు గొంతులో పట్టరాని పారవశ్యం.

"ఉందిరా – చాలా భూమి అమ్మకానికి ఉంది. రోజు ఇక్కడ జరుగుతున్నది అదే. ఉన్నవాళ్లు తేలిగ్గా అమ్ముకోవడం, లేనివాళ్లు అపురూపంగా కొనుక్కోవడం.."

అయితే నాకో పదెకరాల స్థలం చూడు. అట్లా కాకపోతే యాభయి నుండి డెబ్బయి, ఎనభై లక్షల మొత్తానికి ఎంతొస్తే అంత.. కొనడం మాత్రం పక్కా. అదీ మా ఊళ్లోనే, వీలయితే నీ పొలానికి దగ్గర్లోనే.. ఎందుకంటే నువ్వే అన్ని చూసుకోవాలి.

"అంటే నేనేమో జీవితాంతం మట్టి పిసుక్కొంటూనే ఉండాలి. మీలాంటి వాళ్లేమో అద్దాలమేడల్లో ఉంటూ లైఫ్ ఎంజాయ్ చేయాలా?" రమేశ్ గొంతు ఉక్రోషంతో పూడుకుపోయింది.

"ఒరే పిచ్చి రమేశ్ నేను నీతో రెండు, మూడు విషయాలు చాలా నిర్మొహమాటంగా మాట్లాడతాను. వాటిపై నీ అభిప్రాయం లేదా విశ్లేషణ రేపు లేదా



"చదువంటే లోకజ్ఞానం కోసం, ఉద్యోగం అంటే ఏ బతుకు తెరువూ పూర్తిగా లేనోళ్లకు. మనకెందుకు నాయినా! భూతల్లిని నమ్ముకో నాయినా.. నిన్నెప్పుడు మోసం చేయదు. పదేళ్లు ఉద్యోగం వెలగబెట్టిన వాడే మళ్లీ భూతల్లి ఒడిలోకి రావాలని ఆశపడుతున్నాడు కదరా..! మళ్లీ నువ్వు పదేళ్లు గొడ్డు చాకిరి చేసి తిరిగి పంట పొలాలవైపు రావడం కన్నా, ఈ మధ్య కాలంలో నీకు నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకొని మా కళ్లముందే పిల్లా పాపలతో కళకళలాడుతుంటే.. ఎంత బాగుంటుందయ్యా.."

వారం తర్వాత చెప్పు. వెంటనే మాత్రం అస్సలు వద్దు.."

రమేశ్ చాలాసేపు ఏమి మాట్లాడలేకపోయాడు. నర్సింలు చెప్పే లాజిక్ ఏమిటో అతడికి ఎప్పట్లాగే అస్సలు అర్థం కాలేదు.

"ఒరేయ్ రమేశ్.. విను.. ఒకటి నువ్వు నీలో ఉన్న ఆత్మన్యూనతా భావాన్ని ముందు వొదిలెయ్. నువ్వెంత ఉన్నతస్థాయిలో ఉన్నావో ఒక్కసారి ఆలోచించుకో. ఇన్నేళ్లయ్యాక కూడా నేను నీ వర్గంలోకి రావాలని ఎందుకు ఆరాట పడుతున్నానంటావ్? తల్లిదండ్రుల సాన్నిహిత్యం, సొంతవూరు, పది పదిహేను ఎకరాల పొలం.. నీ అంత లక్కీ ఫెలో అసలు ఈ కాలంలో ఎవరూ ఉండరురా.. అన్నింటి కన్నా గొప్పదైన, నిర్మలమైన నిర్మల ప్రేమను తారస్థాయిలో పొందగలగడం.. ఇంకా నీకు ఏం కావాలిరా..? స్టుపిడ్.." ఫోన్ కట్ చేశాడు.

రమేశ్ చెంపలు తడుముకున్నాడు. నర్సింలు మాట్లాడిన మాటలు అచ్చు చెంపదెబ్బల్లాగే తగిలాయ్. ఎట్లా ఇంటికొచ్చాడో అస్సలు తెలియదు. వచ్చీ రావడంతోనే వాకిట్లో మంచంపై వాలిపోయాడు. చెప్పరాని నిస్సత్తువ ఆవరించింది. కానీ ఆ నిస్సత్తువలోనే ఏదో తెలియని సత్తువ.

"ఒరేయ్ రమేశ్ – నర్సింలు అని ఎవరో నీ ఫ్రెండ్ ఫోన్ చేశార్రా..!" తండ్రి నాగయ్య పలకరింపుతో రమేశ్ ఈ లోకంలోకి వచ్చాడు.

"అంటే.. నాన్నగారూ.. మీకు ముందే చేశాడా.. ఏం మాట్లాడాడు?"

"ఏం మాట్లాడలేదురా.. నీ ఫోన్ పదేపదే ఎంగేజ్ వస్తోంటే నాకు చేశాడట.. అంతే చెప్పాడు.

''అలాగా..'' తాను అంత సేపు నిర్మలతో మాట్లాడిన సంగతి గుర్తొచ్చి లోలోన ఏదో పరవశపు తెర రెపరెపలాడింది.

రమేశ్ సుదీర్ఘంగా శ్వాసించాడు. ఏదో ముఖ్యమైన విషయం చెప్పబోతున్నాడని పూర్ణమ్మ దగ్గరగా జరిగింది. తల్లి చేయి తన చేతుల్లోకి తీసుకొన్నాడు. అందాకా కొట్టుమిట్టాడిన వీధిలైట్ ఒక్కసారిగా ప్రకాశవంతంగా వెలిగింది. రమేశ్ పెదాలపై చిరునవ్వు..!

"నర్సింలని నా ఫ్రెండమ్మా! మన ఊళ్లోనే ఇంకా వీలయితే మన పొలానికి పక్కనే పదెకరాల పొలం తీసుకొంటాడట.దాని బాగోగులు నన్నే చూడమంటున్నాడు. ఏం చెప్పాలి?"

"కొనుక్కొమ్మను బిడ్డా.. మన పొలంతో బాటు తన పొలమూ చూసుకుంటూ ఊళ్లోనే ఉండొచ్చు మాతో బాటు" పూర్ణమ్మ నవ్వింది ఆశగా. "మరి నా చదువూ.. ఉద్యోగమూ..?" రమేశ్ ప్రశ్న ముగ్గరి మధ్య మెయిడిన్ ఓవర్ లాంటి నిశ్శబ్దం..!

"చదువంటే లోకజ్ఞానం కోసం, ఉద్యోగం అంటే ఏ బతుకు తెరువూ పూర్తిగా లేనోళ్లకు. మనకెందుకు నాయినా! భూతల్లిని నమ్ముకో నాయినా.. నిన్నెప్పుడు మోసం చేయదు. పదేళ్లు ఉద్యోగం వెలగబెట్టిన వాడే మళ్లీ భూతల్లి ఒడిలోకి రావాలని ఆశపడుతున్నాడు కదరా..! మళ్లీ నువ్వు పదేళ్లు గొడ్డు చాకిరి చేసి తిరిగి పంట పొలాలవైపు రావడం కన్నా, ఈ మధ్య కాలంలో నీకు నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకొని మా కళ్లముందే పిల్లా పాపలతో కళకళలాడుతుంటే.. ఎంత బాగుంటుందయ్యా.."

"మరి అమ్మా నన్నెవరు గేలి చేయరా..?"

"చేస్తారు నాన్నా.. కానీ గేలి చేసే వాళ్లెవరు నీకు అవసరానికి ఒక్క రూపాయి కూడా సాయం చేయరు.."

అంతా నిశ్శబ్దం – నిశ్శబ్దమే నిజం! నర్సింలు గాని ఒక ఫోన్‌కాల్ తన జీవితాన్నే మార్చేసిందా..! ఒక ఫోన్‌కాల్ కూడా జీవితాన్ని మార్చగలదా?

"సరేనమ్మా ఒక ఫోన్‌చేసి వస్తా – అయిదు నిమిషాల్లో..!

"ఎవరికయ్యా నర్సింలుకా?" పూర్ణమ్మ అడిగింది. "కాదు నిమ్మికి.." నాగయ్య బోసిగా నవ్వాడు.

అయినా వినిపించనే వినిపించింది.

రమేశ్ ఇంట్లో లైట్లన్నీ వేసి నిశ్శబ్దంగా పెరట్లోకి నడిచాడు. ★

# సరికొత్త చాంపియన్ నిఖత్

**భారత మహిళా బాక్సింగ్ అనగానే మేరీ కోమ్ మాత్రమే గుర్తుకు వస్తారు. ఆమెకు అసలు సిసలు వారసురాలిగా తెలుగు రాష్ట్రాల ఏకైక బాక్సర్ నిఖత్ జరీన్ ప్రపంచ వేదికను తాకింది. 2022 ప్రపంచ మహిళా బాక్సింగ్ టైటిల్‌తో పాటు స్వర్ణ పతకంతో సరికొత్త చరిత్రకు తెరతీసింది.**



టర్కీలోని అంటాలియా వేదికగా ముగిసిన 2022 ప్రపంచ మహిళా బాక్సింగ్ 52 కిలోల విభాగం టైటిల్ సమరంలో తెలుగు రాష్ట్రాల బాక్సింగ్ స్టార్ నిఖత్ జరీన్ 5-0తో థాయ్‌లాండ్ బాక్సర్ జిట్ పాంగ్ జుటామాస్‌ను చిత్తు చేయడం ద్వారా విశ్వవిజేతగా బంగారు పతకం అందుకొంది. ప్రస్తుత ప్రపంచ టోర్నీలో భారత్ సాధించిన ఒకే ఒక బంగారు పతకం నిఖత్ సాధించినదే కావడం విశేషం. 2018 ప్రపంచ బాక్సింగ్‌లో మేరీకోమ్ బంగారు పతకం నెగ్గిన తరువాత భారత్‌కు మరో ప్రపంచ బాక్సింగ్ స్వర్ణం అందించిన ఘనతను నిఖత్ జరీన్ సొంతం చేసుకొంది.

**కష్టాలను అధిగమించి..**

తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌లోని ఓ దిగువ మధ్యతరగతి కుటుంబం నుంచి భారత మహిళా బాక్సింగ్‌లోకి దూసుకొచ్చిన నిఖత్ జరీన్ ప్రపంచ టైటిల్ సాధించడం వెనుక.. పుష్కరకాలంగా తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్ల ప్రేరణ, ప్రోత్సాహం ఎంతో ఉంది. నిజామాబాద్ ఖలీల్‌వాడీ ప్రాంతంలోని ఎండీ జమీల్ అహ్మద్, పర్వీన్ సుల్తానా దంపతుల కుటుంబానికి చెందిన నిఖత్ తన కెరియర్‌ను అథ్లెట్‌గా మొదలుపెట్టి.. 13 సంవత్సరాల వయసులో బాక్సింగ్ రింగ్‌లోకి అడుగుపెట్టింది. భారత బాక్సింగ్ దిగ్గజం మేరీకోమ్ స్ఫూర్తితో నిఖత్ సాధన మొదలుపెట్టింది. బాక్సింగ్‌లో అసలు సిసలు చాంపియన్‌గా నిలవాలనే తపనతో, నిరంతర శ్రమతో రాటుదేలింది. హైదరాబాద్‌లోని ఏవీ కాలేజీలో డిగ్రీ చదువుతున్న సమయంలో జలంధర్‌లో జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచింది. 2011లో జరిగిన యువజన జూనియర్ చాంపియన్‌షిప్ టోర్నీలో స్వర్ణ పతకం సాధించింది. అప్పటి నుంచి ఆమె వెనుదిరిగి చూడలేదు.



**మేరీకే సవాలు..**

బాక్సర్‌గా మారటంలో తనకు ప్రేరణగా నిలిచిన మేరీకోమ్‌కే నిఖత్ జరీన్ సవాలు విసరడం ద్వారా అవమానం, పరాజయం ఎదుర్కొంది. టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనే భారతజట్టులో చోటు కోసం దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌కే నిఖత్ సవాలు విసరాల్సి వచ్చింది. ఇద్దరిలో నెగ్గిన వారికి మాత్రమే ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం ఉండడంతో అర్హత బౌట్‌ను నిర్వహించాల్సి వచ్చింది. మరోవైపు టోక్యో ఒలింపిక్స్ జట్టులో తనకు నేరుగా అవకాశమివ్వాలని, తనతో తలపడటానికి నిఖత్ జరీన్ ఎవరంటూ మేరీకోమ్ ప్రశ్నించింది. అయితే నిబంధనల ప్రకారం నిఖత్‌తో మేరీకోమ్ తలపడక తప్పలేదు. ఈ పోరులో నిఖత్‌ను మేరీకోమ్ అలవోకగా ఓడించడమే కాదు, చివరకు కరచాలనం చేయకుండా నిలవటంతో నిఖత్ అవమానకరంగా వైదొలగాల్సి వచ్చింది. అప్పట్లో అదో వివాదంగా, ఆ వివాదానికి నిఖత్ కేంద్రబిందువుగా నిలిచిపోవడం చర్చనీయాంశమైంది. దిగ్గజ బాక్సర్‌తో తలపడేందుకు నిఖత్ సాహసించిందంటూ పలు రకాలుగా విమర్శలు వచ్చాయి.

**తొలి తెలుగు బాక్సర్**

టోక్యో ఒలింపిక్స్‌కు ముందే మేరీకోమ్ చేతిలో ఎదురైన పరాజయం, అవమానాలను, గాయాలను అధిగమించిన నిఖత్ బల్గేరియా వేదికగా 2019లో ముగిసిన 73వ స్ట్రాంజా స్మారక బాక్సింగ్ టోర్నీలో స్వర్ణ పతకం సాధించడం ద్వారా పడిలేచిన కెరటంలా మరోసారి దూసుకువచ్చింది. టర్కీ వేదికగానే ముగిసిన 2011 ప్రపంచ జూనియర్ టోర్నీలో తొలిసారిగా నిఖత్ బంగారు పతకం సాధించింది. ఈ విజయం ద్వారానే జాతీయ బాక్సింగ్‌లో నిఖత్ నిలబడగలిగింది. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఆర్థిక సహకారం అందించడంతో ఆమె ఆటకు ఎలాంటి ఇబ్బంది రాలేదు. ఇదే జోరులో యూత్ బాక్సింగ్‌లో రజతం, నేషన్స్ కప్, థాయిలాండ్ ఓపెన్ టోర్నీలలో పతకాల పంట పండించుకొంది. అంతేకాదు, ప్రపంచ సీనియర్ బాక్సింగ్‌లో స్వర్ణపతకం సాధించిన భారత ఐదవ మహిళగా, తెలుగు రాష్ట్రాల తొలి యువతిగా రికార్డుల్లో చేరింది. ప్రపంచ బాక్సింగ్ టోర్నీలలో మేరీకోమ్ మాత్రమే ఆరుసార్లు (2002, 05, 06, 08, 10, 18) బంగారు పతకాలు గెలుచుకొంది. 2006 ప్రపంచకప్‌లో సరితాదేవి, జెన్నీ, లేఖ కేసీ బంగారు పతకాలు నెగ్గగా.. 2022 టోర్నీ ద్వారా నిఖత్ జరీన్ వారి సరసన నిలువ గలిగింది. 2018 నుంచి విశ్వవిఖ్యాత క్రీడాపరికరాల సంస్థ 'అడిడాస్'కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న నిఖత్ జరీన్‌కు ప్రస్తుత ప్రపంచ టైటిల్‌తో వివిధ రూపాలలో కాసులవర్షం కురువనుంది.

ప్రపంచ చాంపియన్ హోదాలో.. మరో రెండేళ్లలో పారిస్ వేదికగా జరిగే 2024 ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా నిఖత్ జరీన్ 50 కేజీలు లేదా 54 కేజీల విభాగాలలో ఏదో ఒక తరగతిలో తలపడాల్సి ఉంది. బాక్సింగ్ నేపథ్యం, విజేతల పరంపర ఏమాత్రం లేని తెలంగాణ రాష్ట్రం నుంచి అంతర్జాతీయ మహిళా బాక్సింగ్‌లోకి దూసుకొచ్చిన నిఖత్ జరీన్ తెలుగు రాష్ట్రాలకే గర్వకారణంగా నిలిచిపోతుంది.



క్రీడా కృష్ణ, 84668 64969


వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

సాహిత్యం సమాజానికి దర్పణం వంటిదని షెల్లీ చెప్పారు. "కవులు ఎన్నుకోబడని శాసనకర్తల వంటి వారన్న" షెల్లీ అభిప్రాయం యదార్థం. ఒక జాతి చరిత్రను నిర్మించడంలో కవుల పాత్ర మహత్తర మైనది. రూసో, వాల్టేర్ రచనలు ఫ్రెంచ్ విప్లవానికి దారితీసాయి. టాల్‌స్టాయ్, మాక్సింగోర్కి, డోస్టావిస్కీ ప్రభృతుల రచనలు రష్యా ప్రజల్లో అద్భుతమైన మార్పును తెచ్చాయి. ఆ సంఘటనల స్ఫూర్తితో తెలుగుకవులు పారతంత్ర్య ఛేదకంగా, స్వాతంత్ర్య విధానాన్ని జాతీయతా స్ఫోరకంగా, చైతన్య ప్రేర కంగా, ఆశువుగా "భరతఖండంబు చక్కని పాడి ఆవు హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ తెల్లవారను గడుసరి గొల్లవారు / పితుకుచున్నారు మూతులు బిగియగట్టి" అని చెప్పారు. చిలకమర్తి పలుకులు కమ్మని కలకండ పలుకుల్లా, అమృతపు గుళికల్లా ప్రజలను ఆకర్షించాయి. భారతమాతను పాడి ఆవుతో, భారతీయ సంపదను పాడితో, హిందువు లను లేగలతో, వారనుభవించే కష్టాలను లేగదూడల ఏడ్పుతో వర్ణించారు. తెల్లవారిని గడుసరి గొల్లవారు అనడం వల్ల వారి నిర్దాక్షిణ్య కాఠిన్యాన్ని, సంపదను కొల్లగొట్టడాన్ని సూచించారు. మూతులు బిగియగట్టి అనే పదబంధం వల్ల సమకాలీన స్వాతంత్ర్య రహిత మైన దుస్థితిని వ్యక్తపరిచారు. అప్పట్లో ఈ పద్యం గొప్ప బందిఖాన అందులోనున్న ఖైదీలు హిందు జనులు /ఒక్క గదినుండి మార్చి వేరొక్క గదిని పెట్టుటే కాక చెరయంచు వేరెగలదె!"

భారతీయులు బానిసత్వంలో ఎంత బాధపడ్డారో, పారతంత్ర్యం వల్ల ఎంత కుమిలిపోయారో భరత ఖండంబె ఒక గొప్ప బందిఖాన అనే పాదం వల్ల వ్యక్తమవుతుంది. చిలకమర్తి వారి వేదన ఈ పద్యంలో గమనార్హం. స్వాతంత్ర్య భావనా కాంక్షితులు, దేశాభి మాన దీక్షితులైన వారికి చెరసాలలు చంద్రశాలలుగా, అరదండలు విరిదండలుగా, చోడంబలె పరమా న్నంగా, మోటుకంబళ్ళు పట్టుసెల్లాలుగా భాసిస్తాయని చెప్పి, కారాగార భీతులను దేశాభిమాన దీధితులుగా ప్రబోధించారు. తొలి జాతీయోద్యమకవిగా చిలక మర్తి ఎందరో కవులకు స్ఫూర్తిని కలిగించారు.

భారతదేశం మూడు శతాబ్దాలపాటు పారతంత్ర్య కుతంత్రాల్లో అలమటించింది. బ్రిటీష్ వారి కుటిల దాస్య శృంఖలాల్లో మగ్గింది. భారతీయులు స్వాతంత్ర్య రహిత జీవనాన్ని భరించలేక పోయారు. పారతంత్ర్య జీవనాన్ని అనుభవిస్తున్న భారతీయులకు వీరసావర్కర్ మాటలు స్ఫూర్తినిచ్చాయి."పక్షి బంగారు పంజరంలో బంధించబడి జీవించడం కన్నా స్వేచ్ఛా రణ్యాల్లో విహరించడం మిన్న" అనే భావన భారతీయుల్లో ఆలోచన రేకెత్తించింది. ఆ దృక్పథంతో వారిలో జాతీయతా భావాలు పొటమరించాయి. భారతీయులంతా బ్రిటీష్ పాలనను ఎదిరించి, వారి దమననీతిని ఖండించి, వారి పాలనకు చరమగీతం పాడేందుకు జాతీయతా స్ఫూర్తితో జాతీయోద్యమానికి సంసిద్ధులయ్యారు.



చిలకమర్తి లక్ష్మీ నరసింహం

# జాతీయోద్యమాన్ని ప్రదీప్తం

సాధకంగా తమ కలాలను ఝుళిపించారు. తమ రచనల ద్వారా ప్రజల హృదయాల్లో జాతీయోద్యమ భావాలను ప్రేరేపించారు.

**తొలి జాతీయోద్యమ కవి చిలకమర్తి**

బ్రిటీష్ వారు విభజించి పాలించే విధానంలో 1905లో బెంగాల్‌ను రెండు ముక్కలుగా విభజించ డంతో భారతీయుల గుండెలు భగ్గుమన్నాయి. బిపిన్ చంద్రపాల్ దక్షిణ భారతదేశంలో ప్రముఖమైన పట్టణాల్లో ప్రేరణాత్మక ప్రసంగాలు చేసి, ప్రజలను ఉత్తేజపరచి, జాతీయోద్యమ స్ఫూర్తిని రగిలించారు. అందులో భాగంగా ఆంధ్రదేశంలో మచిలీపట్టణం, విశాఖపట్టణం, రాజమహేంద్రవరం వంటి పట్టణాల్లో ఉపన్యాసాలు చేశారు. 1907వ సంవత్సరం ఏప్రిల్ 5,6,7 తేదీల్లో రాజమండ్రిలో ఉత్తేజపూరితమైన ఉపన్యాసాలను చేయగా, వాటిని ప్రముఖ తెలుగుకవి చిలకమర్తి అనువదించారు. చివరిరోజు సభలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ దురాగతాలను, దోపిడీ తెలుగు ప్రజల నాలుకలపై నాట్యం చేసింది.

దేశాభిమాన రహితులైన కొందరు పండితులు బ్రిటీష్ ప్రభుత్వానికి ఆ పద్యంలో చిలకమర్తి తెల్ల వారిని గొల్లవారితో పోల్చి అభిశంసించాడని చెప్పి, జైలుశిక్ష విధించేట్లు చేశారు. దేశాభిమానులైన మరికొందరు పండితులు బ్రిటీష్ ప్రభుత్వానికి ఆ పద్యంలో చక్కని విరుపుతో, 'తెల్లవారన్ గడుసరు గొల్లవారు ' అనే అర్థం చెప్పి అందులో నిందార్థమేదీ లేదని నిరూపించి జైలు నుంచి విడిపించారు. చిలకమర్తి పద్యాన్ని తెలుగులో తొలి జాతీయ కవితగా విమర్శకులు గుర్తించారు.

జాతీయోద్యమంలో పాల్గొన్న దేశభక్తులను బ్రిటీష్ వారు దమననీతితో జైల్లో పెట్టేవారు. చిలకమర్తి వారు కారాగారవాసాన్ని లెక్కచేసేవారు కాదు. లాలా లజపతిరాయ్‌ను నిర్బంధించి జైల్లో ఉంచిన సందర్భంలో, భారతదేశపు స్థితి ఒక కారాగారంగా ఉందని వర్ణిస్తూ "భరతఖండంబె ఒక

**విశ్వమానవ జాతీయగీతం గురజాడ దేశభక్తి ఖండిక**

గురజాడ అప్పారావు దేశభక్తి ఖండిక ఆయన జాతీయ దృక్పథానికి, విశాల దృష్టికి, అభ్యుదయ కాముకతకు, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి స్వర్ణ పతాక. ప్రజాకవిగా సరళమైన పదాలతో ముత్యాల సరాలు గేయ ఛంధస్సుతో జన సామాన్యానికి దేశభక్తి ప్రబోధం కలిగించారు. ఆచార్య సి.నారాయణరెడ్డి అభిప్రాయపడినట్లు "ఈ గేయం బంకించంద్రుని వందేమాతరం, రవీంద్ర కవీంద్రుని జనగణమన వంటిదన్న" విషయం అక్షరసత్యం. ఆ గీతాల్లో లేని విశాలదృక్పథం గురజాడ గేయంలో కనిపిస్తుంది. ఇందులో ఎక్కడా ప్రత్యేకించి ఒక్క భారతదేశానికి మాత్రమే సంబంధించిన ప్రశంస లేదు. ఏ దేశం వారికైనా దేశభక్తిని ప్రబోధించే విధంగా ఉంది. అందుకే ఇది విశ్వమానవ జాతీయగీతం అన్న సినారె అభిప్రాయం సమంజసంగా ఉంది. ఈ గీతంలో

"దేశాభిమానం / నాకు కద్దని /వొట్టి గొప్పలు చెప్పుకో కోయ్ /కూడి ఏదైనా / గట్టి మేల్ తలపెట్టవోయ్'.. ప్రజల్లో నిర్మాణాత్మకమైన గట్టిమేలు చేయడమే దేశాభిమానానికి నిదర్శనమని వొట్టిమాటలు కాదన్న ప్రబోధం జాతీయోద్యమంలో ప్రజలను ప్రభావితం చేసింది.

**దేశభక్తి కవితకు స్ఫూర్తి ప్రదాత రాయప్రోలు**


రాయప్రోలు సుబ్బారావు భారత జాతీయాభిమాన స్ఫూర్తితో రచించిన జన్మభూమి గీతం "ఏ దేశమేగినా, ఎందు కాలిడినా, పొగడరా నీ తల్లి / భూమి భారతిని / నిలుపరా నీ జాతి, నిండు గౌరవము" జాతీయోద్యమ స్ఫోరకంగా దేశభక్తి తత్పరతను ప్రబోధించారు. జాతీయోద్యమంలో యువకుల్లో గొప్ప స్పందన కలిగించి ఈ గీతం ప్రచారం పొందింది.

జాషువా, కరుణశ్రీ, కొడాలి వంటివారు ఆంధ్రాభిమాన కవిత్వ రచనకు పూనుకున్నారు. విశ్వనాథ వారి ఆంధ్రప్రశస్తి, ఆంధ్రపౌరుషం వంటి ఖండ కావ్యాలు దేశభక్తి ప్రదీప్తికి నిదర్శనాలు. జాషువా "భరతమాత" ఖండిక అత్యంత ప్రసిద్ధికెక్కిన దేశభక్తి కవిత. తుమ్మల జాతీయోద్యమంలో ప్రముఖ నాయకుడైన గాంధీజీ ఆత్మకథ, మహాత్మ కథ వంటి గ్రంథాలు రచించారు. కరుణశ్రీ విజయశ్రీ కావ్యంలో ధ్వని పూర్వకంగా పారతంత్ర్యాన్ని నిరసించారు. మహాత్ముని వ్యక్తిత్వాన్ని గూర్చి బ్రిటీష్ వారి దురాగతాలను గూర్చి హృద్యమైన పద్యకవితలు రచించాడు. కొడాలి వారి "హంపి క్షేత్రం" గత వైభవ కీర్తికి చక్కని దృష్టాంతం. దువ్వూరి వారి నైవేద్యం, మాతృమందిరం,స్వాతంత్ర్య రథం గొప్ప దేశభక్తి ఖండికలు. వేదులవారి "కాంక్ష"లో త్యాగధనుల ప్రశంస ఉంది.




**డా॥ పి.వి.సుబ్బారావు**
**9849177594**


"వీరగంధం తెచ్చినారము/ వీరులెవ్వరో చెప్పుడి" అనే గీతం ద్వారా ప్రజల్లో వీరత్వాన్ని ప్రదీప్తం చేశారు. మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి ఆనాటి సంఘంలో అస్పృశ్యతను అధిక్షేపణగా చేసుకొని "అంటరాని వారెవరు? మా వెంటరానివారే ?" అని ప్రజల హృదయాల్లో నిబిడీకృతంగా దాగిన వీరత్వాన్ని, దేశాభిమాన తత్వాన్ని, జాతీయోద్యమ భావనాదీప్తిని రేకెత్తించారు. మంగిపూడి వేంకటశర్మ "మేలుకొనుమీ భరతపుత్రుడ / మేలుకొనుమీ సచ్చరిత్రుడ" అంటూ ప్రజలను జాతీయోద్యమంలో జాగృతం చేశారు..



గురజాడ అప్పారావు



రాయప్రోలు సుబ్బారావు



త్రిపురనేని రామస్వామి



గరిమెళ్ల సత్యనారాయణ

# చేసిన తెలుగుకవులు

రాయప్రోలు వారు ఆంధ్రాభిమానంతో తొలిసారిగా తెనుగుతల్లి పదాన్ని ప్రయోగించారు. జాతీయోద్యమంలో ఆంధ్రులు సమైక్యంగా పోరాడాలన్న కాంక్షతో 1914లో ప్రబోధం ఖండిక రచించారు. "అమరావతి పట్టణమ్మున బౌద్ధులు/ విశ్వవిద్యాలయమ్ములు స్థాపించునాడు" అనే పద్యాన్ని నెల్లూరులో జరిగిన ఆంధ్రోద్యమ సభలో ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య చదివి వినిపించగా, సభికుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. అప్పటి వరకు ఆంధ్రరాష్ట్రం విషయంలో కలహించుకునే నాయకులు ఈ పద్యాల స్ఫూర్తితో సమైక్యతా భావాన్ని ప్రకటించారట. కవిత్వం సామాజిక ప్రయోజనాన్ని సాధించాలనే ఆధునిక విమర్శ సిద్ధాంతానికి లక్ష్యంగా ప్రబోధం ఖండిక ద్వారా రాయప్రోలు వారు కవితా పరమార్థాన్ని సాధించారు. వారి "ఆంధ్రావళి కవితా సంపుటి" స్ఫూర్తితో విశ్వనాథ, దువ్వూరి, తుమ్మల,

**జాతీయోద్యమం - ప్రచార కవిత్వం**

గేయకవి సార్వభౌముడైన గరిమెళ్ళ సత్యనారాయణ బ్రిటీష్ ప్రభుత్వ పాలనను గర్హిస్తూ, తెల్లవారిని నిరసిస్తూ, ప్రజలను ప్రబోధిస్తూ గేయాలు రాశారు. ఆయన గేయాల్లో ఆనాటి బ్రిటీష్ వారి దుండగాలను, దురాగతాలను కళ్ళకు కట్టినట్లు వర్ణించారు."మా కొద్దీ తెల్లదొరతనము / దండాలండోయ్ / మేముండలేమండోయ్ బాబు/ ఉప్పు పన్ను, పప్పుపన్ను / ఊరికెళితే పన్ను / సైతాను ప్రభుతనింక / సాగనీయమండోయ్ బాబు" అంటూ తెల్లవారి పాలనలో ప్రజలకు కలిగిన బాధలను హృదయవిదారకంగా వర్ణించి నిరసించారు. సైతాను ప్రభుతలో 'సైతాను" పదప్రయోగం ఆ ప్రభుత్వ దుర్మార్గాన్ని సూచిస్తుంది. ఈ గేయం ఆనాడు గొప్ప ప్రచారంతో పాటు, గాంధీజీ మెప్పు పొందింది.

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి

జాతీయోద్యమంలో కలం పట్టిన ప్రతి కవి జాతీయోద్యమ ప్రేరకంగా పారతంత్ర్య ఛేదకంగా స్వాతంత్ర్యోద్యమ స్ఫోరకంగా కవితలు రాసి, ప్రజల హృదయాల్లో దేశభక్తి తత్పరతను ప్రదీప్తం చేశారు.

జాతీయోద్యమంలో రచయితలు నాటకాలు, నవలలు, కథలు విరివిగా రాసి, ఉద్యమస్ఫూర్తిని ప్రజల్లో రగిలించారు. స్వాతంత్ర్య సముపార్జనకు దోహదం చేశారు.


**వ్యాకసర్త : రిటైర్డ్ ప్రొఫెసర్ & తెలుగు శాఖాధిపతి, సి.ఆర్. కళాశాల, గుంటూరు.**

# బాల జాగృతి

## తెలుసుకుందాం ఓదెల మల్లన్న ఆలయం-పెద్దపల్లి



తెలంగాణ రాష్ట్రం, పెద్దపల్లి జిల్లా, ఓదెల గ్రామంలో ఈ ఆలయం కొలువుదీరింది. రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రాల్లో ఇదీ ఒకటి. పెద్దపల్లి జిల్లాలోనే అతి పురాతనమైనదిగా పేర్గాంచింది. ఆలయ నిర్మాణక్రమం, స్తంభ వర్ణ శిలల శిల్పాల ఆధారంగా చాళుక్యుల కాలంలో దీనిని నిర్మించినట్లుగా తెలుస్తోంది. ఆలయంలో శ్రీభ్రమరాంబ సమేత మల్లన్న భక్తులకు దర్శనమిస్తారు. అంతేకాదు, వీరభద్రస్వామి ఆలయం, ఖండేశ్వరస్వామి, మేడుదులదేవి, కేతమ్మల విగ్రహాలున్నాయి. మహాశివరాత్రికి మూడురోజుల పాటు కల్యాణోత్సవాలు, స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తారు.

## కథ | సత్యనాథుడి అసంతృప్తి



మల్లపురాన్ని పాలించే సత్యనాథుడికి నిత్యం ఖజానా నింపడం పైనే ధ్యాస ఉండేది. అన్ని రాజ్యాల్లో కంటే తన ఖజానా నిండుగా ఉండాలనీ, అలా ఉంటే పాలన సులభమవుతుందనీ అనుకునేవాడు.

దానికి తగ్గట్లే పరిపాలన మీద కంటే పన్నులు, ఇతర ఆదాయ మార్గాలపైనే దృష్టి పెట్టేవాడు. అయినా నిత్యం నిధులు సరిపోవడం లేదని అసంతృప్తితో ఉండేవాడు.

ఒకరోజు 'నాయనా! ఈ ఏడు పాత్రల్లో ఉన్న వజ్రవైఢూర్యాలతో నీ ఖజానా నిండిపోతుంది. హాయిగా పాలించవచ్చు. కానీ దీనిలో నీ ప్రయత్నం లేదనే అసంతృప్తి కలుగకుండా ఉండాలని ఒక పాత్రలో సగం మాత్రమే ఆభరణాలు నింపాను. మిగిలిన సగం నువ్వు నింపి ఆ మొత్తాన్ని ఖజానాలో వేస్తే అది ఎన్ని తరాలకైనా సరిపోతుంది' అని ఒక దేవత రాజుకు కలలో ప్రత్యక్షమై చెప్పింది. రాజు వెంటనే మేల్కొని చూశాడు. నిజంగానే అక్కడ ఆరు పాత్రల్లో నిండుగా, మరో పాత్రలో సగం కళ్లు మిరుమిట్లు గొలిపే ఆభరణాలు ఉన్నాయి.

రాజు వెంటనే తన ఒంటిమీద ఉన్న ఆభరణాల్ని తీసి ఏడో పాత్రలో వేశాడు. కానీ అది నిండలేదు. రాణి నగలు తెప్పించి అందులో వేసి

## పద్యం

కనకపు సింహాసనమున
శునకము గూర్చుండబెట్టి శుభలగ్నమునం
దొనరగ బట్టము గట్టిన
వెనుకటి గుణమేల మాను వినురా సుమతీ!

**భావం :** ఓ మంచి బుద్ధిగలవాడా! కుక్కది హీన గుణము, దానిని మంచి ముహూర్తము నాడు బంగారపు సింహాసనమున కూర్చుండబెట్టిననూ హీనబుద్ధి విడవదు. అలాగే హీనుని ఉన్నత స్థానమున కూర్చొండబెట్టిననూ అతని బుద్ధి మారదు అని భావం.

## శ్లోకం

ఆయుర్విత్తం గృహచ్ఛిద్రం
రహస్యం మన్త్రమౌషధమ్।
తపో దానావమానే చ
నవ గోప్యాని కారయేత్॥

**భావం :** ఆయుష్షు, ఆదాయాదులు, ఇంట్లోని కలహాలు, వ్యక్తిగత రహస్యాలు (తనకే తెలిసిన లోపాలు), మంత్రం, ఔషధం, తపస్సు, దానం, అవమానం ఈ తొమ్మిది విషయాలు గోప్యంగా ఉంచాలి.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| భారత్ | రోస్ |
| బంగ్లాదేశ్ | తులిప్ |
| ఇంగ్లాండ్ | జాస్మిన్ |
| పాకిస్తాన్ | లోటస్ |
| టర్కీ | వాటర్‌లిల్లీ |

జవాబులు : భారత్-లోటస్, బంగ్లాదేశ్-వాటర్‌లిల్లీ, ఇంగ్లాండ్-రోస్, పాకిస్తాన్-జాస్మిన్, టర్కీ-తులిప్

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### చేబియ్యం సోదెమ్మ




1895 జూలై 15న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జన్మించారు. భర్త సోమయ్యతో కలిసి పోలవరం గ్రామంలో సురాజ్య ఆశ్రమాన్ని స్థాపించారు. గిరిజనుల అక్షరాస్యత, ఖాదీ ప్రచారానికి దశాబ్దం పాటు దంపతులిద్దరూ కృషి చేశారు. సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఆరు నెలల పాటు వెల్లూరు, కన్ననూరులలో జైలుశిక్ష అనుభవించారు. రాజమండ్రిలో అస్పృశ్యతా నివారణోద్యమంలోనూ పాల్గొన్నారు.



చూశాడు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఇలా కాదని ఖజానాలో ఉన్న ఆభరణాల్ని ఒక్కొక్కటీ తెచ్చి పాత్రలో వేయడం మొదలుపెట్టాడు. ఎన్ని వేసినా ఆ పాత్ర నిండలేదు. ఆస్థాన మంత్రికి విషయం అర్థమై రాజు దగ్గరికి వచ్చి "రాజా! ఆ పాత్ర మన మనస్సు లాంటిది. దానికి ఎప్పటికీ సంతృప్తి ఉండదు. మీరు ఆ విషయం అర్థం చేసుకుని ఈ వృథా ప్రయత్నం ఆపండి" అని చెప్పాడు.

తనలో మార్పు తీసుకురావడానికే తన ఆరాధ్యదైవం ఇలా చేసి ఉంటుందని భావించిన రాజు అప్పట్నుంచి ఖజానా మీద కంటే పాలనపైనే ఎక్కువ దృష్టి పెట్టి జనరంజకంగా పాలన సాగించాడు. ★

## జనరల్ నాలెడ్జ్

1. మేదారం సమ్మక్క-సారలమ్మ జాతర ఎన్ని సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు?
2. భారతదేశ మొదటి రాష్ట్రపతి?
3. ఉత్తరాఖండ్ రాష్ట్ర రాజధాని ఏది?

జవాబులు: 1. రెండేళ్లు; 2. డా. బాబు రాజేంద్రప్రసాద్; 3. డెహ్రాడూన్

## మెదడుకు మేత

లోకమంతటికి ఒకటే పందిరి-ఒకటే అరుగు?

జవాబు: ఆకాశం-భూమి

## మంచిమాట

మితిమీరిన విశ్రాంతి అన్ని విధాలుగా అనర్థం.



# వారఫలాలు

30 మే-05 జూన్ 2022



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

విద్యార్థులు, నిరుద్యోగులు అవకాశాలు సాధిస్తారు. చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. రావలసిన డబ్బు అందుతుంది, రుణ బాధలు తొలగుతాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లభిస్తాయి. కళాకారులు, రాజకీయవేత్తలకు విజయాలు. పరిశోధకులు, వైద్యులకు పట్టింది బంగారమే. 4,5 తేదీల్లో దూరప్రయాణాలు. శారీరక రుగ్మతలు. ఖర్చులు. దక్షిణామూర్తి స్తోత్రం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

సన్నిహితుల నుంచి శుభవార్తలు అందుతాయి. రావలసిన బాకీలు అందుతాయి. రుణాలు తీరతాయి. వ్యాపారులు లాభాలు పొందుతారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు దక్కి కొత్త ఆశలు చిగురిస్తాయి. రాజకీయ, పారిశ్రామికవేత్తలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. రచయితలు, కళాకారులు విశేష పేరుప్రతిష్టలు పొందుతారు. 1,2 తేదీల్లో అనుకోని ఖర్చులు, స్నేహితులతో విభేదాలు. శివపంచాక్షరి పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

కార్యక్రమాలు సాఫీగా పూర్తి కాగలవు. ఆస్తి విషయాలలో బంధువులతో వివాదాల పరిష్కారం. రావలసిన సొమ్ము అందుతుంది. ఉద్యోగులు విధి నిర్వహణలో గుర్తింపు పొందుతారు. రాజకీయ, పారిశ్రామికవేత్తలు సన్మానాలు, సత్కారాలతో బిజీగా గడుపుతారు. రచయితలు, పరిశోధకులకు మరింత అనుకూల సమయం. 4,5 తేదీల్లో శారీరక రుగ్మతలు. బంధువిరోధాలు. గణేశాష్టకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

కష్టం ఫలించే సమయం. ఆస్తి వివాదాల నుంచి కొంత గట్టెక్కుతారు. పెండింగ్ బాకీలు కొన్ని వసూలవుతాయి. వ్యాపారులకు లాభాలు. విస్తరణలో ఆటంకాలు తొలగుతాయి. ఉద్యోగులకు కొత్త విధులు సంతృప్తికరంగా ఉంటాయి. ఇంక్రిమెంట్లు రాగలవు. రచయితలు, క్రీడాకారులు సత్తా చాటుకుని పేరు ప్రతిష్టలు పొందుతారు. 2,3 తేదీల్లో దూర ప్రయాణాలు. మానసిక అశాంతి. శ్రీరామ స్తోత్రం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. వాహనాలు, భూములు కొంటారు. రుణభారాలు తొలగుతాయి. ఆకస్మిక ధనలాభాలు. వ్యాపారులు కొత్త పెట్టుబడులతో ఉత్సాహంగా గడుపుతారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో అవాంతరాలు, చికాకులు తొలగుతాయి. 30,31 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్యం. అనుకోని ప్రయాణాలు. లక్ష్మీగణపతి స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ముఖ్య కార్యక్రమాల్లో విజయం. సమాజంలో గౌరవమర్యాదలు పెరుగుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. దీర్ఘకాలిక రుణబాధలు తొలగుతాయి. ఊహించని రీతిలో డబ్బు అందుతుంది. వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టేందుకు తగిన సమయం. ఉద్యోగులకు ఊహించని రీతిలో పదోన్నతులు లభిస్తాయి. 31,1 తేదీల్లో అనారోగ్యం. కుటుంబంలో చికాకులు. శ్రీకృష్ణ స్తోత్రం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కష్టానికి తగిన ఫలితం కనిపిస్తుంది. భూములు, భవనాలు కొంటారు. ఆస్తుల విషయంలో నూతన అగ్రిమెంట్లు చేసుకుంటారు. అవసరాలకు తగినంతగా సొమ్ము సమకూరుతుంది. రుణబాధల నుంచి విముక్తి. ఉద్యోగులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. పైస్థాయి నుంచి ప్రశంసలు. 2,3 తేదీలలో దూరప్రయాణాలు. బంధువులతో తగాదాలు. ఆదిత్యహృదయం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ముఖ్య కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి కాగలవు. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. శుభ కార్యాలలో పాలుపంచుకుంటారు. ఒక సంఘటన ఆకట్టుకుంటుంది. నిరుద్యోగుల యత్నాలు సఫలం. రావలసిన సొమ్ము అంది అవసరాలు తీరతాయి. ఉద్యోగులకు విధుల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. 3,4 తేదీల్లో ఖర్చులు పెరుగుతాయి. శారీరక రుగ్మతలు. హయగ్రీవ స్తోత్రం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఆస్తి వివాదాల నుంచి గట్టెక్కుతారు. ఆర్థికంగా బలం చేకూరుతుంది. దీర్ఘకాలిక రుణాలు తీరతాయి. వ్యాపార విస్తరణ యత్నాలు ఊపందుకుంటాయి. ఉద్యోగులకు పనిభారం తగ్గడమే కాకుండా పదోన్నతి అవకాశాలు లభిస్తాయి. రాజకీయ, పారిశ్రామిక వేత్తలకు ఊహించని అవకాశాలు దక్కుతాయి. 30.31తేదీల్లో అనుకోని ప్రయాణాలు. అనారోగ్యం. శివాష్టకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటారు. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు సఫలం. అవసరాలకు డబ్బు సమకూరి రుణదాతల ఒత్తిడులు తొలగుతాయి. వ్యాపారులకు అనుకున్న లాభాలు తథ్యం. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లభిస్తాయి. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. 2,3 తేదీల్లో మానసిక ఆందోళన. కుటుంబసభ్యులతో తగాదాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

కార్యసిద్ధి. విద్యార్థులకు విజయాలు వరిస్తాయి. రావలసిన సొమ్ము అంది అవసరాలు తీరతాయి. వ్యాపారులు విస్తరణలో ముందుకు సాగుతారు. పెట్టుబడులకు తగిన లాభాలు దక్కుతాయి. ఉద్యోగులు విధుల్లో ఉత్సాహంగా సాగుతారు. రచయితలు, పరిశోధకులకు మరింత గుర్తింపు లభిస్తుంది. 3,4తేదీల్లో వృథా ఖర్చులు. ఆరోగ్య సమస్యలు.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ముఖ్య కార్యక్రమాలు నెమ్మదిగా సాగుతాయి. కష్టపడ్డా ఫలితం దక్కనిస్థితి. శారీరక రుగ్మతలు కొంత బాధిస్తాయి. కుటుంబంలో ఒత్తిడులు పెరుగుతాయి. అవసరాలు పెరిగి కొత్తగా రుణాలు చేయాల్సివస్తుంది. వ్యాపారులకు కొద్దిపాటి లాభాలు. ఉద్యోగులు మరింత శ్రమపడాల్సిన సమయం. 31,1 తేదీలలో శుభకార్యాలకు హాజరు. ఆస్తి లాభం. నృసింహ స్తోత్రం పఠించండి. ★

# పదరసం-368

## ఆధారాలు

**అడ్డం**

1. కవి శేషేంద్ర నెలకొల్పింది, మేనిఫెస్టో రాసింది (4)
4. చుట్ట, బీడీ, సిగరెట్టు కాల్చడం (4)
8. భార్య (2)
9. అనేక పర్యాయములు (4)
11. వర్షం (2)
13. రుద్రాక్షలోని పండు (2)
14. అన్నీ, సమస్తం కలంతో వుంది (3)
17. పల్టీ, తలక్రిందు (3)
18. అటుగా షేర్ చేయండి (2)
19. అరటిచెట్టు, ఒకానొక అప్సరస (2)
22. వానరము (2)
23. చీల (2)
24. పాము (4)
26. అల్లరి చేయటం (2)
29. హత్య చేసినవాడు (4)
30. అచ్చుపని (4)

**నిలువు :**

2. పువ్వు (2)
3. మాద్రి పెద్ద కొడుకు (4)
5. బుద్ధి (2)
6. ఇంద్రుని ఉద్యానవనం (4)
7. పైకి వినబడకుండా చెవిలో మాట (4)
10. శివరాత్రికి కచ్చితంగా జరిపేది (6)
12. భారతదేశపు 29వ రాష్ట్రం (4)
15. స్వప్నము (2)
16. తలుపు (2)
20. సంకీర్తన అంటే ఇలాంటి గీతమే! (4)
21. ఆరుద్ర కావ్యం, నిజాం వ్యతిరేక పోరాట కాలంలో (4)
25. పొగరు (3)
27. పంతము (2)
28. విపంచి (2)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | 2 | | 3 | ✠ | 4 | 5 | | 6 |
| 7 | ✠ | | ✠ | | ✠ | ✠ | | ✠ | |
| 8 | | ✠ | 9 | | | 10 | ✠ | 11 | |
| | ✠ | 12 | ✠ | | ✠ | 13 | | ✠ | |
| 14 | 15 | | ✠ | ✠ | ✠ | | ✠ | 16 | ✠ |
| ✠ | 17 | | | ✠ | 18 | | ✠ | 19 | 20 |
| 21 | ✠ | | ✠ | ✠ | ✠ | 22 | | ✠ | |
| 23 | | ✠ | 24 | | 25 | | ✠ | 26 | |
| | ✠ | 27 | ✠ | ✠ | | ✠ | 28 | ✠ | |
| 29 | | | | ✠ | 30 | | | | ✠ |

**పదరసం - 368**

పేరు : ..........................................................................................

చిరునామా:..........................................................................................

..........................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2022 జూన్ 13 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 364 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 వా | కా | 2 టీ | పాం | 3 డు | రం | 4 గా | 5 రా | వు |
| 6 సం | ఘీ | ✠ | ష్ప | ✠ | మ్మా | ✠ | 7 య | మా | ✠ |
| 8 త | ర | 9 వా | ణి | ✠ | ✠ | 10 ప | ని | రా | డు |
| సం | ✠ | దు | ✠ | 11 ర | 12 జ | ని | ✠ | వు | ✠ |
| ✠ | 13 శ్రీ | లా | వి | ✠ | డ | ✠ | 14 క | ✠ | 15 ము |
| 16 స | ✠ | ట | ✠ | 17 స | ✠ | 18 శ | ల | భ | ము |
| 19 త్యా | క్త | ✠ | 20 అ | ష్ట | మి | త్రు | డు | ✠ | క్ష |
| జి | ✠ | 21 క | డ | ప | ✠ | వు | ✠ | 22 అం | ✠ |
| 23 త్ | సం | ✠ | 24 ద | ద | 25 న | ✠ | 26 నే | తా | 27 జీ |
| రే | ✠ | 28 మొ | క్కు | ✠ | 29 వ | ని | త | ✠ | వి |

**విజేతలు:** జి.అభిరామ్, టి.వి.నారాయణ, బి.ఇందు శేఖర్, ఎం.విజయలక్ష్మి–హైదరాబాద్, టి.రేవతి, వి.రామలింగాచారి–యాదగిరిగుట్ట, జి.చంద్రము–యాదాద్రి, జి.ఆదినారాయణరెడ్డి–కడప, ఎన్.వి.ఎస్. శర్మ–తూర్పుగోదావరి, జి.భారతి–నెల్లూరు, సి.హెచ్. వి.చక్రపాణి–గుంటూరు, డా॥బి.ధన్వంతరి– మచిలీపట్నం, జి.కోటేశ్వరమ్మ–ఒంగోలు, డి.స్వాతి–విజయవాడ, కె.సత్యనారాయణ, ఎన్.సుభాష్ చంద్రబోస్–విశాఖపట్నం, కె.కాంతామణి–భువనేశ్వర్.

**బహుమతి పొందిన విజేత: జి.చంద్రము- యాదాద్రి.**

# కష్టాల కడగళ్ల నడుమ 'శేఖర్'

అరుణ



నటుడు, డాక్టర్ రాజ శేఖర్ గత యేడాది కరోనా కారణంగా చావు అంచు వరకూ వెళ్లి బయటపడ్డారు. అయితే సరిగ్గా దానికి కొన్ని నెలల ముందు ఆయన పలు చిత్రాలకు అంగీకారం తెలిపారు. దాదాపు నాలుగైదు సినిమాలను వరుసలో పెట్టారు. కల్కి తర్వాత రాజశేఖర్ నటించిన అర్జీవీ దెయ్యం, అర్జున సినిమాలు విడుదలయ్యాయి కానీ అవి రెండూ ఇలా వచ్చి అలా మాయమై పోయాయి. అయితే ఆ రెండు సినిమాలు.. గరుడవేగ, కల్కి ముందువి కావడంతో వాటి పరాజయాలను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఇక తాజాగా విడుదలైన రాజశేఖర్ 'శేఖర్' మూవీ ప్రారంభమైన తర్వాత కూడా పలు మార్పులు చేర్పులు ఈ ప్రాజెక్ట్‌లో జరిగాయి. దర్శకులు, నిర్మాతలు మారిపోయారు. మలయాళ చిత్రం 'జోసఫ్'ను రీమేక్ చేయాలని అనుకున్నప్పుడు డైరెక్టర్ నీలకంఠ ఈ ప్రాజెక్ట్‌ను టేకప్ చేశారు. ఆ తర్వాత లలిత్ దర్శకత్వంలో మూవీ మొదలైంది. చివరకు జీవిత దర్శకత్వపు బాధ్యతలు స్వీకరించాల్సిన పరిస్థితి వచ్చింది. కరోనా నుండి బయటపడి ఈ సినిమాను రాజశేఖర్ పూర్తి చేసినా, విడుదలకు ముందు, తర్వాత సైతం పలు అడ్డంకులు ఎదురయ్యాయి. కోర్టు కేసులు నడిచాయి. చివరకు సినిమా ప్రదర్శనలో ఒకటి రెండు రోజులు అవరోధం ఏర్పడినా ఇప్పుడు వ్యవహారం ఓ కొలిక్కి వచ్చి, థియేటర్లలో ప్రదర్శితమౌతోంది.


ఇది ముందు చెప్పుకున్నట్టు మలయాళ చిత్రం జోసఫ్‌కు రీమేక్. రాజశేఖర్ ఇమేజ్‌కు తగ్గట్టు కథలో మార్పులు, చేర్పులు చేయడానికి దర్శక నిర్మాతలు పెద్దంత ఇష్టపడలేదు. దాంతో మలయాళ కథను యథాతథంగా తెలుగులోనూ తీసేశారు. కథ విషయానికి వస్తే... శేఖర్ (రాజశేఖర్) పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్. ఎలాంటి క్లిష్టమైన కేసునైనా నిమిషాల్లో పరిష్కరించి, నిందితుల్ని గుర్తించే సత్తా ఉన్నవాడు. అయితే అతని జీవితంలో పలు విషాదకర సంఘటనలు చోటు చేసుకుంటాయి. తాను ప్రేమించిన కిన్నెర (ముస్కాన్)ను శేఖర్ పెళ్లి చేసుకోలేక పోతాడు. ఆమెకు వేరే వారితో పెళ్లి జరుగుతోంది. వివాహమైన కొన్నేళ్ల తర్వాత ఆమె హత్యకు గురవుతుంది. కిన్నెర మరణానికి ముందే ఆమె అభ్యర్థన మేరకు ఇందు (ఆత్మీయ రాజన్)ను పెళ్లి చేసుకుంటాడు శేఖర్. వాళ్లకో కూతురు పుడుతుంది. తన నిర్లక్ష్యం వల్లే కిన్నెర చనిపోయిందనే వేదనతో శేఖర్ పోలీస్ ఉద్యోగం వదిలేస్తాడు. భార్యతోనూ జీవితాన్ని సాగించలేక విడాకులిస్తాడు. అయితే కూతురు గీత (శివానీ రాజశేఖర్)ను మాత్రం తన దగ్గరే ఉంచుకుని అల్లారు ముద్దుగా పెంచుతాడు. జీవితం ఇలా సాగుతున్న సమయంలోనే రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మాజీ భార్య, కూతురు ఇద్దరూ మరణిస్తారు. వాళ్ల మరణాల వెనుక ఉన్న మిస్టరీ ఏమిటీ? దాన్ని శేఖర్ ఎలా ఛేదించాడు? ఆ క్రమంలో తన జీవితాన్ని ఎలా పణంగా పెట్టాడు? అన్నదే మిగతా కథ.

నాలుగేళ్ల క్రితం వచ్చిన మలయాళ చిత్రం 'జోసఫ్'ను జీవిత దర్శకత్వంలో శివానీ, శివాత్మికతో పాటు సుధాకర్ రెడ్డి, బొగ్గారం వెంకట శ్రీనివాస్ రీమేక్ చేశారు. ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ స్కామ్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ సినిమా కేరళలో విడుదలైనప్పుడు అక్కడి వైద్యులు కొందరు ఈ కథపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అవయవ దానంపై ప్రజలకు అనేక అపోహలు ఉన్న సమయంలో ఇలాంటి సినిమా తీసి, అవయవ దానం చేద్దామని అనుకుంటున్న వారి మనసును ఈ సినిమా కథ విరిచేసేలా ఉందని వాపోయారు. అయితే వైద్యరంగంలో జరుగుతున్న ఆర్గనైజ్డ్ ఆర్గాన్ స్కామ్‌ను ఎండగట్టడంలో ఎలాంటి తప్పులేదని మెజారిటీ ప్రేక్షకులు భావించడంతో ఈ సినిమా అక్కడ చక్కని విజయాన్నే అందుకుంది. కానీ మలయాళ చిత్రం విషయంలో జరిగిన మ్యాజిక్ ఇక్కడ రిపీట్ కాలేదు. రేర్ ఆర్గాన్స్‌ను కొందరు వ్యక్తులు; కొన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ ఓ ప్రణాళికా బద్ధంగా దొంగదారిలో వాడేసుకోవడంపై గతంలో కొన్ని చిత్రాలు వచ్చాయి. ఇది కూడా వాటిలో ఒకటి. అయితే ఇక్కడ హీరో దోషులను పట్టించడం కోసం తానే ఓ విక్టిమ్‌గా మారడం అనేది కొత్త పాయింట్. ఓ రకంగా ఇది ఆత్మాహుతి దాడి లాంటిది. అలాంటి నిస్సహాయ పాత్రలో రాజశేఖర్‌ను ఎవరూ ఊహించుకోలేరు. అతనికి ఉన్న యాంగ్రీ మ్యాన్ ఇమేజ్‌కు ఈ పాత్ర సెట్ కాలేదు.


రాజశేఖర్ ఈ మూవీలో ఒకటి రెండు సీన్స్‌లో మాత్రం కాస్తంత హుషారుగా కనిపించాడు తప్పితే మిగతా సినిమా అంతా అతని యాక్టింగ్ డల్‌గానే ఉంది. బాడీ లాంగ్వేజ్‌లో జోష్ లేకపోయినా.. ఆ పాత్రకు సాయికుమార్ డబ్బింగ్ చెప్పడంతో సీన్స్ కాస్తంత ఎలివేట్ అయ్యాయి. రాజశేఖర్ కూతురుగా సొంత కూతురు శివానీ చక్కని నటన ప్రదర్శించింది. మలయాళ జోసఫ్‌లో నటించిన ఆత్మీయ రాజన్ తెలుగులోనూ నటించడం విశేషం. జార్జిరెడ్డి ఫేమ్ ముస్కాన్ రాజశేఖర్ ప్రియురాలిగా నటించింది కానీ ఆమె పాత్రకు పెద్దంత గుర్తింపు దక్కదు. ఇన్వెస్టిగేట్ ఆఫీసర్ శేఖర్ సహాయకులుగా సమీర్, భరణీ శంకర్, రవివర్మ నటించారు. ఇతర ప్రధాన పాత్రలను అభినవ్ గోమఠం, కిశోర్, పోసాని, కృష్ణంరాజు, శ్రావణ్, కవిత, ప్రసన్న కుమార్ తదితరులు పోషించారు. ఇక సినిమా చివరిలో వచ్చే ఓ కీలకమైన న్యాయవాది పాత్రలో ప్రకాశ్‌రాజ్ కొద్దిసేపు మెరిసారు. లక్ష్మీ భూపాల్ సంభాషణలు పాత్రోచితంగా ఉన్నాయి. అనూప్ రూబెన్స్ నేపథ్య సంగీతంతో పాటు స్వరపరిచిన గీతాల్లో 'కిన్నెర... ఓ కిన్నెర' పాట బాగుంది. ఇది రీమేక్ సినిమా కాబట్టి దర్శకురాలి ప్రతిభ అమోఘం అని అనలేం. ఎందుకంటే ఇందులోని సన్నివేశాలేవీ గొప్పగా లేవు. సినిమా సాదాగా అలా సాగిపోతూ ఉంటుంది. ఎలాంటి ఉద్వేగం, ఉద్విగ్నం ప్రేక్షకులకు కలగదు. నిజానికి ఇలాంటి ఇన్వెస్టిగేట్ థ్రిల్లర్ మూవీస్‌కు సస్పెన్స్ ప్రధానం. కానీ ఇందులో తర్వాత సన్నివేశాలలో ఏం జరుగుతుందనేది ప్రేక్షకుల ఊహకు అందుతూనే ఉంటుంది. నిర్మాతలు రాజీపడకుండా ఈ మూవీని తెరకెక్కించినా, కథ, కథనాలు గొప్పగా లేకపోవడంతో ప్రేక్షకులు తీవ్రనిరాశకు గురి కాకతప్పదు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు














వెల : ₹.200/- | వెల : ₹.200/- | వెల : ₹.390/- | వెల : ₹.300/- | వెల : ₹.200/-

















వెల : ₹.250/- | వెల : ₹.200/- | వెల : ₹.200/- | వెల : ₹.250/- | వెల : ₹.250/-












వెల : ₹.599/- | వెల : ₹.349/- | వెల : ₹.695/- | వెల : ₹. 799/- | వెల : ₹.50/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ – 2, దూరవాణి : 63035 41244

From:
JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1,
Lingampally, Kachiguda,
Hyderabad-500027
web : jagritiweekly.com

Publishing on Every Thursday
Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023
RNI Regd. No. 3270/57.
Volume : 74 Issue : 31


# MAHAVEER
## GROUP OF INSTITUTIONS

( AN ISO 9001-2008 CERTIFIED INSTITUTION)







Counseling Code : MHVR

**MAHAVEER INSTITUTE OF SCIENCE & TECHNOLOGY**

(Approved by AICTE, Affiliated to JNTUH, Hyderabad.)

Estd : 2001

Email: mist.admissions@gmail.com | website : mist.ac.in

Courses Offered :

| | | |
|---|---|---|
| B.Tech | ECE \| EEE \| CSE \| IT \| MECH. \| CIVIL \| AERO | PG |
| M.Tech | DE & CS \| VLSI \| PE & ES \| CSE \| SE \| AMS | MBA |

Counseling Code : MHVR

**MAHAVEER Institute of Science & Technology Polytechnic** (2nd Shift)

Estd : 2009

(Approved by AICTE, Affiliated to SBTET Hyderabad.)

Courses Offered :

Email: mist.admissions@gmail.com | website : mist.ac.in

Polytechnic: DECE | DEEE | DCME | DME | DCE

Counseling Code : AARM

**AAR MAHAVEER ENGINEERING COLLEGE**

(Approved by AICTE, Affiliated to JNTUH, Hyderabad.)

Estd : 2010

Email: aarm.admissions@gmail.com | website : aarm.ac.in

Courses Offered :

B.Tech: ECE | EEE | CSE | MECH.

**MAHAVEER DEGREE COLLEGE**

For Arts, Commerce & Science

Estd : 2014

(Approved by Telangana Govt. - Affiliated to Osmania University)

Courses Offered :

Email: mdc.admissions@gmail.com | website : mahaveerdegreecollege.com

B.Com: Computers & General | B.Sc: MSCs

Sponsored by MAHAVEER EDUCATIONAL SOCIETY

**FOR NRI / MANAGEMENT SEATS**

Ph: 040-29880079, 29880086, 29880089, 29880081, 29880087

Cell : 9542001907, 9849944411

Vyasapuri, Bandlaguda, Post : Keshavgiri, Hyderabad - 500 005.